ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 11.05.2026 | సంపుటి : 12 సంచిక : 291 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## కాంగ్రెస్ అంటే.. ముస్లిం లీగ్ మావోవాది పార్టీ

ప్రధాని మోదీ కొత్త జోస్యం

- సైబరాబాద్ అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారింది
- దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది
- రాష్ట్రాల అభివృద్ధి లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదు



సైబరాబాద్ సామర్థ్యం జాతీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఉంది. తెలంగాణకు, దేశానికి వికాస కేంద్రంగా దోహదపడుతోంది. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధ పడుతున్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ను గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ఉంటా యి. ఈసారి తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుంది. తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ కట్టుబడి ఉంది.
- ప్రధాని మోదీ

- గుజరాత్‌తో సమానంగా తెలంగాణకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం
- పశ్చిమబంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది
- తెలంగాణ ప్రజల నుంచి కూడా అలాంటి ఉత్సాహమే కనిపిస్తోంది
- రాష్ట్రంలో ఈసారి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ భాజపా బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగం
- హెచ్ఐసీసీ నుంచి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

**హైదరాబాద్/సికింద్రాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ అంటే ముస్లింలిగ్ మావోవాది పార్టీ అని ప్రధాని మోదీ కొత్త జోస్యం చె ప్పారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ఉంటాయి. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందన్నారు. ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలే. ఈసారి తెలంగా ణలోనూ బీజేపీ సర్కార్ వస్తుంది. మిగతా 2లో..

## నేను అందరివాడిని..

తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణం

ఆయనతో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా...

ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్



- మాది సెక్యులర్ గవర్నమెంట్
- పెరియార్,ద్రవిడ స్పూర్తి కొనసాగుతుంది
- దక్షిణాదిన మరో ఇండియా కూటమి సర్కార్
- ముఖ్యమంత్రిగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై తొలిసంతకం చేసిన విజయ్

**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇందుకు చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికైంది. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, ఇతర రాజకీయ, సినీరంగ ప్రముఖులు హాజరయ్యారు. నటి త్రిష వేదిక వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విజయ్‌తో పాటు తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఎన్. ఆనంద్, ఆదవ అర్జున, కె.ఎ. సెంగోటియన్, ఎస్ కీర్తన, కె.జి. అరుణ్ రాజ్, పి. వెంకటరమణన్, సి.ఆర్. నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, టి.కె. ప్రభు ఉన్నారు. కార్యక్రమానికి భాజపా నేతలు నైనార్ నాగేంద్రన్, కె.అన్నామలై హాజరయ్యారు. మే 4వ తేదీన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడగా.. టీవీకే అతిపెద్దపార్టీగా అవతరించిన సంగతి తెలిసిందే. మెజార్టీ మార్క్‌కు 10 సీట్ల దూరంలో నిలవడంతో కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంల్ పార్టీల మద్దతు అవసరమైంది. మిగతా 2లో..

### ప్రధాన ఆకర్షణగా రాహుల్

సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరయ్యారు ఈ వేడుకలో రాహుల్-విజయ్ పక్కపక్కనే కనిపించారు. కలిసే ఇరు పార్టీల కార్యకర్తలకు అభివాదం చేశారు. వీరి స్నేహం అందరి దృష్టిని ఆకర్షించింది



### మీ పరిపాలన అద్భుతంగా సాగాలి

- విజయ్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు
- కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ప్రజల కోసం కృషి చేస్తూనే ఉంటుంది:రాహుల్
- ఇచ్చి హామీలను నెరవేరుస్తారని ఆశిస్తున్నా:స్టాలిన్
- రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఉన్నత శిఖరాలకు చేరుస్తారని బలంగా నమ్ముతున్నా: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

2లో..



## దేశానికి సింహభాగం ఆదాయమిస్తున్నాం

ఆరు నగరాలను ప్రోత్సహించండి • పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయండి

- ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ వినతి
- ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయి
- ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదు
- ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదు.. అభివృద్ధి ఉత్సవం
- వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని, ఇది అభివృద్ధి ఉత్సవమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్లేందుకు అవసరమైన అభివృద్ధి ఉత్సవమని, ప్రధాని ప్రణాళిక అయిన వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఐదు మిగతా 2లో..

ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయి. ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదు. అభివృద్ధి గురించే మాట్లాడదాం. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుంది. కేంద్ర మంత్రులను నేను తరచూ కలుస్తుంటాను. కొన్ని పనులు అయ్యాయి. ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయి. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలి. తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలి"
- సీఎం రేవంత్ రెడ్డి,

## ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు




**హైదరాబాద్(జనంసాక్షి):** ఈ ఏడాది ఇంటర్ అడ్మిషన్లను యథావిధిగా కొనసాగించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే అంశంపై అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఈ ఏడాది ఇంటర్ ప్రవేశాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండటం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటంతో.. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియ చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని, ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. తెలంగాణలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదని గతంలోనే సర్కారు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. దీంతో ఈ నెల 4న ఇంటర్ ప్రవేశాల కోసం షెడ్యూల్ విడుదల చేసిన బోర్డు. మరుసటి మిగతా 2లో..

## జూన్ 2 వరకే గడువు

ప్రభుత్వానికి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత అల్టిమేటం



**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు జూన్ 2 వరకు గడువు ఇస్తున్నామని.. అప్పటిలోగా అమలు చేయాల్సిందేనని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఉద్యమకారుల సంఘాలతో టీఆర్ఎస్ చీఫ్ సమావేశం అయ్యారు. ఉద్యమకారుల డిమాండ్లకు కవిత మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అప్పటికీ హామీలు అమలు చేయకుంటే ఉద్యమకారులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జార్ఖండ్ ప్రభుత్వం ఉద్యమకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాల తరహాలో తెలంగాణలో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భువనగిరి జిల్లా కేంద్రంలో సభ నిర్వహించాలని, భూ పోరాటాలు ఉధృతం చేయాలని, జిల్లాల వారీగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు రూప్ సింగ్, సయ్యద్ ఇస్మాయిల్, మలి దశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మూల ప్రభాకర్ గౌడ్, కార్యదర్శులు వెలమల రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల మిగతా 2లో..

## అమెరికాకు మద్దతిస్తే మీ నౌకలకూ ఇబ్బందే


తమపై ఆంక్షలకు మద్దతు ఇస్తున్న దేశాలకు ఇరాన్ హెచ్చరిక

- యుద్ధంలో శత్రువు లక్ష్యాల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని వెల్లడి
- తమను అడ్డుకోవడంలో విఫలమైనందునే అమెరికా అందుకే కాల్పుల విరమణకు అంగీకరించిందని ఎద్దేవా





**టెహ్రాన్(జనంసాక్షి):** తమపై అమెరికా విధించిన ఆంక్షలకు మద్దతు ఇస్తున్న దేశాలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ఇరాన్ హెచ్చరించింది. ఆయా దేశాల నౌకలు హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించేటప్పుడు అంతరాయాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. యుద్ధంలో శత్రువు లక్ష్యాల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని పేర్కొంది. తమను అడ్డుకోవడంలో అమెరికా విఫలమైందని, అందుకే కాల్పుల విరమణకు అంగీకరించిందని ఎద్దేవా చేసింది. ఇరాన్‌పై అమెరికా ప్రభుత్వం ఇటీవల కొత్తగా ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. హర్మూజ్ జలసంధిని దాటి వెళ్లడానికి ఇరాన్‌కు డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించింది. మిగతా 2లో..



## ఖతార్‌లో బల్క్ క్యారియర్‌పై దాడి

**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో ఓ బల్క్ క్యారియర్ నౌకపై దాడి జరిగింది. ఖతార్ రాజధాని దోహాకు సమీపంలో పెద్ద మొత్తంలో కంటైనర్లను మోసుకొస్తున్న నౌకపై గుర్తుతెలియని డ్రోన్ లేదా క్షిపణితో దాడి చేసింది. ఈ క్రమంలోనే నౌకలో మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని ఆదివారం బ్రిటిష్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ప్రకారం.. ఖతార్ రాజధాని దోహాకు 23 నాటికల్ మైళ్ల దూరంలో ఓ నౌక సరకును తరలిస్తుండగా మిగతా 2లో..





## హైదరాబాద్- విజయవాడ హైవేను పూర్తి చేయండి

8 లేన్ల విస్తరణ పనులు వీలైనంత త్వరగా చేపట్టాలి

అధికారులను ఆదేశించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** నిత్యం ప్రమాదాలతో డెత్ రోడ్‌గా పిలువబడుతున్న హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి 8 లేన్ల విస్తరణ పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్.హెచ్.ఎ.ఐ) ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ తో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇదే రహదారిలో ఎల్బీ నగర్ నుండి హయత్ నగర్ వరకు నాగపూర్ తరహాలో 7.1కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, డీపీఆర్ మోర్త్ కు పంపిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్- విజయవాడ (ఎన్.హెచ్-65) విస్తరణ పనులు ప్రారంభంపై ప్రత్యేకంగా చర్చించారు. వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. హైదరాబాద్- విజయవాడ హైవేతో పాటు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం కూడా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి అతి త్వరలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మిగతా 2లో..

## అమెరికాలో గద్వాల వాసి మృతి

ఫ్లోరిడాలో గుండెపోటుతో టెకీ హఠాన్మరణం



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో మరో ప్రవాస వ్యక్తి మృతిచెందారు. తెలంగాణలోని గద్వాల పట్టణానికి చెందిన జి.సునీల్ కుమార్ (51) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. ఫ్లోరిడాలోని టాంపా నగరంలో రెండు రోజుల క్రితం తన ఇంటి ఆవరణలోనే ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ప్రముఖ ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తున్న సునీల్ కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సునీల్ హఠాన్మరణంతో గద్వాలలోని ఆయన కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కొన్నేళ్లు చెన్నైలో పనిచేసిన ఆయన మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ పనిచేస్తూ ఇటీవలే మరో కంపెనీకి బదిలీ చేయించుకున్నట్లు సునీల్ చిన్ననాటి మిగతా 2లో..



## బట్టలు ఉతుకుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి..

తల్లీ.. ఇద్దరు కూతుళ్లు మృతి

**సంగారెడ్డి ప్రతినిధి,(జనంసాక్షి):** మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో బట్టలు ఉతకడానికి బావి వద్దకు వెళ్లిన తల్లీకూతుళ్లు ప్రమాదవశాత్తూ అందులో పడి మరణించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా మిగతా 2లో..



## అసోం ముఖ్యమంత్రిగా హిమంత

మే 12న ప్రమాణ స్వీకారం

**గవహాతి(జనంసాక్షి):** అసోం ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన హిమంతను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమిస్తున్నట్లు ఆదివారం రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మార్గం సుగమమైంది. మే 12వ తేదీ ఉదయం 11:40 గంటలకు ఖానాపారాలోని వెటర్నరీ కళాశాల మైదానంలో హిమంత ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చీఫ్ సెక్రటరీ పేర్కొన్నారు.



# దేశానికి సింహభాగం ఆదాయమిస్తున్నాం

రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయని, ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదని రేవంత్ పేర్కొన్నారు. అభివృద్ధి గురించే మాట్లాడదామని వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకున్నామని గుర్తు చేసిన ఆయన, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని తెలంగాణ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని, కేంద్ర మంత్రులను తాను తరచూ కలుస్తుంటానని అన్నారు. కొన్ని పనులు అయ్యాయని, ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయని మోదీ దృష్టికి తెచ్చారు. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలని, తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలని కోరారు. దేశానికి 10 శాతం జీడీపీ ఇస్తామని వాగ్దానం చేస్తున్నామని, మోదీకి విశాల హృదయం ఉందని కిషన్‌రెడ్డి చెబుతుంటారని, మోజీ తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు సహకరిస్తే వేగంగా అభివృద్ధి చెందుతామని అన్నారు.నగరాలను కేంద్రం ప్రోత్సహించాలి : దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందన్న సీఎం, దేశ జీడీపీకి తెలంగాణ 5 శాతం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. దేశ జీడీపీకి 10 శాతం వాటా ఇవ్వాలనే లక్ష్యంతో సాగుతున్నామని, దేశాభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశానికి సింహభాగం ఆదాయం ఇస్తున్న ఆరు నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని ప్రధానిని కోరారు.రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, తెలంగాణ ప్రాజెక్టులపై 2 గంటలు కేటాయించి సమీక్షించాలని మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్, మూసీ ప్రాజెక్టు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ - మచిలీపట్నం వరకూ 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేకు సహకరించాలని కోరారు.

## అమెరికాకు మద్దతిస్తే మీ నౌకలకూ ఇబ్బందే

ఇదే సమయంలో నౌకాయానంపై ఇరాన్ విధించిన ఆంక్షలు నిలిపివేయాలని కోరుతూ అమెరికా-బహ్రెయిన్‌లు ఓ ప్రతిపాదిత తీర్మానాన్ని రూపొందించినట్లు సమాచారం. ఈ పరిణామాలపై ఓ ఇరాన్ సైనికాధికారి స్పందిస్తూ.. హర్మూజ్‌లో చట్టపరమైన, భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ప్రయాణించే ఏ నౌక అయినా తమతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## ఖతార్‌లో బల్క్ క్యారియర్‌పై దాడి

గుర్తుతెలియని ఆయుధం తాకడంతో నౌకలో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పేశారు. దీంతో ప్రాణనష్టం తప్పిందని యూకేఎంటీఓ వెల్లడించింది. అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతం కాల్పుల విరమణ అమలవుతుండగా, పర్షియన్ గల్ఫ్‌లో ఈ దాడి చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడికి గురైన నౌక ఏ దేశానికి చెందినది, అందులోని సరకు వివరాలు తెలియరాలేదు.

## జూన్ 2 వరకే గడువు..

జేఏసీ అధ్యక్షులు బోగి పద్మ, నాయకులు గుస్సా రవీందర్, అరుణ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు పూస శ్రీనివాస్, కొడిమల కృష్ణ, డీఎస్ మాణిక్యమ్మ, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు రామగిరి ప్రకాశ్, ఉపాధ్యక్షులు బీరకాయల మధుసూదన్, భరత్ రెడ్డి, తొలి దశ ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షులు సాజిద సికిందర్, శ్రీవల్లి, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఉద్యమకారులతో కలిసి కవిత సహపంక్తి భోజనం చేశారు.

## అమెరికాలో గద్వాల వాసి మృతి

స్నేహితులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు అమెరికాలో అతడి సన్నిహితులతో పాటు తెలుగు సంఘాల ప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

## బట్టలు ఉతుకుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి

వెలుగులోకి వచ్చింది.సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బోర్గి గ్రామానికి చెందిన పరశురామ్, సావిత్రి(30) దంపతులు హైదరాబాద్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. బంధువుల పెండ్లి ఉండటంతో వారం క్రితం సొంత గ్రామానికి కుటుంబంతో వచ్చారు. అయితే గ్రామంలో సరిగ్గా నీటిసరఫరా లేకపోవడంతో బట్టలు ఉతకడానికి సావిత్రి గ్రామ పొలిమేరలో ఉన్న బావి వద్దకు వెళ్లింది. ఆమెతో పాటు ఇద్దరు కూతుళ్లు నిఖిత(10), నందిని (8) వెళ్లారు.అక్కడ బట్టలు ఉతుకుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ నందిని మొదట బావిలో జారిపడింది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించి వరుసగా నిఖిత, సావిత్రి కూడా బావిలో పడిపోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు వచ్చి బావి నుంచి వారిని వెలికితీశారు. కానీ అప్పటికే ముగ్గురు మరణించారు. ఈ ఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదని అన్నారు. తాగునీటి కోసం నిత్యం బావి వద్దకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.

## తెలంగాణలో ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

రోజే షెడ్యూల్ ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్‌ని పాఠశాల విద్యలో విలీనం చేయటంలో ముడిపడిన పలు సాంకేతిక సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం దీనిపై శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని సీఎం స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

## హైదరాబాద్- విజయవాడ హైవేను పూర్తి చేయండి

ఎన్.హెచ్.ఎ.ఐ ఛైర్మన్ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ఎన్.హెచ్.ఎ.ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, చేపట్టబోయే పలు ప్రాజెక్టుల అంశాలను మంత్రి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా నిలిచే ప్రాజెక్టులు త్వరగా పూర్తయేలా చూడాలని ఎన్.హెచ్.ఎ.ఐ ఛైర్మన్ ను మంత్రి కోరారు. మంత్రి వెంట రోడ్లు భవనాలు శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి ప్రావిణ్య, ఎన్.హెచ్.ఎ.ఐ రీజినల్ ఆఫీసర్ శివ శంకర్, ఆర్ అండ్ బి సీఈలు ధర్మారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.





# కాంగ్రెస్ అంటే ముస్లింలీగ్ మావోవాది పార్టీ

తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ కట్టుబడి ఉందన్నారు. కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో సమస్యలు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యుద్ధాలతో పొరుగుదేశాల్లో చమురు ధరలు పెరిగాయని, కానీ, ఆ ధరల భారాన్ని దేశ ప్రజలపై పడకుండా చూశామని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులతో బంగారం ధరలు పెరుగుతున్నాయని.. ఏడాది పాటు కొనుగోళ్లను నిలిపివేద్దామని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన భాజపా బహిరంగ సభలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. “దేశంలో ఏర్పడిన పెట్రోల్, డీజిల్ సమస్యలను వివిధ దేశాలతో మాట్లాడి అధిగమిస్తాం. దీర్ఘకాలంలో చమురు వినియోగాన్ని మనం తగ్గించుకోవాలి. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. రైల్వే రంగంలో డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాం. సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ అవసరం మనకు భారీగా తగ్గుతుంది. చమురు వాడకం తగ్గితే.. విదేశీ మారక ద్రవ్యం మిగులుతుంది. పండుగలు, శుభకార్యాలకు బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలి. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు నిలిపేద్దాం. బంగారం దిగుమతులు తగ్గితే.. విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుంది. విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ మ్యారేజ్‌లు తగ్గించుకోవాలి.వంటనూనెను కూడా మనం దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీనిలో స్వయం సమృద్ధి సాధించాలి. చాలా దేశాల్లో యూరియా బస్తా ధర రూ.3 వేలు ఉంది. భారత్‌లో రూ.300లోపే ఉంది. ఎరువుల వినియోగం తగ్గిద్దాం.. భూసారం పెంచుదాం. అన్నింటికీ దిగుమతులపైనే ఆధారపడితే దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది.నిత్యావసరాల్లో స్వదేశీ వస్తువులే ఎక్కువగా ఉండాలి. అవే వినియోగిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేయాలి. స్వదేశీ కేవలం భాజపా నినాదం కాదు.. ఇది దేశ విధానం” అని మోదీ అన్నారు. రాష్ట్రాల అభివృద్ధి లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పదేళ్లుగా గుజరాత్‌కే ఎక్కువ నిధులు ఇచ్చారని రేవంత్ రెడ్డి అంటున్నారని, కేంద్రం పదేళ్లలో గుజరాత్‌కు ఎంత ఇచ్చిందో చెప్పాలని రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నా అంటూ ఛలోక్తులు విసిరారు. దీంతో అందరి ముఖాల్లో నవ్వులు పూశాయి. మూడోసారి ప్రధాని అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ హైదరాబాద్ హైటెక్‌సిటీలోని హెచ్ఐసీసీ నుంచి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వర్చువల్ గా చేశారు. గుజరాత్‌తో సమానంగా తెలంగాణకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మోదీ ప్రకటించారు. సైబరాబాద్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, అనేక పెద్ద ప్రాజెక్టులు ఇక్కడ ప్రాణం పోసుకుంటున్నాయని తెలిపారు. సైబరాబాద్ అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారిందన్న మోదీ, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని గుర్తు చేశారు. వరంగల్ పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, టెక్స్‌టైల్ రంగంలో వరంగల్ పీఎం మిత్ర పార్కు కీలక పాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. దీంతో అక్కడ ఉద్యోగావకాశాలు భారీగా వస్తాయని చెప్పారు.ఉమ్మడి ఏపీ కంటే తెలంగాణకు రైల్వే బడ్జెట్ పెంచామని ప్రధాని మోదీ తెలిపారు. హైవేలపై కేంద్రం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, వాటి అభివృద్ధి ద్వారా తెలంగాణ కూడా లాభపడుతోందని అన్నారు. ఉమ్మడి ఏపీలో రైల్వే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కూడా దక్కేవి కావని గుర్తు చేశారు. ఇప్పుడు ఒక్క తెలంగాణకే రూ.ఐదున్నర వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ‘సీఎం రేవంత్‌రెడ్డి గారూ ఇది వింటున్నారా? తెలంగాణ అభివృద్ధికి కేంద్రం భరోసా ఇస్తుంది’ అని ప్రధాని మోదీ ప్రత్యేకంగా చెప్పారు. తెలంగాణ వికసిస్తే దేశం కూడా వికసిస్తుందని అన్నారు.అంతకుముందు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, అజహరుద్దీన్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ఘనస్వాగతం పలికారు. మోదీ పర్యటన దృష్ట్యా మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.పశ్చిమ బంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమబంగాల్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. అక్కడి ప్రజలు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం బీజేపీని గెలిపించుకున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రజల నుంచి కూడా అలాంటి ఉత్సాహమే కనిపిస్తోందని చెప్పారు. తెలంగాణలో ఈసారి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.అంతకుముందు తన కోసం కార్యకర్తలు తెచ్చిన పెయింటింగ్స్‌ను సేకరించాలని ప్రధాని ఎస్పీజీని ఆదేశించారు. పెయింటింగ్స్ వేసిన చిత్ర కళాకారులకు తిరిగి లేఖలు రాస్తానని చెప్పారు. ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. మోదీని చూసిన ఆనందంలో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలతో సభ ప్రాంగణాన్ని హోరెత్తించారు.రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్న ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్‌లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఇంత ప్రేమ చూపించటం తన అదృష్టమన్నారు. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందన్న ప్రధాని, ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని పేర్కొన్నారు. ఈసారి తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలేనని తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేసినట్లు మోదీ ప్రకటించారు. దేశం మొత్తానికి 7 పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కులు ఇస్తే, అందులో ఒకటి తెలంగాణకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, బీజేపీ దృష్టి ఎప్పుడూ అభివృద్ధి, ఉపాధి మీద మాత్రమే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ అలానే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో అన్నట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ఉంటాయని మండిపడ్డారు.దేశాన్ని ఇప్పటికే నక్సలైట్ల రహితంగా మార్చివేశామన్న మోదీ, తెలంగాణ కూడా నక్సలైట్ల రహితంగా మారిందని ప్రకటించారు. వికసిత్ తెలంగాణ లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు.




## మీ పరిపాలన అద్భుతంగా సాగాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీవీకే చీఫ్ విజయ్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆయన పరిపాలన అద్భుతంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రజల అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని అన్నారు. “తమిళ నాడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు అభినందనలు. ఈ ప్రజా తీర్పు సమాజంలో పెరుగుతున్న యువ గళాన్ని ప్రతిబింబిస్తోంది. దీనిని ఎప్పటికీ విస్మరించబోము. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ప్రజల కోసం కృషి చేస్తూనే ఉంటుంది” - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ “తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు అభినందనలు. ప్రజలకు సమన్యాయం, సంక్షేమంతో కూడిన పాలన అందిస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఉన్నత శిఖరాలకు చేరుస్తారని బలంగా నమ్ముతున్నా” - తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. “తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు హృదయపూర్వక అభినందనలు. నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని, పారదర్శక, ప్రగతిశీలమైన పాలనను అందిస్తుందని ఆశిస్తున్నా. తమిళనాడును మరింత అభివృద్ధి, సుసంపన్న దిశగా నడిపిస్తుందని ఆశిస్తున్నా” - ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. “తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కు అభినందనలు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని ఆశిస్తున్నా. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి గత ప్రభుత్వాన్ని నిందించవద్దని కోరుతున్నా” - ఎంకే స్టాలిన్

# నేను అందరివాడిని..

ఈ మద్దతు కూడగట్టుకునే క్రమంలోనే ప్రమాణ స్వీకారానికి కాస్త ఆలస్యమైంది. అంతకు ముందు బ్లాక్ అండ్ వైట్ ఫార్మల్ దుస్తుల్లో వేదికవద్దకు వచ్చిన విజయ్.. ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు వాటిపై బ్లాక్ బ్లేజర్ ధరించి ఆకట్టుకున్నారు.

**సీఎం విజయ్ టీమ్ ఇదే..**

తమిళనాడులో సస్పెన్స్ థ్రిల్లర్‌ని మరించేలా సాగిన రాజకీయ ఉత్కంఠ ముగియడంతో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది టీవీకే నేతలు మంత్రులుగా ప్రమాణం చేశారు. యువత, రాజకీయ అనుభవానికి తన క్యాబినెట్‌లో ప్రాధాన్యం కల్పించిన విజయ్.. పరిపాలనలోనూ సహాయంగా ఉండేలా సహచరులను ఎంచుకున్నారు. విజయ్ క్యాబినెట్‌లో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన తొమ్మిది మంది టీవీకే నేతల గురించి క్లుప్తంగా..కేఏ సెంగొట్టియన్: రాజకీయాల్లో దాదాపు 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం.. సామాన్య కార్యకర్తగా మొదలై.. 10 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎంజీఆర్ హయాంలో 1977లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి.. ఆ తర్వాత జయలలిత, పళనిస్వామి హయాంలో మంత్రిగా సేవలందించారు. ఎంజీఆర్ మరణానంతరం జయలలితకు మంచి విధేయుడిగా ఉన్నారు. పలు శాఖలకు మంత్రిగా పనిచేసినప్పటికీ రెవెన్యూశాఖ మంత్రిగా గుర్తింపు సాధించారు. పళనిస్వామితో విభేదాలతో 2025 నవంబర్‌లో అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురై.. ఆ తర్వాత విజయ్ సారథ్యంలోని టీవీకేలో చేరారు.

ఆధవ్ అర్జున: టీవీకే ముఖ్య నేతల్లో ఒకరు. బాస్కెట్‌బాల్ ప్లేయర్ కూడా. ప్రస్తుతం భారత బాస్కెట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడిగానూ ఉన్నారు. టీవీకేలో చేరకముందు వీసీకే పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కొంతకాలం పనిచేశారు. విల్లివాకం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఎన్.ఆనంద్ : విజయ్‌కు అత్యంత సన్నిహితులైన రాజకీయ సహచరుల్లో ఒకరు. టీవీకే ఆవిర్భావం, అభివృద్ధిలో సంస్థాగతంగా కీలక పాత్ర పోషించారు. తమిళనాడు అంతటా పార్టీ క్షేత్రస్థాయి నెట్ వర్క్‌ను, ప్రచార యంత్రాంగాన్ని సమన్వయం చేయడంలో కృషి చేశారు. ఈయన్ను ‘బుస్సీ ఆనంద్’గా పిలుస్తుంటారు. 2006లో పుదుచ్చేరిలోని బుస్సీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడమే ఇందుక్కారణం. తాజా ఎన్నికల్లో టీ నగర్ నుంచి గెలుపొందారు.

ఎస్.కీర్తన: శివకాశి నియోజకవర్గం నుంచి టీవీకే ఎమ్మెల్యేగా గెలుపొంది వార్తల్లో నిలిచారు కీర్తన. దాదాపు ఏడు దశాబ్దాల పురుషాధిపత్యానికి తెరదించి ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. ఆమె వయసు 29 ఏళ్లే. 1996లో విరుధ్‌నగర్ జిల్లాలో పుట్టిన కీర్తన.. బీఎస్సీ మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసి.. పొలిటికల్ కన్సల్టెన్సీని కెరీర్‌గా ఎంచుకున్నారు. క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించకముందు షోటైమ్ కన్సల్టింగ్, ఐప్యాక్ సంస్థల్లో పొలిటికల్ కన్సల్టెంట్‌గా, డిజిటల్ క్యాంపెయిన్ వ్యూహకర్తగా పనిచేశారు. తెదేపా, టీఎంసీ, డీఎంకే పార్టీలకు క్యాంపెయిన్ చేశారు.

కేజీ అరుణ్‌రాజ్: ఈయన మాజీ ఐఆర్ఎస్ అధికారి. వృత్తి రీత్యా వైద్యుడు కూడా. తన ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని విజయ్ పార్టీలో చేరారు. టీవీకే పాలసీ రూపకల్పన, క్యాంపెయిన్ విభాగాలకు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. నమక్కల్ జిల్లాలోని తిరుచెంగోడ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మద్రాస్ మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసి కృష్ణగిరి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గానూ సేవలందించారు.

ఆర్.నిర్మల్ కుమార్ : టీవీకే ముఖ్య నేతల్లో ఒకరు. ఎన్నికల అనంతరం వామపక్షాలతో పొత్తులకు సంబంధించిన చర్చలు జరిపి వారి మద్దతు కూడగట్టడంలో అత్యంత కీలక పాత్ర పోషించారు. టీవీకే ఐటీ, సోషల్ మీడియా విభాగం చీఫ్‌గానూ ఉన్నారు. మదురైలోని తిరుప్పరన్‌కుంద్రం నుంచి విజయం సాధించారు. తొలుత భాజపా ఐటీ, సోషల్ మీడియా విభాగంలో పనిచేసి.. ఆ తర్వాత కొంత కాలం అన్నాడీఎంకేలోనూ పనిచేశారు. 2025లో టీవీకేలో చేరి.. ఆ పార్టీ వ్యూహకర్తగా ఉన్నారు. ఇంజినీరింగ్, న్యాయశాస్త్రాల్లో గ్రాడ్యుయేట్ అయిన నిర్మల్.. టీవీకే ఐటీ, సోషల్ మీడియా విభాగం డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఉంటూ.. పార్టీ డిజిటల్ క్యాంపెయిన్‌కు కృషి చేశారు.

ఎ.రాజ్‌మోహన్ : ఈయన నటుడు, స్టాండప్ కమెడియన్. టీవీ యాంకర్, డైరెక్టర్ కూడా. టీవీకే ప్రచార కార్యదర్శిగా పనిచేశారు. ఎగ్మూర్ నుంచి గెలిచారు.

పి. వెంకటరమణన్: టీవీకే కోశాధికారిగా పనిచేసిన వెంకటరమణన్ అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. మైలాపూర్ నుంచి గెలుపొందారు. 2024లో టీవీకే తొలి రాష్ట్ర సదస్సులో వేలాది మంది పార్టీ కార్యకర్తలతో ఈయన ప్రమాణస్వీకారం చేయించారు.

డా. కేటీ ప్రభు: వృత్తి రీత్యా దంత వైద్యుడైన డా. ప్రభు.. శివగంగై జిల్లాలోని కరైకుడి నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఎన్‌టీకే పార్టీ వ్యవస్థాపకుడు, నటుడైన సీమన్‌ను ఓడించారు.

**సీఎం తొలి సంతకం ఆ ఫైల్‌పైనే**

**ముందు శ్వేతపత్రం విడుదల చేస్తాం: విజయ్**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలి సంతకం చేశారు. ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించే ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్ , మహిళల రక్షణకు ప్రత్యేక దళం దస్త్రాలపై సంతకాలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు.“తమిళనాడులో ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చింది. లౌకిక, సామాజిక, న్యాయశకం మొదలైంది. డైరెక్టర్ కుమారుడు నేడు సీఎం అయ్యాడు. నేను మీ అందరివాడిని. ఎన్నో కష్టాలు అధిగమించి ఈ స్థాయికి వచ్చా. నన్ను ఎంతోమంది ఎన్నో రకాలుగా ఇబ్బందిపెట్టారు. హామీల అమలుకు కొంత సమయం ఇవ్వండి. డీఎంకే ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం. సాధ్యమయ్యేవే చెబుతాం.. చెప్పిందే చేస్తాం. ఎనిమిది కోట్ల మంది నా చెంతనుండగా ఎంతటి అసాధ్యాలనైనా సాధించే విశ్వాసం నాకుంది. ఎవర్నైనా సరే ఎదుర్కొనే ధైర్యం నాకుంది. అది చాలు. నేనేమీ దేవదూతని కాదు. మీలాగే ఓ సాదాసీదా జీవితమే నాది కూడా. కాబట్టి మీ ఆకాంక్షలు నాకు తెలుసు. గుర్తుంచుకోండి.. ఈ విజయ్ ఒక్క పైసా కూడా ప్రభుత్వ సొమ్ము తినడు. నాకు ఆ అవసరం లేదని మీ అందరికీ తెలుసు. నేను తప్పు చేయను. నా చుట్టూ ఉన్నవాళ్లనీ చేయనివ్వను. గెలిచాం కదా.. ఓ ఆట ఆడేద్దాం అన్న ఆలోచన మీలో ఎవరికైనా ఉంటే దాన్ని ఇప్పుడే ఎరేజ్ చేయండి. మిత్రులైనా.. శత్రువులైనా.. అందరికీ తమ ప్రభుత్వంలో ఒకే చట్టం. విద్యార్థుల కోసం విజయ్ మామ అన్నీ మంచి పనులే చేస్తాడు” అంటూ పవర్‌ఫుల్ ప్రసంగం చేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. టీవీకేలో ఒకేఒక అధికార కేంద్రం ఉందని.. అదే విజయ్ మాత్రమేనని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తామని విజయ్(౧ఎఐ ఇఞ్రతివట ఎతితీజీఎ) వెల్లడించారు. విద్య, ఆహారం, వైద్య సేవలు, మహిళల భద్రతపై తమ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారిస్తుందని చెప్పారు. విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సంఖ్యాబలాన్ని కూడగట్టుకుంటున్న సమయంలో.. అన్నాడీఎంకే అధికారం కోసం రహస్యంగా ప్రయత్నాలు చేసిందన్న వార్తలు వచ్చాయి. ఈ ప్రసంగంలో అన్నాడీఎంకేపై విజయ్ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. తాను బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తిస్తానని, రహస్యంగా చేయనని పేర్కొన్నారు. తన ప్రయాణంలో విమర్శకులను సైతం కలుపుకొని వెళ్తానని వెల్లడించారు. “నన్ను విమర్శించి, అవమానించిన వారు కూడా నా ప్రజలే” అని స్పష్టం చేశారు.ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విజయ్ తల్లిదండ్రులు హాజరయ్యారు. మాతృదినోత్సవం రోజునే ఈ వేడుక జరగడం ఎంతో ఉద్వేగభరితంగా ఉందని ఆయన తల్లి శోభా చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు.ఈ వేడుకకు విజయ్ కుమారుడు జేసన్ విజయ్, కుమార్తె దివ్య సాశా హాజరుకాలేదు. విజయ్ నుంచి విడాకులు కోరుతూ ఆయన భార్య సంగీత చెంగల్పట్టు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు ముగ్గురు ఈ కార్యక్రమంలో కనిపించలేదు.

విజయ్ ప్రమాణ స్వీకారం.. వేదిక వద్ద త్రిష సందడి..!

తమిళనాడు ముఖ్యమంత్రిగా సినీ నటుడు విజయ్ ప్రమాణస్వీకార కార్యక్రమం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీనటి త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ వేడుకకు సినీనటి త్రిష సంప్రదాయ చీరకట్టులో వచ్చారు. మెడలో వజ్రాల నెక్లెస్ వేసుకున్నారు. సింపుల్ మేకప్, చిన్న బొట్టుపెట్టుకొని ఆకట్టుకున్నారు. ఉదయమే వేదిక వద్దకు వచ్చిన ఆమె.. తన ఫ్యాన్స్‌కు అభివాదం చేశారు. ఇక, ఎన్నికల ఫలితాల రోజు (మే 4న) త్రిష 43వ పుట్టిన రోజు కావడంతో తిరుపతి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్న సంగతి తెలిసిందే. అనంతరం విజయ్ ఇంటికి వెళ్లి అభినందించారు.

పెరంబూర్‌కు ఓకే.. తిరుచ్చి ఈస్ట్‌ను వదులుకున్న విజయ్

టీవీకే చీఫ్ విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి విజయ్ పోటీ చేశారు. ఆ రెండు స్థానాల్లో విజయం సాధించారు. తాజాగా తిరుచ్చి ఈస్ట్‌ను వదిలి పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించారు.

# రైతులను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- ధాన్యం కొనుగోలు విషయంలో పూర్తి నిర్లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



**రామకృష్ణాపూర్, మే 10 (జనంసాక్షి):** రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో అరెస్ట్ అయిన బాల్క సుమన్ ఆదివారం పోలీస్ స్టేషన్ లో సంతకానికి హాజరై మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వహిస్తుందన్నారు. రైతులు ఒకపక్క అరిగోస పడుతుంటే, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ప్రమాధంలో మృతి చెందిన రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపి మూలాఖత్ అయిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఇటీవల ఓ ప్రజాప్రతినిధి కేసు విషయంలో జరిగిన పరిణామాలనే ఉదాహరణగా చెప్పుకొచ్చారు. ఆయన వెంట చైర్మెన్ సద్యారాణి, పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్, నాయకులు మూల రాజిరెడ్డి, మేడిపల్లి సంపత్, మాజీ కౌన్సిలర్లు అనిల్ రావు, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి, కో-కన్వీనర్లు కే శ్రీదేవి, రాధా**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను వెంటనే అరెస్టు చేయాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బి.జ్యోతి, కో-కన్వీనర్లు కే శ్రీదేవి, రాధా డిమాండ్ చేశారు. 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాదులోని పేట్ బషీరాబాద్ పోలీసులు భగీరథపై పోక్సో యాక్టు ప్రకారం కేసు నమోదు చేశారని, కానీ అతన్ని ఇంతవరకు అరెస్టు చేయలేదని, కారణం ఇతడు బిజెపికి చెందిన కేంద్రమంత్రి కొడుకు కావడమేనని పేర్కొన్నారు. భగీరథను అరెస్టు చేయకపోగా మరోవైపు బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు డబ్బుల కోసం తనను బెదిరిస్తున్నారని శు క్రవారం కరీంనగర్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ముగ్గురిపై కేసు నమోదు అయిందయిందని, బిఎన్ఎస్ 308(5),351(2),61(2) రెడ్ విత్ 3(5) సెక్షన్లు ప్రకారం బాలిక ఆమె తల్లిదండ్రులపై కరీంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారని, ఒక గ్యాంగ్గా ఎవరినైనా భయపెట్టి, బెదిరించి డబ్బులు కానీ ఆస్తిని కానీ తీసుకున్నారనే ఆరోపణపై పెట్టే సెక్షన్లు ఇవని తెలిపారు. ఒక కేంద్రమంత్రి కొడుకును సామాన్యమైన కుటుంబాల వాళ్ళు బెదిరిస్తే వాళ్ళు బెదురుతారా ఇది ఎంత అసహజంగా ఉందో అందరూ అర్థం చేసుకోవాలని, ఒకవేళ బాలిక తల్లిదండ్రులు బెదిరించారే అనుకుంటే భగీరథ అప్పుడే కేసు పెట్టాలి కదా మరి ఇప్పుడు ఎందుకు పెట్టినట్టు? అని ప్రశ్నించారు. భగీరథ్ కేవలం తన పైన పోస్కో కేసు పెట్టినందుకు ప్రతిగా ఈ కేసు పెట్టాడని, ఈయన కరీంనగర్లో కేసు పెట్టడం వెనక అక్కడ పోలీసుల సపోర్టు దొరుకుతుందని ఉద్దేశమని, ఈ సందర్భంగా బండి సంజయ్ బాలిక తండ్రిపై నిర్మల్లో ఉన్నప్పుడు ఆయనపై నిర్మల్ పోలీస్ స్టేషన్లో కిడ్నాప్ కేసు నమోదు అయిందని తెలిపాడు. బాలిక కుటుంబం పై చెడు అభిప్రాయం కలగడానికి మాత్రమే సంజయ్ దీన్ని మాట్లాడు తున్నారని, బిజెపి మంత్రులు, ఎమ్మెల్యేలకు మహిళలపై అత్యాచారాలు చేయడం, లైంగిక దాడులు చేయడం ఇప్పుడు కొత్త కాదని, వీరి అండ చూసుకొని వీళ్ళ కొడుకులు కుటుంబ సభ్యులు ఇటువంటి లైంగిక దాడులు, చేస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేస్తే వారికి శిక్ష ఎక్కువ ఉండాల్సింది పోయి అసలు కేసులో నమోదు కాకుండా అవుతున్నా యని, ఉన్నావ్ సంఘటన, బ్రిడ్జ్ భూషణ్ పై అత్యాచార కేసులన్నీ ఇలాంటివేనని తెలిపారు. బండి సంజయ్ కొడుకు భగీరథుని వెంటనే అరెస్ట్ చేయాలని, మహిళలను గౌరవించని పార్టీ అధికారంలో ఉండడం సరికాదని పేర్కొన్నారు.

# నా పేరుతో నకిలీ ఖాతాలు

- అందులో అసత్యప్రచారం
- సైబర్‌క్రైమ్ పోలీసులకు రాజా సింగ్ ఫిర్యాదు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తన పేరుతో సోషల్‌మీడియాలో జరుగుతున్న అసత్యప్రచారంపై ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. తన పేరును వాడుకుంటూ నకిలీ ఖాతాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారం పోస్టు చేస్తూ తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. దీనిపై హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో ఎలాంటి ఖాతాలు లేవని రాజా సింగ్ స్పష్టం చశారు. తనకు కేవలం ఎక్స్(ట్విట్టర్)లో మాత్రమే అధికారిక ఖాతా ఉందని వెల్లడించారు. @TigerRajaSingh ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా మాత్రమే తాను అందుబాటులో ఉంటానని.. అందులో చేసే పోస్టులు, ప్రకటనలనే అధికారికంగా పరిగణించాలని సూచించారు. ఇతర సోషల్‌మీడియా వేదికల్లో తన పేరుతో ప్రచారంలో ఉన్న పోస్టులు, అందులోని సమాచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. తన పేరుతో నకిలీ ఖాతాలు నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సైబర్‌క్రైమ్ ఏసీపీని కోరినట్లు తెలిపారు. ఆ నకిలీ పేజీలను తక్షణమే బ్లాక్ చేసి, నిర్ధారణ లేని వార్తలను తన పేరుతో ప్రచారం చేసే సంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.



# గీత కార్మికులకు సబ్సిడీతో జీవన ఆధారం కల్పించాలి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**సారంగపూర్ (జనంసాక్షి) :** ప్రమాదకరమైన వృత్తిలో ఉన్న గీత కార్మికులకు ప్రభుత్వం సబ్సిడీ సౌకర్యాలు ఇచ్చి జీవన ఆధారం కల్పించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కోరారు. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం లచ్చక్క పేట గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి ప్రాణ ప్రతిష్ట, పట్నాల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎల్లమ్మ తల్లి ఆశీర్వచనాలు ,దీవెనలు గీత కార్మికుల పైన ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అన్నింటి కన్నా ప్రమాదకరమైన వృత్తి గౌడ సోదరుల గీత వృత్తి అని,గీత కార్మికులకు ఈత వనానికి 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులతో గౌడ సోదరుల వృత్తికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం బెల్ట్ షాపులను నిషేధిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బెల్ట్ షాపులను ఎత్తివేయాలని కోరారు.

# దడ పుట్టిస్తున్న వడగళ్ల వాన

**కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులకు తీవ్ర ఆందోళన**



**కాటారం, మే 10 (జనంసాక్షి) :** రబీ సీజన్‌లో ఎంతో ఆశతో వరి పంట సాగు చేసిన రైతులను అకాల వడగళ్ల వాన తీవ్రంగా కలవరపెడుతోంది. ఇప్పటికే కోతలు పూర్తి చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించిన రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా, తాజాగా కురుస్తున్న వడగళ్ల వాన వారి ఆందోళనను మరింత పెంచింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని పలు గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. అయితే కేంద్రాల్లో సరైన సదుపాయాల లేకపోవడంతో ధాన్యం కుప్పలు బహిరంగంగానే ఉండిపోతున్నాయి. ఇదే సమయంలో వడగళ్ల వాన కురవడంతో ధాన్యం తడిసి నాణ్యత కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

ధాన్యం కొలిచే కాంటాలు సకాలంలో జరగడం లేదు. హమాలీలు అందుబాటులో లేక లోడింగ్, అన్‌లోడింగ్ పనులు నిలిచిపోతున్నాయి. గన్ని సంచుల కొరత తీవ్రంగా ఉంది. ట్రాక్టర్లు, వాహనాలు రోజుల తరబడి కేంద్రాల వద్దే నిలిచిపోతున్నాయి. తగిన షెడ్లు లేక ధాన్యం వర్షానికి తడుస్తోంది. దీంతో రైతులు రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రాల వద్దే కాపలా కాస్తున్నారు. కొంతమంది రైతులు ధాన్యంపై తార్పాలిన్లు కప్పి రక్షించే ప్రయత్నం చేస్తున్నా, వడగళ్ల వాన కారణంగా అవి కూడా సరిపోవడం లేదని వాపోతున్నారు.

## తడిసిన ధాన్యంపై ఆందోళన

వర్షానికి తడిసిన ధాన్యంలో తేమ శాతం పెరిగే అవకాశం ఉంది. రంగు మారే ప్రమాదం ఉంది. నాణ్యత తగ్గిందని అధికారులు తిరస్కరించే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు. అదే సమయంలో ధాన్యం ఆలస్యంగా కొనుగోలు కావడంతో అప్పుల భారంతో ఉన్న రైతులు మరింత ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారు.

## రైతుల ఆవేదన

"పంట పండించడానికి పెట్టుబడులు పెరిగాయి. కోతలు పూర్తయ్యాక కనీసం ధాన్యం అమ్ముకుని ఊరట పొందుదామనుకుంటే కొనుగోలు కేంద్రాల్లో రోజులు గడుస్తున్నాయి. ఇప్పుడు వడగళ్ల వానతో ధాన్యం తడుస్తోంది" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులపై విమర్శలు కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు సరిగా చేయకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సరిపడా గన్ని సంచులు నిల్వ చేయకపోవడం, తగిన హమాలీలను నియమించకపోవడం, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయకపోవడం, వంటి కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.

## తక్షణ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్

రైతులు ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని గన్ని సంచులు అందుబాటులో ఉంచాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని హమాలీల సంఖ్య పెంచాలని వర్షాల సమయంలో ధాన్యం రక్షణకు షెడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వడగళ్ల వానతో ఒకవైపు పంట నష్టం, మరోవైపు కొనుగోలు కేంద్రాల సమస్యలు కలిసి రైతుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయని గ్రామీణ ప్రాంతాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# వైభవంగా ముగిసిన రైతు వారోత్సవాలు

**రైతు సంక్షేమం, ఆధునిక వ్యవసాయ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**
**వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన "రైతు వారం" కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అయినా ఉద్యానవన పట్టు పరిశ్రమ , విద్యుత్, మార్కెటింగ్, సహకార, పశుసంవర్ధక ,మత్స్య శాఖ, పౌర సరఫరా నీటిపారుదల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక, నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారని తెలిపారు.

మే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు వారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధ్రువీకరణ అధారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రైతు వారోత్సవాల్లో 222762 రైతులు,5850 అధికారులు,8157 ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారని, నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారని, వినియోగదారులు కోరుకునే మరియు మార్కెట్లో అధిక డిమాండ్ కలిగిన సన్న వరి రకాలు బీపీటీ 5204 , ఆర్ ఎన్ ఆర్ 15048, హెచ్ఎంటి, జైశ్రీరామ్, కే ఎన్ ఎం.1638, డబ్ల్యూ జి ఎల్ 44, డబ్ల్యూ జి ఎల్ 962, జేజిఎల్ 1798 వంటి రకాలను సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారని తెలిపారు.

మే 5న హనుమకొండలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ ఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారని, ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారని తెలిపారు. మే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారని, గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర (మీస్రా), మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారని తెలిపారు. మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారని, రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారని, 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, సబ్సిడీలపై అవగాహన కల్పించారని తెలిపారు. రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు మరియు ఆదాయాలు పెంచడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెగా రైతు మేళలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రైతులు పండించిన వరి మొక్కజొన్న జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గ చూపుతూ అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని సూచించారని తెలిపారు. దీనికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుం దని, ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఈ పంట పండించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని, వరికి బదులుగా పప్పు దినుసులు కూరగాయ పంటలను పూల మొక్కలను పండించడం ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారని తెలిపారు. ఈ వానాకాలం రైతుల కోసం ముందస్తుగానే ఎరువుల విత్తనాల అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను తిలకించారని తెలిపారు. రైతు వారం ఐదవ రోజున పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, రాష్ట్రవ్యాప్తంగా 593 కృత్రిమ గర్భధారణ క్యాంపులు నిర్వహించి, 35,336 పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారని, 2,654 మంది రైతులకు పచ్చిగడ్డి విత్తనాలు పంపిణీ చేశారని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల ఉత్పత్తి పెంపు, చెరువుల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారని తెలిపారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, సమగ్ర నీటి వినియోగం, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికపై వివరించారని, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువల మరమ్మత్తులు, చెరువుల పూడికతీత పనులు వేగవంతం చేయడంపై అవగాహన కల్పించారని, చెరువుల గట్లపై పిచ్చిమొక్కలు, కంపచెట్లు, గుర్రపుడెక్క తొలగింపు, కాలువల శుభ్రత కార్యక్రమాల ప్రాముఖ్యత వివరించారని తెలిపారు. చెరువుల నల్లమట్టి వినియోగం వల్ల నేల సారవంతం పెరుగుతుందని రైతులకు తెలియజేశారని, మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సమతుల్య నీటి వినియోగం, చెరువుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలతో రైతు వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఈ రైతు వారోత్సవ కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ అవగాహన ఆధునిక సాంకేతిక ఆర్థిక భరోసా అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి దోహదపడు తున్నాయి రైతు సంక్షేమం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగం మరింత బలపడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు.

# నర్సాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి






**నర్సాపూర్ (జనంసాక్షి) :** మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఆనంద్ గార్డెన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలను ఆటో ఢీకొనగా ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. నర్సాపూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్ లో ఫంక్షన్‌కు హాజరయ్యే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కౌడిపల్లి మండలం వెంకటరావుపేట గ్రామానికి చెందిన దిలీప్, మనోహర్ అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. శుభకార్యానికి వెళుతుండగా ఈ దుర్ఘటన జరగడం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర శోకసముద్రంలో మునిగిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

# ఖమ్మంలో వసూల్ రాజా!

- ఖమ్మం నడిబొడ్డు రెవెన్యూలో అక్రమార్కుడు
- ఏ పని కావాలన్నా చేయి తడపాల్సిందే
- ఉన్నతాధికారులంటే అతనికి లెక్కేలేదు
- అర్బన్ తహశీలాఫీస్ లో ఓ రెవెన్యూ ఇన్స్పెక్టర్ తీరు





**ఖమ్మం బ్యూరో(జనం సాక్షి) :** తహశీల్దారు ఆఫీసు చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగిన ఓ రైతు విసిగివేసారి ఏకంగా తహశీల్దార్ పై పెట్రోల్ పోసి హతమార్చిన ఉదంతాన్ని చూశాం. ఒక అధికారిని చంపాలన్న ఆలోచన వచ్చిందంటే అతన్ని ఆ అధికారులు ఎంతగా వేధించి ఉంటారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ ఘటన తర్వాత రెవెన్యూ అధికారుల్లో మార్పు మొదలవుతుందని అందరూ భావించారు. కాగా ఊహించినట్లు ఏమాత్రం మార్పు కనిపించకపోగా బల్ల కింద చేతులు పెట్టే అలవాటున్న అధికారులు మరింతగా రెచ్చిపోవడం అలవాటుగా మార్చుకున్నారు. ఖమ్మం అర్బన్ తహశీలాఫీస్ లో ఒక రెవెన్యూ అధికారి లంచాలకు మరిగి వసూల్ రాజాలా మారిపోయాడు. ఏ చిన్న పని కోసం వెళ్ళినా చేయి తడపనిదే పని పూర్తికాని పరిస్థితి అక్కడ నెలకొంది. జిల్లా కేంద్రంలోని ఖమ్మం అర్బన్ తహశీలాఫీస్ అంటే సాధారణ విషయం కానేకాదు. 4 లక్షల పైచిలుకు జనాభా కలిగిన ఖమ్మం నగరంలో ప్రతి ఒక్కరికీ రెవెన్యూ కార్యాలయంతో పని ఉంటుంది. ఆదాయం, క్యాస్ట్, లోకల్ ఏరియా, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్ వంటివి జనానికి అవసరమవుతూ ఉంటాయి. ఇలాంటి పనులపై ఆఫీస్ కి వస్తున్న అవసరార్థులను ఆ రెవెన్యూ ఇన్స్పెక్టర్ పీల్చి పిప్పి చేయడమే పనిగా పెట్టుకున్నాడు. కార్యాలయంలో ఒక ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని వారి ద్వారా పనులు పూర్తి చేయిస్తూ వసూళ్ల పరంపర సాగిస్తున్నాడు. ఆయన మాత్రం ఎప్పుడూ ఆఫీసులోని తన సీటులో పట్టుమని పది నిమిషాలు కూర్చుని ఎరుగడు. సాయంత్రం పొద్దుపోయాక ఆఫీసుకి వచ్చి వసూళ్ల కార్యం చక్కపెట్టుకుని వెళ్ళిపోతాడు. ఇక పనుల విషయానికొస్తే ఆదాయం సర్టిఫికెట్ మంజూరు కావాలన్నా చేయి తడపాల్సిందే. లేకుంటే వచ్చిన వారి మీద "మిరియాలు" నూరుతూ పని పెండింగ్ లో పెట్టేస్తాడు. ఓ వైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏసీబీ అధికారులు దాడులు జరుపుతూ ఇలాంటి లంచగొండి అధికారులపై వల విసురుతున్నారు. అయినా ఈ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాత్రం ఉన్నతాధికారులను సైతం లెక్క చేయకుండా ఒంటెద్దు పోకడ ప్రదర్శిస్తూ "జయ కృష్ణ" జపం చేస్తున్నాడు.

# తమిళనాట విజయ్ శకం

సినీ తెరపై "దళపతి"గా రాజ్యమేలిన విజయ్, ఈరోజు యువత మద్దతుతో నిజమైన పాలకుడయ్యారు. తమిళనాడులో 70 ఏళ్ల తర్వాత డిఎంకట్ట, ఏఐఏడిఎంకట్ట యేతర ప్రభుత్వంగా టీవీకే అధికారంలోకి వచ్చింది. ఇది చిన్న విషయమేమీ కాదు. ఇది తమిళ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం. నిజానికి సినీ గ్లామర్ నుండి రాజకీయాల్లోకి వచ్చి కేవలం అతి తక్కువ కాలంలోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తున్న విజయ్ పై భారీ అంచనాలు ఉన్నాయి. 2024లో పార్టీ స్థాపించి, 2026 ఎన్నికలలో మొట్టమొదటిసారి పోటీకి దిగి, నేరుగా ముఖ్యమంత్రి పీఠం అందుకోవడం ఇది భారత రాజకీయ చరిత్రలో అపూర్వమైన ఘటన. ఆచితూచి అడుగులు వేశారు, ఎక్కడా తొందరపాటుకు తావివ్వలేదు.

*ప్రమాణ స్వీకారం కేవలం ఒక లాంఛన కార్యక్రమం కాదు. అది ఒక రాజకీయ ప్రకటన. అక్టోబర్ 28, 2024న తన మొదటి రాజకీయ ప్రసంగంలోనే విజయ్ పెరియర్‌ను తన సైద్ధాంతిక నేతగా ప్రకటించారు. అన్నాదురై, కామరాజ్, అంబేద్కర్ లను సామాజిక న్యాయ ప్రతీకలుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారంలో పెరియర్ ఖ్యాతిని కీర్తించడం, తమిళ రాష్ట్ర గీతాన్ని ఆలపించడం ద్రవిడ రాజకీయ వారసత్వాన్ని తాను ముందుకు నడిపిస్తానని పంపిన స్పష్టమైన సంకేతం. మరోవైపు విజయ్ తన క్రైస్తవ గుర్తింపును స్వీకరిస్తూనే సెక్యులర్ రాజకీయాల గురించి నిర్భీతిగా మాట్లాడుతున్నారు. పెరియర్ నాస్తికతను అనుసరించనని చెప్పడం ద్వారా అన్ని వర్గాలనూ కలుపుకొని పోయే తెలివైన సమతుల్యతను చాటుకున్నారు. నేడు "సెక్యులర్‌గా ఉంటాను" అని ప్రకటించడం ఎన్డియే పాలన సాగిస్తున్న కేంద్రానికి ఇది నేరుగా ఒక సవాలు.*

సంపాదకీయం
జనంసాక్షి

కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, విసీకే, ఐయూఎంఎల్ పార్టీలు విజయ్‌కి బేషరతుగా మద్దతు ప్రకటించాయి. బిజెపితో చేతులు కలపకుండా ఈ ప్రత్యేక సెక్యులర్ కూటమిని సాధించడం కాంగ్రెస్ చతురతకు నిదర్శనం. దక్షిణాదిలో మళ్ళీ అడుగు పెట్టేందుకు ఇండియా కూటమికి ఇది వ్యూహాత్మక తలుపు తెరుచుకోవడమే. ప్రమాణ స్వీకారానికి రాహుల్ గాంధీ హాజరవడం ఈ ఘటన జాతీయ ప్రాముఖ్యతను చాటుతోంది. ఇది కేవలం ఒక రాష్ట్ర సీఎం ప్రమాణం మాత్రమే కాదు బిజెపి వ్యతిరేక కూటమికి దక్షిణాది బలాన్ని జతచేసే రాజకీయ ప్రకటన కూడా. ఎంజీఆర్, జయలలిత వంటి దిగ్గజాల వారసత్వాన్ని విజయ్ ఏ మేరకు కొనసాగిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరం. తెర మీద పాత్రలు పోషించడం వేరు, కోటి మంది జీవితాలకు బాధ్యత వహించడం వేరు. అభిమానుల హర్షధ్వానాల మధ్య మొదలైన ఈ యాత్ర ప్రజల నిరీక్షణలను నెరవేర్చగలదా? అదే అసలైన పరీక్ష. "విజయ్" అనే పేరుకు నిజమైన న్యాయం చేయడం ఇప్పటి నుండే మొదలవుతుంది.

## అమ్మ లేదు!



అమ్మ –అందరికీ అమ్మ!
అమ్మలేనిది ఎవ్వరు?
అమ్మతో అనుభవాలు
వేరు వేరు కావచ్చు!
భావోద్వేగాలు ఒక్కటే!
అనుభూతులు ఒక్కటే!
ఆర్థికసామాజికస్థితుల్లో
ధనికురాలైన అమ్మ!
మధ్యతరగతి అమ్మ!
పేదరాలైన అమ్మ!
అమ్మ ఏ అమ్మైనా
తల్లిపాలు ఒక్కటే!
అమ్మనన్ను కొట్టింది
తప్పుసరిదిద్దాటానికి!
అమ్మనన్ను తిట్టింది
'అలా' చెయ్యవద్దని!
అమ్మానాకోసం ఏడ్చింది
నాకుజబ్బుచేసినప్పుడు!
నిద్ర ఆహారాలుమానేసి
నాకు సేవచేసింది!
అమ్మకుపట్టనిఆనందం
ఫస్టుమార్కుసాధించా!
ఆటల్లో 'కప్పు' వస్తే
ఇంటింటికివెళ్లి చెప్పింది!
నాకు దిష్టితీసి
ముద్దుపెట్టుకుంది!
పండగలొస్తే నాకు
కొత్త బట్టలు వేసి
ఎంత మురిసిపోయింది!
ఆకళ్ళలో మెరుపును
ఏ కవీ వర్ణించలేదు!
అదీ అమ్మ ప్రేమ!
అమ్మ ఇప్పుడు లేదు
ఎప్పుడూ రాదు!
నాజీవితంలోనేనుఇంకా
విజయాలు సాధించాను!
చూసిపొంగిపోవటానికి
అమ్మ ఏదీ? అమ్మలేదు!

**(మాతృదినోత్సవం సందర్భంగా అమ్మకు ప్రేమతో)**

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## కార్మికుల ఆదాయంపై కార్పొరేట్...
# తప్పుడు గణాంకాలతో నిజాల వక్రీకరణ

***ఈ రోజుల్లో ఆధునిక దోపిడీ స్వరూపాలు మారాయి. దేశాలను సైన్యాలతో ఆక్రమించే కాలం పోయి, మనుషుల శ్రమను, వారి గౌరవప్రదమైన జీవనాన్ని నేరుగా లూటీ చేసే కాలం వచ్చింది. ఈ దోపిడీని మరుగు పరచడానికి కార్పొరేట్ శక్తులు ఉపయోగించే తాజా ఆయుధం రంగురంగుల గణాంకాల ఛార్టుల నివేదికలు. వాటిలో ఒకటి 'వర్క్ ఇండియా' వేతన నివేదిక . ఇది ఒక తప్పుల తడిక. దీన్ని పైపై చూస్తే భారతదేశంలోని బ్లూ కాలర్ కార్మికులు గాలిలో తేలియాడుతున్నట్టు, వారి జీవితాలు స్వర్ణయుగంలోకి అడుగుపెట్టినట్టు అనిపిస్తుంది. కానీ వాస్తవం చూస్తే ఇది దశాబ్దాలుగా కార్మికులు రక్తం చిందించి సాధించుకున్న హక్కులపై జరుగుతున్న క్రూరమైన దాడి.***



ఈ నివేదిక ప్రకారం, 2024లో సగటు వేతనం నెలకు 14,056 రూపాయలు ఉంటే, 2025లో ఎనిమిది శాతం పెరిగి 15,265 రూపాయలకు చేరింది. ఇది వైట్ కాలర్ ఉద్యోగుల కంటే ఎక్కువ వృద్ధి సాధించినట్లు ప్రచారం చేస్తున్నారు. డెలివరీ, డ్రైవింగ్, తయారీ రంగాల్లో కొంత ఎక్కువ ఆదాయం పెరిగినట్టు చూపిస్తున్నారు. కానీ ఈ సంఖ్యలు కాగితం మీద మాత్రమే అద్భుతంగా కనిపిస్తాయి. కానీ కార్య క్షేత్రంలో పరిశీలిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి.ఇదే విషయాన్ని ఫ్యాక్టరీల్లో, నిర్మాణ సైట్లలో కష్టపడే సాధారణ కార్మికుడిని అడిగితే ఈ వృద్ధి డొల్లతనం వెంటనే బయట పడుతుంది.

నిజమైన సమస్య ధరల పెరుగుదల. కూరగాయలు, పెట్రోలు, అద్దెలు, విద్యుత్ బిల్లులు, రవాణా ఖర్చులు సంవత్సరానికి పది నుంచి ఇరవై శాతం వరకు పెరుగుతున్నాయి. అధికారిక ద్రవ్యోల్బణం సగటున మూడు నుంచి ఐదు శాతం మధ్య ఉన్నప్పటికీ, కార్మికుల రోజువారీ జీవన వ్యయం దానికంటే చాలా ఎక్కువగా ఉంది. రెండు వేల రూపాయల పెరుగుదలతో కుటుం బం పోషణ ఎలా సాధ్యం? ఇది కడుపు నింపడం కాదు, అప్పుల ఊబిలో ముంచేస్తుంది.

జాతీయ కార్మిక వేతన కమిషన్లు, కేంద్ర ప్రభుత్వం సెమీ-స్కిల్డ్ కార్మికులకు రోజుకు 868 రూపాయలు (నెలకు సుమారు 22,500 రూపాయలు) కనీస వేతనం నిర్ణయించాయి. కానీ నివేదికలో చూపించిన 15,265 రూపాయలు దానికి బాగా తక్కువ. అనేక చోట్ల ఇది కూడా అమలు కావడం లేదు. ఇక్కడ గౌరవప్రదమైన జీవనం అంటే ఏమిటి? రాజ్యాంగం 21వ అధికరణం కేవలం గాలి పీల్చుకోవడం కాదు, మానవుడు తన కుటుంబంతో ఆనందంగా, గౌరవంగా జీవించాలని చెబుతుంది. కానీ ప్రస్తుత వేతనాలు ఆ హక్కును కాలరాస్తున్నాయి.

వైట్ కాలర్ ఉద్యోగులకు ఖర్చు భత్యాలు, ఆధార భత్యాలు, ఉద్యోగ భద్రత ఉంటాయి. వారు ఎయిర్ కండిషన్ గదుల్లో పని చేస్తారు. కానీ బ్లూ కాలర్ కార్మికులు ఎండలో కాలి, వర్షంలో తడిచి, అగ్ని గుండాల్లో కరిగి, రసాయనాల మధ్య ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తారు. వారికి దక్కేది కేవలం కనీస వేతనం మాత్రమే. ఈ రెండు వర్గాలను కలిపి పోల్చి "బ్లూ కాలర్ వారి వేతనాలు ఎక్కువగా పెరుగుతున్నాయి" అని చెప్పడం పచ్చి అబద్ధం. ఇది కార్మికుల మధ్య విభేదాలు సృష్టించి, వారి మధ్య ఉన్న ఐక్యతను చీల్చి, అసలు దోపిడీదారుడిని రక్షించే కుట్ర దాగి ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒక పాత వ్యూహం ఉంది... బాధితులను ఒకరిపై ఒకరిని పోట్లాడేలా చేయడం. ఇప్పుడు అదే జరుగుతోంది. కార్మికులను ఒకరినొకరు సందేహించేలా చేసి, యాజమాన్యాల లాభాలను కాపాడుతున్నారు.

ఇంకొక భయంకరమైన విషయం పాత కార్మిక చట్టాల సవరణ. శతాబ్దాల కష్టాలతో, అనేక పోరాటాలతో సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి, "వ్యాపారాలకు సౌకర్యం" పేరుతో యాజమాన్యాలకు అనుకూలంగా మలిచారు. ఒప్పంద కార్మికులను సులభంగా నియమించడం, తొలగించడం, సమ్మె హక్కుపై పరిమితులు ... ఇవన్నీ శ్రమ దోపిడీని చట్టబద్ధం చేస్తాయి. లాభాలు కార్పొరేట్ ఖాతాల్లోకి, నష్టాలు కార్మికుల నెత్తిన. అంతర్జాతీయ సంక్షోభాలను సైతం వేతనాలు అదుపులో ఉంచడానికి సాకుగా వాడుకుంటున్నారు. నిజమైన అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు. ప్రతి కార్మికుడి జీవితం గౌరవప్రదంగా ఉండాలి. దేశంలో అనధికారిక రంగం ఇప్పటికీ ఎనభై-తొంభై శాతం ఉంది. అక్కడ భద్రత, సామాజిక రక్షణ లేవు. మహిళా కార్మికుల వేతనాలు మరింత తక్కువగా ఉండటం మరో విషాదం.

ఈ అంకెల మాయను గుర్తించాలి. బ్లూ కాలర్, వైట్ కాలర్ భేదాలు మరచి అందరూ ఐక్యంగా నిలబడాలి. కార్మిక సంఘాలు బలపడాలి. కనీస వేతనాలు నిజమైన జీవన వ్యయానికి అనుగుణంగా నిర్ణయించాలి. కార్మిక చట్టాలను కార్మికులకు అనుకూలంగా సవరించాలి. ప్రభుత్వాలు కార్పొరేట్ లాబీలకు కాకుండా శ్రామికుల హక్కులను కాపాడాలి. ఇది కేవలం జీతభత్యాల సమస్య మాత్రమే కాదు. ఇది శ్రామిక వర్గం మనుగడకు, కార్పొరేట్ దోపిడీకి మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ విషయాన్ని గుర్తించి, ఐక్యంగా పోరాడితేనే గెలుపు సాధ్యం. శ్రామికుల ఐక్యతే వారి నిజమైన బలం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# డక్కలి వారు కూడా జానపద కళాకారులే!



గ్రామీణ తెలంగాణ సంస్కృతి యొక్క ఆవిష్కర్తలు, సంరక్షకులు ఎవరు? పల్లెపాటలు, జానపద గేయాలు, పురాణ కథలు, యక్షగానాలు... ఇవన్నీ ఎవరి కంఠాల నుంచి పుట్టి, తరతరాలుగా ప్రవహిస్తున్నాయి? రాగతాళాలు తెలియకపోయినా లయబద్ధంగా పాట పాడి, ఆటలు ఆడి, ప్రజలను ముగ్ధుల్ని చేసే ఆ కళాకారులు ఎవరు? వారే – డక్కలి కులస్తులు.

డక్కలి వారు కేవలం బిక్షాటన చేసే వారు కాదు. వారు జానపద సంస్కృతి యొక్క జీవన వాహకాలు. మాదిగ సమాజం నుంచి భిక్ష స్వీకరించడానికి ముందు వారు వంశవృక్షాలు చెప్పాలి, జానపద కథలు వినిపించాలి, పురాణాలు కళ్లకు కట్టినట్టు ఆవిష్కరించాలి. ఇది వారి హక్కు మాత్రమే కాదు –వారి గౌరవం, వారి ఉనికి.

**జాంబపురాణం చెప్పే సోదరబంధం**

జాంబపురాణం ప్రకారం జాంబవంతుడి ఇద్దరు కుమారుల్లో ఒకరు మాదిగవానిగా, మరొకరు డక్కలి వానిగా జన్మించారు. జాంబవంతుడికి దక్కని వాడు కాబట్టి 'దక్కలి' అని పేరు వచ్చింది. ఈ పురాణ కథ ఒక్కటే వారిద్దరి మధ్య ఉన్న లోతైన సంబంధాన్ని తెలియజేస్తుంది. కానీ వాస్తవ జీవితంలో డక్కలి వారు ఊరి బయట పెంటకుప్పల దగ్గరే జీవితం సాగించాల్సి వస్తోంది. చెప్పులు లేక, గొంగళి లేక, కంచం లేక, కేవలం మట్టి చిప్పతో భోజనం చేస్తూ జీవితం గడుపుతున్నారు.

వారు పందులు, గాడిదలు పెంచి జీవనం సాగిస్తారు. మహిళలు తాటాకు చాపలు అల్లి అమ్ముతారు. కొందరు వ్యవసాయ కూలీలుగా కూడా పని చేస్తారు. ఇప్పటికీ చాలా మంది సంచార జీవనమే గడుపుతున్నారు.

**డక్కలి బాలమ్మ - ఒక స్ఫూర్తి**

ఈ కులం నుంచి వచ్చిన అపూర్వ కళాకారురాలు డక్కలి బాలమ్మ. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన ఆమె 15 ఏళ్ల వయసు నుంచి కిన్నెర వాయిద్యం నేర్చుకొని, గాడిదలపై, ఒక్కరికాలంలో గుర్రంపై ఊరూరా తిరిగి పన్నెండు మెట్ల కిన్నెర సంగీతాన్ని అందించింది. భర్త చనిపోయిన తర్వాత కూడా ఒంటరి మహిళగా కుటుంబాన్ని పోషించిన ఆమె తెలంగాణ జానపద సంగీత రంగంలో ఒక మహత్తరమైన పేరు. 2018లో 90 ఏళ్ల వయసులో ఆమె మరణించినా, ఆమె కిన్నెర ధ్వని ఇప్పటికీ తెలంగాణ గ్రామాల్లో మోగుతూనే ఉంది.

కళను కాపాడాలి, కళాకారులను కాపాడాలి

డక్కలి కళాకారులు అక్షరజ్ఞానం లేకుండానే సృష్టించిన ఈ జానపద కళారూపాలు మన సంస్కృతి యొక్క ఆస్తి. ఆధునికత, సినిమా, టీవీల ప్రభావంతో ఈ కళలు క్రమంగా మరుగున పడుతున్నాయి. కళాకారుల ఆర్థి క స్థితి దయనీయంగా ఉంది. వారికి ప్రభుత్వం నుంచి సముచిత గుర్తింపు, ఆర్థిక సహాయం, ఆవాస సౌకర్యాలు, కళా ప్రోత్సాహక పథకాలు అవసరం.

జానపద కళలను కేవలం పండగల్లో మాత్రమే గుర్తుచేసుకుని మరచిపోకూడదు. వాటిని పాఠశాలల్లో, కళాశాలల్లో బోధించాలి. డక్కలి కళాకారులకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలి. ఎందుకంటే వారు మన సంస్కృతి యొక్క జీవనాడులు.డక్కలి వారిని గౌరవించడం ద్వారా మనం స్వయంగా మన సంస్కృతిని గౌరవించినట్టే. వారి కళ జీవించాలి. వారి జీవితాలు మారాలి.

**డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య**
**పీఎల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నిజాంపేట్,**



## నిత్య ఎరుక..

పడిపోయినప్పుడు
చేయందించే వేళ..
భుజం తట్టి
భరోసా ఇచ్చే దగ్గర..
పబ్బతి గట్టిన
చేతుల్ని
పిడికిళ్లు చేసే చోట..
వాడే మాటల్లో
కనికరం, కసి,
కర్తవ్య బోధ
సందర్భాలు
సరిపోకపోతే..
అపార్థాలకో..
అదనపు
గాయాలకో..
దారితీస్తాయన్న
ఎరుక
కమ్యూనిస్టులమ
నుకుంటున్న
మనకు మరింత
ఎక్కువుండాలి..
గాయపడిన స్థానంలో
దుఃఖంలో ఉన్న
వాళ్ళం..
దురుద్దేశాలు
లేకుండా
సాధారణ
మనుషులుగా..
అవతలివాళ్ళు చేసిన
టెక్నికల్ మిస్టేక్స్
పట్ల..
మరింత
సంయమనం
ప్రేమ అవగాహనలో
ఉండాలి..
మనమంతా కలిసి
వోడించాల్సిన
శత్రువు
మరొకడున్నాడన్న
నిత్య ఎరుకతో..
మెలకువలో
ఉండాలి...

**డా. ఇక్బాల్ పాషా**
**9440775732**

# బెంగాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రారంభమైంది !

*భారతదేశ రాజకీయ చరిత్రలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. స్వాతంత్ర్య పోరాట కాలం నుంచే బెంగాల్ సామాజిక చైతన్యం, రాజకీయ అవగాహన, మేధో సంపత్తి, సాంస్కృతిక ఉద్యమాలకు కేంద్రంగా నిలిచింది. భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడటానికి బెంగాల్ కీలక పాత్ర పోషించింది. 1947లో స్వాతంత్ర్యం అనంతరం బెంగాల్ రాజకీయాలు ఎన్నో మలుపులు తిరిగాయి. కాంగ్రెస్ ఆధిపత్యం నుంచి కమ్యూనిస్టు ఉద్యమం వరకు, అక్కడి నుంచి తృణమూల్ కాంగ్రెస్ ఎదుగుదల వరకు రాష్ట్ర రాజకీయాలు దేశ రాజకీయాలకు దిశానిర్దేశం చేశాయి. ప్రస్తుతం మరోసారి రాజకీయ మార్పు దిశగా బెంగాల్ అడుగులు వేస్తోందనే చర్చ దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. ముఖ్యంగా 2026 మే 4న జరిగిన రాజకీయ పరిణామాలు భారతీయ జనతా పార్టీకి కొత్త అవకాశాలు కల్పించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.*



1952లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చింది. డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి పునాది పడింది. పరిశ్రమలు, విద్య, ఆరోగ్య రంగాల్లో అనేక సంస్కరణలు జరిగాయి. 1952 నుంచి 1967 వరకు కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం కొనసాగింది. అయితే గ్రామీణ పేదరికం, భూసంస్కరణల లోపం, కార్మిక ఉద్యమాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచాయి. 1967లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడి బెంగాల్ రాజకీయాల్లో వామపక్ష శక్తులు ఎదగడం ప్రారంభమైంది. ఇదే భారత రాజకీయ చరిత్రలో పెద్ద మలుపుగా చెప్పవచ్చు.

1977లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) ఆధ్వర్యంలోని లెఫ్ట్ ఫ్రంట్ అధికారంలోకి వచ్చింది. జ్యోతి బసు నాయకత్వంలో ప్రారంభమైన వామపక్ష పాలన వరుసగా 34 సంవత్సరాలు కొనసాగింది. ఇది ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఎన్నికల ద్వారా నిరంతరంగా కొనసాగిన అత్యంత దీర్ఘకాల వామపక్ష పాలనగా గుర్తింపు పొందింది. 1977 నుంచి 2011 వరకు లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం భూసంస్కరణలు, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం, రైతు హక్కుల పరిరక్షణ వంటి చర్యలతో గ్రామీణ ప్రాంతాల్లో బలమైన మద్దతు సంపాదించింది. "ఆపరేషన్ బర్గా" పేరుతో సాగుచేసే రైతులకు భూహక్కులు కల్పించడం వల్ల లక్షలాది కుటుంబాలకు లాభం చేకూరింది. ఒక అంచనా ప్రకారం సుమారు 50% కంటే ఎక్కువ గ్రామీణ కుటుంబాలు ఈ విధానాల వల్ల ప్రయోజనం పొందాయి.

అయితే కాలక్రమేణా పరిశ్రమల అభివృద్ధి మందగించడం, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడం, పెట్టుబడులు రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోవడం వంటి సమస్యలు పెరిగాయి. 1990ల తరువాత ప్రపంచీకరణ ప్రభావం దేశవ్యాప్తంగా పెరుగుతున్న సమయంలో బెంగాల్ మాత్రం పరిశ్రమల పరంగా వెనుకబడిందనే విమర్శలు వచ్చాయి. నిరుద్యోగం పెరగడం, యువతలో అసంతృప్తి పెరగడం లెఫ్ట్ ఫ్రంట్‌కు నష్టాన్ని కలిగించాయి. ముఖ్యంగా 2006లో సింగూర్, నందిగ్రామ్ ప్రాంతాల్లో భూసేకరణ వివాదాలు వామపక్ష ప్రభుత్వంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించాయి. రైతుల భూములను బలవంతంగా తీసుకుంటున్నారనే ఆరోపణలతో ప్రజా ఉద్యమాలు చెలరేగాయి. ఈ ఉద్యమాలను మమతా బెనర్జీ బలంగా వినియోగించుకున్నారు.

2011 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. సుమారు 48% ఓట్లతో మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ అధికారంలోకి వచ్చింది. 34 సంవత్సరాల వామపక్ష పాలనకు తెరపడింది. "మా, మాటి, మనుష్" అనే నినాదంతో ప్రజలలో భావోద్వేగ అనుబంధాన్ని పెంచిన మమతా బెనర్జీ పేదల సంక్షేమం, మహిళా సాధికారత, మైనారిటీ వర్గాల మద్దతుతో తన రాజకీయ స్థిరత్వాన్ని పెంచుకున్నారు. కన్యాశ్రీ, రూపశ్రీ, స్వస్థ్య సాథీ వంటి పథకాల ద్వారా గ్రామీణ మహిళల్లో విశేష ఆదరణ పొందారు. ఐక్యరాజ్యసమితి కన్యాశ్రీ పథకాన్ని ప్రశంసించడం రాష్ట్ర ప్రభుత్వానికి అంతర్జాతీయ గుర్తింపును తెచ్చింది.

అయితే తృణమూల్ పాలనపై కూడా అనేక విమర్శలు వచ్చాయి. అవినీతి ఆరోపణలు, రాజకీయ హింస, పార్టీ ఆధిపత్యం, స్థానిక స్థాయిలో గూండా రాజకీయాలు పెరిగాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ముఖ్యంగా ఉపాధ్యాయ నియామక కుంభకోణం, బొగ్గు అక్రమ రవాణా, పశువుల స్మగ్లింగ్ కేసులు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీశాయి. 2021 ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ 47.9% ఓట్లు సాధించి 213 స్థానాలు గెలుచుకున్నప్పటికీ భారతీయ జనతా పార్టీ 38.1% ఓట్లు సాధించడం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. 2016లో కేవలం 10% ఓట్లతో ఉన్న బిజెపి 5 సంవత్సరాల్లోనే 38% దాటడం రాజకీయంగా విశేష పరిణామంగా మారింది.

బెంగాల్ రాజకీయాల్లో బిజెపి ఎదుగుదలకు అనేక కారణాలు ఉన్నాయి. జాతీయవాద భావజాలం, హిందుత్వ రాజకీయాలు, కేంద్ర సంక్షేమ పథకాల ప్రచారం, మతపరమైన ధృవీకరణ, తృణమూల్ వ్యతిరేక ఓట్ల సమీకరణ ప్రధాన కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉత్తర బెంగాల్ ప్రాంతాల్లో బిజెపి ప్రభావం గణనీయంగా పెరిగింది. మటువా సమాజం వంటి వర్గాల మద్దతు కూడా పార్టీకి లభించింది. సరిహద్దు రాష్ట్రం కావడంతో అక్రమ చొరబాట్లు, పౌరసత్వ సవరణ చట్టం వంటి అంశాలను బిజెపి బలంగా వినియోగించింది.

ఇటీవల 2026 మే 4న జరిగిన రాజకీయ పరిణామాలు బెంగాల్ రాజకీయాల్లో మరో కొత్త అధ్యాయానికి నాంది పలికాయని భావిస్తున్నారు. స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికలు, ప్రజా అభిప్రాయ సర్వేలు బిజెపికి పెరుగుతున్న మద్దతును సూచిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. పట్టణ మధ్యతరగతి, యువత, మొదటిసారి ఓటు వేసే వర్గాలలో బిజెపి ప్రభావం పెరుగుతోందని అంచనాలు వెలువడుతున్నాయి. కొంతమంది సర్వేల ప్రకారం బిజెపి ఓటు శాతం 40% దాటే అవకాశముందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునే పరిస్థితి ఏర్పడవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బెంగాల్ ప్రజలు ఇప్పటివరకు ఎప్పుడూ ఒకే రాజకీయ శక్తిని శాశ్వతంగా కొనసాగించలేదు. కాంగ్రెస్ నుంచి వామపక్షాలకు, అక్కడి నుంచి తృణమూల్‌కు అధికారం మారింది. అంటే బెంగాల్ ఓటరు రాజకీయంగా అత్యంత చైతన్యవంతుడు అని అర్థం. ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలు అన్న విషయాన్ని బెంగాల్ ఎన్నోసార్లు నిరూపించింది. పాలకుల పనితీరు, సామాజిక పరిస్థితులు, ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, రాజకీయ హింస, అవినీతి వంటి అంశాల ఆధారంగా బెంగాల్ ప్రజలు తమ తీర్పును మార్చుకుంటూ వచ్చారు.

బెంగాల్ రాజకీయాల ప్రత్యేకత ఏమిటంటే అక్కడ భావజాల రాజకీయాలు బలంగా ఉండటం. ఇతర రాష్ట్రాల్లో కుల రాజకీయాలు ప్రధానంగా కనిపిస్తే బెంగాల్‌లో సిద్ధాంత రాజకీయాలు, మేధో చర్చలు, ఉద్యమ సంస్కృతి ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే అక్కడి రాజకీయ మార్పులు దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతాయి. ప్రస్తుతం బిజెపి ఎదుగుదల దేశ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వస్తే తూర్పు భారతదేశంలో పార్టీ బలపడే అవకాశం ఉంటుంది. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ తన ఉనికిని కాపాడుకునేందుకు మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశముంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార మార్పిడి సహజ ప్రక్రియ. అయితే ప్రజల ఆశలు నెరవేర్చే పరిపాలన అందించడమే అసలు సవాలు. బెంగాల్‌లో నిరుద్యోగం, పరిశ్రమల కొరత, రాజకీయ హింస, విద్యా రంగ సమస్యలు, పెట్టుబడుల కొరత వంటి అంశాలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలి. లేకపోతే బెంగాల్ ఓటరు మరోసారి తన తీర్పును మార్చడానికి వెనుకాడడు.

భారత ప్రజాస్వామ్య చరిత్రలో బెంగాల్ ఎప్పుడూ మార్పుకు ప్రతీకగా నిలిచింది. అక్కడి ప్రజలు అధికారాన్ని ప్రశ్నించే స్వభావాన్ని కలిగి ఉన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజకీయ చైతన్యం, సామాజిక ఉద్యమాలు కలిసిన నేలగా బెంగాల్ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇప్పుడు మరోసారి రాజకీయ మార్పు అంచున నిలిచిన బెంగాల్ భవిష్యత్ భారత రాజకీయాలకు కీలక సంకేతాలను ఇవ్వబోతోందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం



## ఈనిన కొత్త పిల్లి

చుట్టూ మూగి దాగి దాడి చేస్తూ ఉంటే,
పాపం ప్రసవించిన ఈనిన కొత్త పిల్లి గతేమిటి
తండ్రియితేనేం, బావ గారో,
అల్లుడో, ప్రియుడో
నక్కలు తోడేళ్లు తోడళ్లు
కొత్తగా మనకెందుకు?

గవర్నర్ అంత గొప్పవాడైతే
హోమ్మినిస్టర్ హమ్మో అని భయపడడా
పులిగా రంగులేసుకున్న పిల్లికేం తెలుసు
...కారే రాజుల్ రాజ్యముల్ గలువలే ...

ఎక్కడీ భారత రత్న, అక్కడి నటరత్న
ఈ రోజుల్లో ఏ పార్టీ చిరంజీవి,
గుర్తు ఉండదు
తొమ్మిదేళ్లలో ఎంత గొప్ప ముఖ్యమంత్రినైనేం,
కో పైలట్ ఒక్క అల్లుడు చాలు,
శత్రువెందుకు మనకు

అందరూ తిడుతున్నారే కాని శని గ్రహం
మంచిది,
ఇప్పుడో ఏడేళ్ల తరువాతో పదవి ఇస్తాడట,
మన హస్తిన లో శకుని ఉంటే
పాచికలు వాడిచేతులో ఉంటే
విజయుడా జ్ఞాపక ముంచుకో
కొంప ముంచేవాళ్లు మనచుట్టే ఉంటారు.

**మాడభూషి శ్రీధర్**

(భారతరత్న: 1988లో, మరణానంతరం భారతదేశ అత్యున్నత పౌర గౌరవం లభించింది. నవరత్న అంటే ఎన్ టి రామారావ్)



# హిందువుల ఐక్యతతోనే దేశ సమగ్రతకు పునాది

- పీఠాధిపతి శ్రీ వీర ధర్మజ స్వామి



**శేరిలింగంపల్లి, మే 10 (జనంసాక్షి) :** భారతదేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, దేశంలోని బహిర్గత శక్తులు, అంతర్గత కుట్ర దారులు దేశ విచ్ఛిన్నం కోసం నిర్విరామంగా కుయుక్తులు పన్నుతున్నారని సిద్దిపేట శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీ వీర ధర్మజ స్వామి ఉద్ఘాటించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి గోపి నగర్ లో నిర్వహించిన హిందూ మహా సమ్మేళనం కార్యక్రమానికి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపి నగర్, బాపూనగర్, నెహ్రూ నగర్, ప్రశాంత్ నగర్, ఆదర్శనగర్, డొయన్స్ కాలనీ, సుదర్శన్ నగర్, భాగ్యలక్ష్మి నగర్, ఆలండ్ సొసైటీలకు చెందిన దాదాపు 3 వేల మంది హైందవ సోదరులు హిందూ సమ్మేళనం కార్యక్రమానికి గోపి నగర్ లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ వీర ధర్మజ స్వామి మాట్లాడుతూ భారతదేశంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, ప్రధానంగా హిందూ సామాజిక వర్గంపై ఒక వ్యవస్థీకృత దాడి విధానం కొనసాగుతుందని ఆరోపించారు. హిందువులు మేల్కొని తమ ఉనికిని కాపాడుకోవడానికి ఏకమవ్వాల్సిన తరుణం ఆసన్నమైందని, అందుకే కులాలకు, ప్రాంతాలకు అతీతంగా హిందువులంతా ఏకతాటి పైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచం సుభిక్షంగా ఉండాలంటే హైందవం దేదీప్యమానం గా వెలగాల్సిన అవసరం ఉందని, హిందుత్వం ఉంటేనే భారతదేశం కూడా నాలుగు కాలాలపాటు పరిఢవిల్లుతుందన్నారు. గోపి నగర్ పరిధి బిసి హాస్టల్ ప్రాంగణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమానికి స్థానికులే కాకుండా పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో హిందువులు రావడంతో హాస్టల్ ప్రాంగణం పూర్తిగా కాషాయమయంగా మారిందని, హిందుత్వం వర్ధిల్లాలి అనే నినాదాలు మిన్నంటడంతో ప్రతి ఒక్కరిలో భక్తి భావం ఉప్పొంగిందని వక్తలు పేర్కొన్నారు. భారతదేశంలోనే హిందుత్వాన్ని పెట్టుకొని నేడు హిందువులు మైనార్టీలుగా మారి ప్రత్యేక సమ్మేళనాలు పెట్టుకోవాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితులు నెలకొన్నాయి అంటే సాధుతత్వం కలిగిన హిందుత్వం ఎంతటి ప్రమాదంలో ఉందో ప్రతి హిందువు గుర్తించాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించిన స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు కర్చర్ల ఎల్లేష్, మారబోయిన రవి యాదవ్, బిఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతకింది రవీందర్ గౌడ్, ఆస్ట్రేలియాలో ఎంపి గా పోటీ చేసిన ప్రముఖ బిల్డర్ నిఖిల్ రెడ్డి, సాయి జ్యోతి కన్స్ట్రక్షన్స్ అధినేత రమణమూర్తి, ప్రచార రథం సమకూర్చిన దొంతి సత్యనారాయణ గౌడ్ లను హిందూ సమ్మేళనం కార్యచరణ కమిటీ ఘనంగా సత్కరించింది. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ కుల, ప్రాంత, వర్గ, వర్ణ రాజకీయాల కారణంగా హిందువుల్లో ఐక్యత దెబ్బతింటున్నదని అన్నారు. సమస్య తన వరకు వస్తే తప్ప హిందువుల్లో చైతన్యం రాని పరిస్థితిలు నెలకొన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మనదేశంలో ఎన్నో పార్టీలు ఉన్నాయని, హిందువుల కోసం ప్రత్యేకంగా ఒక పార్టీ అంటూ లేదని, అన్ని పార్టీలు కూడా ప్రత్యేక వర్గాలకోసం మోర్చాలు నడిపిస్తున్నాయని చురకలంటించారు. లవ్ జిహాద్ నుండి మన హిందూ యువతులను రక్షించుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపైనే ఉందని సూచించారు. గోపినగర్ లోని గోవర్ధనగిరి పై శ్రీరాముని భవ్య మందిర నిర్మాణాన్ని చేపట్టాలని, తన వంతు బాధ్యతగా కోటి రూపాయల విరాళాలను సేకరిస్తానని బస్తీ వాసులకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి పీఠాధిపతి శ్రీ వీర ధర్మజ స్వామి అభయమిచ్చారు. హిందుత్వం ఉంటేనే దేశం నిలబడుతుందని అన్నారు. నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా అఖండ భారతం దిశగా అడుగులు వేయాలని, ఓపికతో పోరాడితే ఏదైనా సాధ్యమని అన్నారు. మహిళా వక్త సీనియర్ జర్నలిస్టు, సీత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు దేవికా రెడ్డి మాట్లాడుతూ పసిప్రాయం నుంచే పిల్లలకు సద్బుద్ధులు నేర్పాలని, ఆడపిల్లలకు మన హిందూ సాంప్రదాయం ప్రకారం కట్టు బొట్టు ఉండేటట్టు చూడాలన్నారు. పుట్టినరోజు వేడుకల్లో కేక్ కటింగ్ సంప్రదాయాన్ని నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మేళనంలో భాగంగా పలువురు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్య కుసుమ డాన్స్ అకాడమీ గురువు లక్కాకుల సుమలత శిష్య బృందం కూచిపూడి నృత్యంతో, కేఎల్ఎన్ స్వామి బృందం భగవద్గీత పఠనంతో, శివ బృందం హనుమాన్ చాలీసా పారాయణంతో సభికులను భావోద్వేగానికి గురిచేస్తూ ఒక ఇంత ఉత్సాహాన్ని ఆహుతులలో నింపడం విశేషం. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం కార్యాచరణ కమిటీ గౌరవాధ్యక్షులు గోపీనాథన్ పిళ్లై, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాట నరసింహ గౌడ్, బెజగం కేశవులు, సలహాదారులు పూజల ప్రభాకర్, చింతకింది గోవర్ధన్ గౌడ్, రమణీయమ్మ, రాజేశ్వరమ్మ, ప్రతినిధులు రవీందర్ రెడ్డి, రంగా గౌడ్, పుట్ట వినయ్ కుమార్ గౌడ్, నాగేశ్వరరావు, లచ్చుమొళ్ల పాండు గౌడ్, గోపాల్ యాదవ్, పవన్ గౌడ్, ప్రభాకర్, జగదీష్, అశోక్, సత్యనారాయణ, నరసింహ, రాజు, నిర్మల్ కుమార్, సుధాకర్, జయశంకర్, పంచాక్షరి, మధుకర్, సుమన్, అంబ చారి, అనిల్ వివిధ పార్టీల నాయకులు బస్తివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**మెదక్, మే 10 (జనం సాక్షి) :** మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ మండలంకు సంబంధించిన విద్యార్థులను కోరారు. జిల్లా కలెక్టర్ మరియు డిఇఓ ఆదేశాల మేరకు 11.05.2026 నుండి 17.05.2026 వరకు సమ్మర్ క్యాంపు ప్రజలు నిర్వహిస్తున్నట్లు వేసవిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు నేటి ఉదయం 8 గంటలకు పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ కూ చన్ పల్లి పాఠశాలలో లిసమ్మర్ క్యాంప్లి ప్రారంభం అవుతుంది అని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హవేలీ ఘనపూర్ మండల విద్యాధికారి నాచారం మాధుమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కావున తల్లిదండ్రులందరూ మీ పిల్లల్ని సమ్మర్ క్యాంపుకి పంపించి కార్యక్రమాలను విజయవంతం చేయగలరు.. అని ఆయన అన్నారు. కంప్యూటర్ క్లాస్, డ్యాన్స్ క్లాస్, క్విజ్, గేమ్స్, డ్రాయింగ్ నేర్పబడును అని ఆయన తెలిపారు. మధుమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్నీ వెలికితీసి తీసి, వ్యక్తి వికాసాన్ని పెంపొందించుటకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని తమలో దాగి ఉన్న ప్రతిభను చూపాలన్నారు. ఇలాంటి క్యాంపులు నిర్వహణ వలన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, మానసిక ప్రశాంతత కోసం ఎంతో ఉపయోగపడతాయన్నారు. నేటి నుండి ప్రారంభం కానున్న సమ్మర్ క్యాంపులకు కేవలం పాఠశాల విద్యార్థులు కాకుండా వేరే ఇతర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని ఆయన విద్యార్థులను కోరారు

## బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను అరెస్టు చేయాలి

- బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిని వెంటనే తొలగించాలి
- బిఆర్ఎస్ పార్టీ నాయకులు మిద్దె శ్రీరాములు డిమాండ్



**రేవల్లి, మే 10 (జనంసాక్షి) :** బాధ్యత గల కేంద్ర మంత్రి పదవిలో ఉండి తన కుమారుని ఎలా పెంచుకోవాలో తెలువని బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని, అదేవిధంగా మైనర్ బాలికకు బలవంతంగా మద్యం తాగించి బలాత్కారానికి పాల్పడిన బండి సాయి భాగీరథునిపై ఫోక్సో కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని రేవల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మిద్దె శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర హోం శాఖ మంత్రి రేవంత్ రెడ్డి, బిజెపి నేత బండి సంజయ్ తో కుమ్మక్కై అమాయకులైన ఆడపడుచులను ఈ విధంగా మాన భంగాలు చేస్తుంటే నిందితులను అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తూ బాధితులపై అక్రమ కేసులు పెడతామని పోలీసులతో బెదిరించడం అంటే ఈ రాష్ట్రంలో బిజెపి కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై మహిళలకు, బాలికలకు బడుగు బలహీన వర్గాలకు రక్షణ లేకుండా చేయడమే అని అన్నారు. కేంద్రంలో మోడీ భేటీ బచావో అంటుంటే రాష్ట్రంలో బిజెపి నేతలు మహిళలను బాలికలను ఇలా హింసిస్తూ గుండాయిజం చేస్తున్నారు. దాని ఎదుర్కోవలసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో బడుగు బలహీన ప్రజలను కనీసం మనుషులుగా చూడకుండా పోలీసులను కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలుగా మార్చుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, చట్టం ఉన్నోని చుట్టంగా చేస్తున్నారని అన్నారు. బండి సంజయ్ కుమారుని అరెస్టు చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాలికకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని కాంగ్రెస్ పార్టీని, పోలీసు వ్యవస్థని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ



**శ్రీరంగాపూర్, మే 10 (జనం సాక్షి) :** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యుజే (ఐజేయు) వనపర్తి జిల్లా అధ్యక్షుడు మాధవరావు ఆధ్వర్యంలో అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు ఎండీ నసీరుద్దీన్, వనపర్తి పట్టణ అధ్యక్షులు తైలం అరుణ్ రాజ్ లు ఆదివారం నంది హిల్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ఒకేసారి అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో చర్చించి అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## రైతు జేబు కత్తిరించి నగదుతో పరారైన దుండగులు

**ఉప్పల్, మే 10 (జనం సాక్షి) :** పంటను అమ్ముకుని ఇంటికి తీసుకెళ్తున్న రైతు కష్టార్జిత డబ్బును జేబుదొంగలు అపహరించిన ఘటన ఉప్పల్ పరిధిలో కలకలం రేపింది. హనుమకొండ జిల్లా కొత్తపల్లికి చెందిన రైతు పోలు అశోక్ మామిడి పంటను విక్రయించి వచ్చిన నగదుతో స్వగ్రామానికి వెళ్లేందుకు బయలుదేరగా, మార్గమధ్యలో దుండగులు అతని జేబు కత్తిరించి రూ.55 వేల నగదును ఎత్తుకెళ్లారు. రైతు అశోక్ బాటసింగారం మార్కెట్‌లో మామిడి పంటను విక్రయించగా అతనికి రూ.55 వేల నగదు వచ్చింది. ఆ డబ్బును జాగ్రత్తగా జేబులో పెట్టుకుని ఉప్పల్ ఎక్స్ రోడ్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి నల్లచెరువు వద్ద ఉన్న హనుమకొండ బస్టాండ్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. సాధారణ ప్రయాణంలాగే అనిపించినా, ఆటోలోనే జేబుదొంగలు తమ పని పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఆటో దిగిన తర్వాత తన ప్యాంట్ జేబు కత్తిరించి ఉండటాన్ని గమనించిన అశోక్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే జేబులో ఉన్న డబ్బు కనిపించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందాడు. పంట పండించేందుకు నెలల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బు క్షణాల్లో మాయం కావడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆటో ఎక్కిన ప్రాంతం నుంచి దిగిన ప్రాంతం వరకు ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, ఆటో స్టాండ్ల వద్ద జేబుదొంగల ముఠాలు సంచరిస్తున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల నగర పరిసర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నగదు ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లే సమయంలో బ్యాగులు, జేబులు జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరిస్తున్నారు. రైతులు, వ్యాపారులు మార్కెట్‌ల నుంచి నగదు తీసుకువెళ్లేటప్పుడు వీలైతే డిజిటల్ లావాదేవీలను ఉపయోగించాలని సూచిస్తున్నారు.

## నేటి నుండి ఈనెల 17 వరకు విద్యా వారోత్సవాలు

**బొంరాస్‌పేట, మే 10 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా విద్యా వారోత్సవాలు ఈనెల 11 నుండి 17 వరకు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలో విద్యా వారోత్సవాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.



## రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం సోషల్ మీడియా ఇన్చార్జ్‌గా వెంకటేష్ చారి




**ధారూర్, మే 10 (జనం సాక్షి) :** తెలంగాణ కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్వ చారి ఆదివారం నాడు ధారూర్ మండల పరిధిలోని మోమిన్ కలాన్ గ్రామానికి చెందిన వడ్ల వెంకటేశం చారి ని తెలంగాణ కార్మిక సంక్షేమ సంఘం సోషల్ మీడియా ఇన్చార్జిగా నియమించి నియామక పత్రం అందజేశారు. అనంతరం వెంకటేష్ చారి మాట్లాడుతూ...నాపై ఎంతో నమ్మకంతో కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జిగా నియమించినందుకు రాష్ట్ర నాయకులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ రాష్ట్ర ఉపాధ్యక్షులు భోజు వెంకట్ రెడ్డి. రంగారెడ్డి ఉపాధ్యక్షులు మాగంటి విష్ణు మూర్తి చారి. విశ్వకర్మ వెల్పర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు బ్రాహ్మచారి. తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘం హరిపసాద్. తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి

**అల్వాల్, మే 10 (జనంసాక్షి) :** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డివిజన్‌లోని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి అధికారులను కోరారు. ఆదివారం 194వ డివిజన్ పరిధిలోని భూదేవినగర్‌లో జరుగుతున్న బాక్స్ డ్రైన్ మరియు రోడ్డు కటింగ్ పనులను ఆయన నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై డీఈ మహేష్‌తో చర్చించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనుల్లో జాప్యం లేకుండా వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని సూచించారు. తవ్విన గుంతల వల్ల స్థానికులకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేబుల్ శేఖర్, మల్లెల శివ, బాలకృష్ణారెడ్డి, నిమ్మ అశోక్ రెడ్డి, టీవీ భాస్కర్, జనార్ధన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి

- విద్యార్థుల నమోదు పెరగాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



**మెదక్ జిల్లా బ్యూరో, మే 10 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11వ తేది నుండి 17 వ తేది వరకు జరగబోయే విద్యా వారోత్సవాల ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ...జిల్లా కలెక్టర్, మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో....విద్యా శాఖ భాగస్వామ్యం కీలకమని, ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకి అనుగుణంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు.

ఈ వారోత్సవాలలో భాగంగా మొదటిరోజు తేదీ 11న భవిత కేంద్రం మెదక్ సెంటర్ నందు ALIMCO aids and appliances distribution camp నందు ఎంపిక కాబడిన 128 మంది విద్యార్థులకు 9,51,233 రూపాయల విలువైన ఉపకరణాలు అందజేయబడతాయి అని తెలిపారు, మరియు 24 పీఎం శ్రీ స్కూల్ లలో మరియు కేజీబీవీ చేగుంట(రెసిడెన్షియల్ క్యాంప్) నందు15 రోజుల పాటు ఆర్ట్స్, కల్చరల్, డాన్స్ మ్యూజిక్ తదితర రంగాలలో పిల్లలకు సమ్మర్ క్యాంపులను నిర్వహించుచున్నారు.

రెండవ రోజు తేదీ 12వ నాజ ఫలితాల్లో ఫెయిల్ అయిన పదవ తరగతి విద్యార్థులకు కోసం జడ్పీ హైస్కూల్ పాపన్న పేట, నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతుల శిబిరం లో ప్రతీ రోజూ అన్నీ సబ్జెక్టుల పైన అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు అయ్యేంత వరకు పిల్లలకు సులభమైన పద్ధతుల ద్వారా భోధన జరగాలన్నారు.

మూడవరోజు ఈ నెల 13వ తేదీన...ప్రతీ నియోజకవర్గ స్థాయి లో సర్పంచ్ లకు , మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లకు వర్క్ షాప్ నిర్వహించి ప్రభుత్వ విద్యా శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియపరిచి ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల నమోదు పెరిగేల వారి సహకారాన్ని తీసుకోవాలన్నారు. నాలుగవ రోజు16 వ తేదీన... ప్రతి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమము మరియు పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని తెలిపారు. ఐదవ రోజు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మండల స్థాయిలో గ్రామస్థాయిలో గల గ్రంథాలయాలలో బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని తెలిపారు. ఆరవ రోజు తేదీ 16న ఆర్ట్ క్రాఫ్ట్ కల్చర్ డైనింగ్ జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను సన్మాన పత్రాల ద్వారా సన్మానించాలని తెలిపారు అలాగే రాష్ట్రస్థాయిలో పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఏడవ రోజు ఈ నెల 17 వ తేదీన జరిగే విద్యా వారోత్సవాల ముగింపు సమావేశం లో ౦౦ఎ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన టాప్ 3 అలాగే ఇంటర్మీడియట్ లో టాప్ 3 మార్కు సాధించిన విద్యార్థులకు, జిల్లా స్థాయి లో క్రీడల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు 10 వేల రూపాయల నగదు పురస్కరం తో పాటు సన్మానం కూడా చేయాలనీ కలెక్టర్ తెలిపారు. వారం రోజుల కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు ఇప్పటికే విధి విధానాలు వచ్చినందున దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. జిల్లాలోని ఏదైనా పాఠశాల లో కావలిసిన మౌలిక వసతులు ఉంటే తమ దృష్టి కి తీసుకరావాలన్నారు. జిల్లా కేంద్రం నుంచి కావలిసిన సంపూర్ణ సహకారం అన్నీ కార్యక్రమాలకి ఉంటుందని, క్షేత్ర స్థాయిలో ఏ అవసరం ఉన్న, ఏ సమస్య ఉన్న తమ దృష్టికి సరియైన శాఖ ద్వారా తెలియపరిస్తే 100% వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

## రోగులకు పండ్లు, బ్రేడ్లను పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు



**ఫరూక్‌నగర్, మే 10 (జనం సాక్షి) :** షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ జన్మదినం పునస్కరించుకుని బీఆర్ఎస్ నాయకుడు కొండ మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం షాద్ నగర్ ప్రభుత్వ దావాఖాన రోగులకు పండ్లు, బ్రెడ్లను పార్టీ శ్రేణులు పంపిణీ చేశారు. అదేవిధంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అంజయ్య యాదవ్ నాయకత్వాన్ని ఇక్కడ ప్రజలు మరో మారు కోరుకుంటున్నారని, పదేళ్లపాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ తనదైన శైలిలో సేవలందించారని గుర్తు చేశారు. ఉన్న రోజుల్లో మరోమారు అంజయ్య యాదవ్ ఎమ్మెల్యేగా గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్, సర్పంచ్ హరిశేఖర్ యాదవ్, నేతలు చెట్ల జంగయ్య, ఎజాజ్ అడ్డు, చెర్క శివ, పట్టణ యువ నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
11 మే 2026

# మాజీ మంత్రి లక్ష్మారెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గు చేటు

- ఎమ్మెల్యే విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- రైతుల గోస పట్టించుకొని కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రెస్ మీట్ లో మండల బిఆర్ఎస్ నాయకులు



**ఉర్కొండ, మే 10 (జనం సాక్షి) :** మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని, విమర్శలు మాని జడ్చర్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రెస్ మీట్ లో మండల బిఆర్ఎస్ నాయకులు అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డీ కి మక్కలు కొనుగోలు చేయడం చేతగాక మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పై విమర్శలు చేస్తున్నారని రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడం చేతగాక నోరు పారెసుకోవడం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేతగాని తనానికి అసమర్ధత పాలనకు నిదర్శనం అని ఉర్కొండ మండల బి ఆర్ ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డ్ దగ్గర మొక్క జొన్న రైతులు దాదాపు 30 రోజుల నుండి పడిగాపులు కాస్తున్న పట్టించుకునే వారు లేకపోవడం విసుగు చెందిన రైతులు నిన్న ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందనీ, విషయం తెలిసిన లక్ష్మారెడ్డి సమస్యను తెలుసుకునేందుకు రైతుల దగ్గరకు వెళ్లి ధర్నా కార్యక్రమంలో పాల్గొని సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోవడం. అక్కడ ఉన్న రైతులకు నచ్చజేప్పి ధర్నా విరమింపజేయడం జరిగింది. ఇది ఓర్చుకోలేని ఎమ్మెల్యే మాజీ మంత్రి పైన అడ్డగోలుగా విమర్శలు చేయడం అవివేకనికిని దర్శనం. ఎమ్మెల్యేకి నిజంగా రైతుల పైన ప్రేమ ఉంటే కొనుగోలు కేంద్రాలను ఎందుకు పరిశీలించడం లేదు. 3 నియోజకవర్గల మక్కలు జడ్చర్లలో కొనుగోలు మికు తెలవకుండా జరిగింది. అనడం మి అసమర్ధతకు నిదర్శనం. అక్కడ ఉన్న సీఈవో లక్ష్మారెడ్డి మనిషి అని మాట్లాడుతున్న మీరు ఎమ్మెల్యేగా ఎన్నికై దాదాపు 3 ఏళ్లు కావొస్తున్న ఇంకా మాజీ మంత్రి పైన ఆరోపణలు చేయడం ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇంతకు జడ్చర్ల ఎమ్మెల్యే మీరా మాజీ మంత్ర అని ప్రజలు ఆలోచిస్తున్నారు. మికు ప్రజలు అవకాశం ఇచ్చారు పని చేయండి. ప్రతిపక్షం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పైన ప్రతి నిత్యం అడుగుతూనే ఉంటాం అది మాబాధ్యత అన్నారు. ఒక బాధ్యత గల ఎమ్మెల్యే రైతుల సమస్య ను పట్టించుకోకుండా దిగజారుడు మాటలు మాట్లాడటం సిగ్గుచేటు అని ఇందుకోసమేనా జడ్చర్ల ప్రజలు మికు ఓట్లు వేసి గెలిపించింది అని అన్నారు. ఇంకోసారి ఇలాగే మాట్లాడితే రానున్న రోజుల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్తారని అన్నారు. 3 ఏళ్లుగా అవినీతి భూకబ్జాలు అని మాట్లడుతున్న మీరు ఇప్పటి వరకు ఒక్కటి నిరూపించలేని అసమర్ధత ఎమ్మెల్యేవు అనిఅన్నారు. ఎమ్మెల్యే ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకొని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయించేందుకు ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి, జంగయ్య, శ్రీనివాసులు, కృష్ణ గౌడ్, సర్పంచ్ మంజుల, వెంకటేష్ కళీంపాష, శ్రీకాంత్ రెడ్డి,రవి నరేష్,తాజా మాజీ మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులు రైతులతో రాజకీయ విమర్శలు సరికాదు

- మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



**నంగునూరు, మే 10 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ నాయకులు రైతులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తూ మతిలేని విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఆదివారంబుూ నంగునూర్ లో విలేకరుల తో మాట్లాడారు. రైతులు పడే అవస్థలకు కెసిఆర్, హరీష్ రావు లే కారణం అని మండిపడ్డారు. గత తెరాస, బిఆర్ఎస్ ప్రభుత్వల యెలుబడిలో వారి కార్యకర్తలకు దొచిపెట్టడం కోసం ధాన్యం కొనుగోల్లలో తాలు, పేరిట తరుగు పేరిట అడ్డగోలుగా క్వింటాల్ల కొద్దీ కొద్దీ కట్టింగులు పెట్టి విచ్చలవిడిగా అవినీతి కి పలుపడి ఇప్పుడేమో సన్నాయ్ నొక్కులు నొక్కుతూ హరీష్ రావు రాజకీయ పభం గడుపుతున్నడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పైన రోజు బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నాడే తప్ప వాటితో రైతులకుఒరిగింది. ఏమీలేదాన్నారు. నాడు అధికారం,అవినీతి మత్తులో కూలిపోయే ప్రాజెక్టు కట్టి నేడు నీతి వాక్యాలు భోదించడం సిగ్గు చెట్టన్న రు. ప్రాజెక్టు ల పేరు తో లక్షల కోట్లు దోచుకున్న హరీష్ రావు కు వాటి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాగు శ్రీకాంత్ యాదవ్,తిరుపతి శేఖర్ పాల్గొన్నారు.

## వరి ధాన్యానికి రైతుల అకౌంట్లో వెంటనే డబ్బులు జమచేయాలి



**వీపనగండ్ల, మే 11 (జనం సాక్షి) :** సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో ఎం.కృష్ణయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలలో నెలలు తరబడి రైతులు ధాన్యం తీసుకొచ్చి కేంద్రాలలో పోసిన నేటికీ గన్ని బ్యాగులులారీల కొరత వల్ల ధాన్యం అమ్మలేక ఇబ్బందులకు గురవుతున్నారు. పండించిన పంటను వడ్లు తూకం చేసి లారీలకు పంపితే తూకం,తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు గురి చేస్తూ క్వింటాల్లో ఐదు కేజీల నుంచి 8 కేజీల వరకు అదనంగా దోపిడీ చేస్తున్నారు అని ఈ మోసాన్ని వెంటనే అరికట్టాలని అన్నారు. రైతుల నుండి కొన్న వరి ధాన్యానికి వెంటనే రైతుల అ కౌంట్లో డబ్బులు జమ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని రైతు సోదరులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎండాకాలంలో జూరాల,బీమా కాలువలు లింకు కెనాల్ మరమత్తులకు నోచుకోక తాగునీరు వృధా అవుతుంది ప్రజలకు వేసకాలంలో నాకు నేర్పు ఇబ్బందులకు గురై అవకాశం ఉందని అన్నారు. ఎండాకాలం సమయంలో ఈ మరమ్మత్తులకు నిధులు ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తే జూరాల చివరి ఆయకట్టు వరకు మీరు అందించే అవకాశం ఉందన్నారు. బీమా,కే ఎల్ ఐ కాలువ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారుఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శిడి. బాల్ రెడ్డి,మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణయ్య,రవి ప్రసాద్,మండల నాయకులు ఆది,ఆశన్న,నిరంజన్,బాల గౌడు,నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాన్ని దోచుకుంటే సహించేది లేదు

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి
- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే



**శివ్వంపేట, మే 10 (జనంసాక్షి) :** ఎండనకా, వాననకా చెమటోడ్చి, కష్టపడి పంటలు పండించిన రైతాంగ కష్టాన్ని తాలు, తేమ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడం ఎంతవరకు న్యాయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆమె బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆకస్మికంగా సందర్శించి, ధాన్యం కుప్పలను పరిశీలించి, అక్కడ ఉన్న రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. పది, పదిహేను రోజుల నుండి కొనుగోలు కేంద్రాలకు వడ్లను తెచ్చి రైతులు అష్టకష్టాలు పడుతుంటే అధికారులు గాని అధికార పార్టీ నాయకులు గాని ఇంతవరకు పట్టించుకోకపోవడం దారుణమని ఆమె మండిపడ్డారు. గ్రామానికి చెందిన అంతారం అంజమ్మ గూడూరు స్వప్న వడ్ల కుప్పల వద్దకు వెళ్లి ఎన్నిరోజుల క్రితం దాన్యాన్ని తెచ్చారని, ఎందుకు కాంట వేయడం లేదని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పాండ్య తాండకు చెందిన మాలోత్ ప్రవీణ్ తను ఐకేపీ సెంటర్ లో 192 సంచుల దాన్యాన్ని విక్రయించానని, కాంట సమయంలో ఒక్కో సంచికి 42.5 కిలోలు తూకం వేశారని, నర్సాపూర్ సాయికృష్ణ ఆగ్రో రైస్ మిల్ యజమానులు అక్కడ నాలుగు సంచులు తరుగు పేరిట తక్కువ చేశారని ప్రవీణ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జగదీష్ కు ఫోన్ చేసి రైతులకు అన్యాయం చేస్తే సహించబోమని ఆమె హెచ్చరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా త్వరతగతిన తూకం వేసి ధాన్యన్ని రైస్మిల్‌లకు తరలించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, ముత్రాజ్ పల్లి మాజీ ఎంపీటీసీ గుంజరి ప్రవీణ్, కొత్తపేట సర్పంచ్ లింగరబోయిన మహేష్, పిల్లుట్ల సంద్ర సత్యనారాయణ, పిల్లి శివకుమార్, పెద్దపులి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ ఏర్పాటు సంతోషకరం



**శివ్వంపేట, మే 10 (జనంసాక్షి) :** గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. దివంగత రేవ నర్సింహారెడ్డి స్మారకార్థం అతని కుమారుడు, మాజీ వైస్ ఎంపీపీ రేవ రమాకాంత్ రెడ్డి, విజయ రాఘవరెడ్డి లు ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డితో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు.

**నర్సింహారెడ్డి సేవలు గొప్పవి**

రిటైర్డ్ ఎచ్ఎం దివంగత రేవ నర్సింహారెడ్డి మందరికి ఆదర్శప్రాయుడని ఆయన సేవాలు చాల గొప్పవని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో స్వర్గీయ నర్సింహారెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలలో ఆదివారం ఆమె బిఆర్ ఎస్ నాయకులు, శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రేవ శ్రీరాంరెడ్డి, భరత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రేవ రమాకాంత్ రెడ్డి, నాయిని వేమారెడ్డి, సోసైటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, పైడి శ్రీధర్ గుప్త, కాముని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన కట్టకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు వినతి



**ఇటిక్యాల, మే 10 (జనం సాక్షి) :** ప్రతి ఏటా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా పనులు చేపడుతున్న ముళ్ళపొదలు పెరుగుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ప్రధాన కట్ట సైతం గుంతలమయంగా మారిందని ఇటిక్యాల గ్రామస్తులు తెలుపుతున్నారు. మండల కేంద్రం సమీపంలో ఉన్న పెద్ద చెరువు కట్టపై పెరిగిన ముళ్లపొదలు వర్షాకాలం వస్తే ఏపుగా పెరగడంతో రాకపోకలకు, తమ పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటుందని సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నారు. గత ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా పంట పొలాలకు బాట ఏర్పాటు చేయాలని, చెరువుగట్టు పై ఉన్న ముళ్లపొదలు తొలగించాలన్నారు. భారీ వర్షాలకు చెరువు కట్టపై ఉన్న మట్టి దారి పూర్తిగా పాడైపోయి మోకాటిలోతు గుంతలు ఏర్పడ్డాయని ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లేందుకు ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ప్రధాన కట్టపై అక్కడక్కడ రోడ్డు కోత గురైందని, ఈసారి భారీ వర్షాలు వస్తే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన కట్టకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎత్తిపోతల పథకం పనులను వేగవంతంగా చేపట్టాలి

- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన మంత్రి
- మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్, మే 10 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని కాట్రెవుపల్లి గ్రామం వద్ద ఫేస్ వన్ లో భాగంగా నిర్మిస్తున్న కొడంగల్ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ పనులను అదేవిధంగా కెనాల్ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనుల వివరాల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. కొడంగల్ భూములకు కృష్ణాజిల్లాలో అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. పనుల్లో జరుగుతున్న తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే పనుల్లో మరింత వేగం పెంచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో మంత్రి కాసేపు మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రూ. 4750 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ఎత్తిపోతల పూర్తయితే మక్తల్ నారాయణపేట కొడంగల్ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీరు అందనుందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఏడాదిలోగా పొలాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రి వెంబడి కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, బి. గణేష్ కుమార్,మంథన్ గోడ్ సర్పంచ్ కె.రాజేందర్ గౌడ్, నాయకులు వాకిటి హన్మంతు, కృష్ణయ్య గౌడ్, చెన్నయ్య గౌడ్, ఇరిగేషన్ ఏఈ నాగశివ, సిఐ రామ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండి

- ఎంపిడిఓ విజయ్ కుమార్
- ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి నేడు చివరి రోజు

**జడ్చర్ల, మే 10 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనగణన – 2027 ప్రక్రియలో భాగంగా ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని జడ్చర్ల ఎంపిడిఓ విజయ్ కుమార్ ఆదివారం పత్రిక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు ప్రకారం https://se.census.gov.in/ అనే వెబ్‌సైట్ లింక్ ద్వారా ప్రజలు తమ ఇంట్లోనే ఉండి వివరాలను సమర్పించవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి నేడు చివరి రోజు అని స్పష్టం చేశారు.

**ఆన్‌లైన్ నమోదుతో చేకూరే ప్రయోజనాలు :**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ నమోదు ద్వారా ప్రజలకు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. ముందుగానే వివరాలు నమోదు చేసుకుంటే ఎన్యుమరేటర్ (గణనకర్త) ఇంటికి వచ్చినప్పుడు మళ్ళీ వివరాలు చెప్పాల్సిన అవసరం ఉండదని వివరించారు. మన వివరాలను మనమే నమోదు చేసుకోవడం వల్ల సమాచారం ఖచ్చితంగా ఉంటుందని, తప్పులు దొర్లే అవకాశం ఉండదని తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా వివరాల నమోదు సులభం మాత్రమే కాకుండా పూర్తిగా సురక్షితమైనదని భరోసా ఇచ్చారు.



**సంక్షేమ పథకాలకు కీలకం :**

కుటుంబ సభ్యుల వివరాలు సరిగ్గా నమోదైతేనే భవిష్యత్తులో అందే ప్రభుత్వ పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాలు సకాలంలో అందుతాయని, ప్రజలు అందించే సమాచారం అత్యంత గోప్యంగా ఉంచబడుతుందని, బాధ్యతాయుత పౌరులుగా ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొంటాం

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రైతులు తాలు చెత్త లేకుండా నాణ్యమైన వడ్లు తీసుకురావాలి
- తద్వారా రైతులతో పాటు ప్రభుత్వానికి ఇబ్బందులు ఉండవు
- వడ్ల కొనుగోలు ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి
- మిల్లర్లు తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు
- ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మే 10 (జనంసాక్షి) :** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆదివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సివిల్ సప్లై అధికారి, వ్యవసాయ, కోపరేటివ్, తహసీల్దార్లు, మిల్లర్లు, ఐ. కె.పి. సహకార సంఘాల వడ్లు కొనుగోలు కేంద్రాల సభ్యులతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి వరి కొనులు ప్రక్రియను సమీక్షించారు. రైస్ మిల్లులో ధాన్యం త్వరగా దించుకోకుండా రోజుల తరబడి లారీలు ఆగిపోవడం, కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడం పై వివరాలు అడిగారు. లారీల్లో తెచ్చిన వడ్లు నాణ్యత లేవని, తాలు, చెత్త ఎక్కువగా ఉండటం వల్ల ఎఫ్.సి.ఐ కి నాణ్యమైన బియ్యం తిరిగి ఇవ్వడం సాధ్యం కాదని, అందుకే రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన వడ్లు ఇవ్వాల్సిందిగా కోరుచున్నట్లు మిల్లర్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ రైతులు సైతం సహకరించి తూర్పారబట్టిన వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని నాణ్యమైన వడ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోలు చేసి డబ్బులు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేయడంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు వచ్చిన లారీలను త్వరగా ఖాళీ చేసి పంపించాలని, రోజుల తరబడి మిల్లుల వద్ద ధాన్యం లారీలు పెట్టుకోవద్దని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని, అకాల వర్షాలు ఎప్పుడైనా వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి రబీ కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, డి.సి.ఓ రాణి, తహసీల్దార్లు, మిల్లర్లు, ఐ.కే.పి, సహకార సంఘం కొనుగోలు కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంగంపేటలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి


- ఆరుగురు పట్టివేత.. నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- జూదం, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవు
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**కొల్చారం, మే 10 (జనం సాక్షి) :** కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో రంగంపేట గ్రామ శివారులోని అవుసుల కుంట సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై స్థానిక పోలీసులు మరియు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడిన వారు కొమ్ముల రాజాగౌడ్, ఉరేడి సత్యం, అరట్ల సురేష్, నిమ్మనగారి చంద్రారెడ్డి, ఎం.డి. చాంద్ పాషా, అరిగె నర్సింలుగా గుర్తించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ. 4,050 నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో జూదం, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు.

# వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు
- సంబంధిత శాఖలకు లేఖ


Office of the Collectorate,
Warangal District.
F.No.47/Waqf/Wgl/2000
Dated: 04-05-2026
From,
Smt M Satya Sarada Devi,
Magistrate & District Collector,
Warangal.
To,
1. The Commissioner, GWMC, Warangal District.
2. The Commissioner of police, Warangal.
3. The Revenue Divisional Officer, Warangal
4. The Sub- Registrar, Fort Warangal.
5. The Thasildar, Fort Warangal Mandal.
6. The Station House Officer, Mills Colony Ps.

Respected Madam/Sir,

Sub:- Waqf – Warangal District – Fort Warangal Mandal – Urs Jagir Village Dargah Zinda Bikkan Darvesh, and Masjid, back side Tallapadmavathi college in respect of Sy. No.273, 274, 275, & 276. to an extent Ac.17-05 Gts – request to stop illegal encroachments and protect Waqf property – Regarding.

Ref:- 1. O.S.No.85/2005, at Additional Senior Civil Judge at Warangal.
2. Letter from District Collector, Warangal to the Sub-Registrar, Warangal.in F.No.47/Waqf/Wgl/2000, Dt:-31-03-2011 & 22-01-19.
3. Letter from the District Collector, Warangal to the Sub-Registrar, Fort Warangal. In F.No.135/Prot/Waqf/Wgl/2012, 15-11-2012, 10-04-13.
4. Letter from the Inspector Auditor Waqf, Warangal to the Station House Officer, Mills Colony Ps, Fort Warangal, Dated: 23-12-2014, 30-12-2018, 17-11-2021, 07-09-2022, 01-02-2025, 24-04-2025 and 10-02-2026
5. Letter from the District Collector to the Commissioner, GWMC, Warangal, in F.No.47/Waqf/Wgl/2000, Dated:-23-09-2021.
6. Letter from the District Revenue Officer, Warangal; to the sub Registrar, Fort Warangal, in F.No.47/Waqf/Wgl/2000, Dated:-24-09-2024.
7. Representation from Mohd. Mahammed Ali Grievance Cell.No. WGRDC/E/2026/00183, Dated:-13-04-2026.

The Waqf Institution in Dargah Hzt. Zinda Bikkan Darvesh, and Masjid near Dargah, fort Warangal is a registered and notified Waqf property published in AP. Gazette No.5-A, Dated:- 01-02-1990 to an extent 600 Sq. Yard and attached property in Sy. No.273, 274, 275 & 276, an extent Ac.8.05 Gts on got Addendum notification for correction of record to Waqf Property to an total Extent Ac.17.05 Gts situated at Urs Village, Fort Warangal Mandal, Warangal District.

Through Reference 1st cited, the Hon'ble Civil Court has dismissed the ownership claims of private individuals (Bathini Anandam, Bathini Agamma, and others) in O.S. No. 85/2003. Hence judgment in favour of Waqf Board.

**వరంగల్ బ్యూరో, మే 10 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా ఫోర్ట్ వరంగల్ మండలంలోని ఉర్సు జాగీర్ గ్రామ పరిధిలో ఉన్న దర్గా జిందా బిక్కన్ దర్వేష్ మరియు మసీదు వక్ఫ్ భూములపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఎం. సత్య శారదాదేవి సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సర్వే నంబర్లు 273, 274, 275, 276లలో మొత్తం 17 ఎకరాల 5 గుంటల మేర నమోదైన వక్ఫ్ భూములను రక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ భూములు ఇప్పటికే గెజిట్‌లో వక్ఫ్ ఆస్తిగా నమోదై ఉన్నాయని, కోర్టు తీర్పులు కూడా వక్ఫ్ బోర్డు పక్షాన వచ్చినట్లు లేఖలో స్పష్టం చేశారు. ఈ భూములపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని సబ్-రిజిస్ట్రార్‌కు, అనుమతులు జారీ చేయవద్దని జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే అక్రమ ఆక్రమణదారులపై వక్ఫ్ చట్టం-1995 సెక్షన్ 52-ఏ ప్రకారం కేసులు నమోదు చేయాలని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ అధికారులకు సూచించారు. భూముల వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్లానింగ్, వక్ఫ్ బోర్డు, టాస్క్ ఫోర్స్, పోలీస్ శాఖలతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలు, ప్లాటింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. అంతేకాకుండా "ప్రొహిబిటెడ్ వక్ఫ్ ల్యాండ్"గా ఉన్న భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేశారు అనే దానిపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని సూచించారు. వక్ఫ్ భూముల రక్షణ కోసం అత్యవసర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖలను ఆదేశించారు.



# మాతృమూర్తులకు రుద్రమ నంది పురస్కారాల ప్రదానం

**హనుమకొండ ప్రతినిధి మే 10 (జనం సాక్షి) :** హన్మకొండ పబ్లిక్ గార్డెన్, పద్మ శ్రీ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ కళా ప్రాంగణంలో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో జె.బి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ, వరంగల్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ మూర్తి దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం అంగరంగ వైభవంగా కూచిపూడి నృత్యాలతో , ఆటపాటలతో సందడిగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ త్యాగాలకు, నిద్రలేని రాత్రులకు మాటల్లో చెప్పలేని ప్రేమకు కూడా ధన్యవాదం చెప్పే రోజు కావాలి. కాబట్టి మాతృ మూర్తుల దినోత్సవం అంటే ఒక్కరోజు అమ్మను ప్రేమించడం కాదు. ప్రతిరోజూ ప్రేమించే ఒక ప్రత్యేక గుర్తు మాత్రమే అని అమ్మ గొప్పతనాన్ని చాటి చెప్పారు. కళాకారుల వృత్తికి అంకితభావం, సృజనాత్మకత మరియు క్రమశిక్షణ అవసరం. నిజమైన కళాకారుడు కేవలం ప్రశంసల కోసం కాకుండా, కళ కోసం, భగవంతుని కోసం తన ప్రదర్శనను ఇస్తాడు. కళాకారుడు వ్యక్తిగత చైతన్యాన్ని కోల్పోయి విశ్వ చైతన్యంలో కలిసిపోవడం వారి పరమావధి. స్టేజ్ కళాకారులు సమాజానికి అద్దం పడతారు. వారి ప్రతిభ, నిబద్ధత, కళ పట్ల వారికున్న అంకితభావం అభినందనీయం. వారిని ప్రోత్సహించడం, వారి కళను గౌరవించడం మన బాధ్యత అని వారు కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశంను మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జె.బి కల్చరర్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు జడల శివ, జడల హరిత,డాక్టర్. హరినాధ రావు, బీటవరం శ్రీధర స్వామి,పొట్లపల్లి శ్రీనివాస్ రావు, కాజీపేట తిరుమలయ్య, జూలుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, కూరపాటి శ్రీధర్ రాజు,ఆకుల సదానందం, జనగాం రాము, కీర్తి, జూలూరి శ్రీనివాస్, కరిమిల్ల సంపత్ రావు, లక్ష్మా రెడ్డి తదితరులు మరియు అధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# తొర్రూరు పట్టణంలో కృత్రిమ గ్యాస్ కొరత

- బ్లాక్ లో 2000 పలుకుతున్న గ్యాస్ సిలిండర్
- వినియోగదారుడు బుక్ చేసుకున్న వాటికి బ్లాక్ దందా
- హోటళ్లకు, పెళ్లిళ్లకు రెస్టారెంట్‌లకు లేని కొరత
- గ్యాస్ సప్లై ఆటో వాళ్ల చేతుల్లో..



**తొర్రూరు, మే 09 (జనం సాక్షి):** తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని తిరుమల భారత్ గ్యాస్ ఏజెన్సీ వారి చేతివాటంతో కృత్రిమ కొరత తో ఇబ్బందులు పడుతున్న తొర్రూర్ ప్రజానీకం. తొర్రూర్ తహసిల్దార్ జి శ్రీనివాసరావు గతంలో వినియోగదారుల సిలిండర్ నుంచి డొమెస్టిక్ సిలిండర్లను పట్టుకున్న గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోలేని అధికారులు. పట్టణంలో హోటళ్ల కు రెస్టారెంట్లకు, పెళ్లిళ్లకులేని గ్యాస్ కొరత వినియోగదారులకే ఎందుకు వస్తుందో తిరుమల గ్యాస్,యాజమాన్యం సమాధానం చెప్ప లేని ప్రశ్న? ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే దురుద్దేశం ఉందా అనే కోణంలో ప్రభుత్వ అధికారులు ఆ కోణం ఆలోచించాలి. బుక్ చేసుకున్న సిలిండర్లను ఆటో బాయ్స్ కి ఒప్పజెప్పడం బుక్ చేసు కొన్న వాళ్లు ఇంట్లో లేరని సమాధానంతో వారి బుక్ చేసుకున్న సిలిండర్లను బ్లాక్ దందాలకు నడిపిస్తున్న సిబ్బంది. తొర్రూర్ గ్యాస్ ఆఫీస్ లో పనిచేసే సిబ్బందిని మారిస్తే కానీ తొరూరులో గ్యాస్ కొరత నివారించలేమని వినియోగదారులు మండిప డుతున్నారు. మండుటెండలో గ్యాస్ సిలిండర్లను మోసుకొచ్చి ఆఫీస్ ముందు పడిగాపులు కాసిన వినియోగదారులకు సిలిండర్లు అందించలేని యాజమాన్యం, దురుసు ప్రవర్తన తో సిబ్బంది. రక్షకభటు ల పర్యవేక్షణలో గ్యాస్ పర్యవేక్షణ జరిపించటం విడ్డూరం. గ్యాస్ బుక్ చేసుకున్న మున్సిపల్ అధికారుల నుండి గాని, తహసిల్దార్ కార్యాలయం నుండి గాని టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వినియోగదారునికి చేరవేస్తే సమస్య తీరుతుందని ప్రజలు కోరుతున్నారు.

# అకాల వర్షం.. అన్నదాతలకు తీరని నష్టం

- తడిసి ముద్దైన మక్కలు, వరి ధాన్యం



**నల్లబెల్లి, మే 10 (జనంసాక్షి):** అకాల వర్షంతో అన్నదాతలకు తీరని నష్టం కలిగింది. మండలంలో శనివారం సాయంత్రం విపరీతమైన గాలి వానతో బీభత్సమే సృష్టించింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న మక్కలు పూర్తిగా తడిసిపోయాయి. కల్లాలలో ఆరబోసిన మక్కలు,వరి ధాన్యం తడిసి ముద్దయింది. చేతికొచ్చిందనుకున్న పంట అకాల వర్షంతో నీటి పాలైందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉన్న కాంటాలు కాక మక్కలు తడిసాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మక్కల కాంటాలు, దిగుమతులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. తడిసిన మక్కలను ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు వేడుకున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరారు.

# కదలని వరి 'ధాన్యం'.. కొనేదెప్పుడు?

- లారీలు రాకపోవడంతో కొనుగోలు సెంటర్లలో ధాన్యం నిలిపివేత
- వర్షాలతో ఆగమవుతున్న రైతన్నలు



**లక్ష్మణ చందా, మే 10 (జనం సాక్షి) :** మండలంలోని వివిధ గ్రామాలలో ఇప్పటికీ కొనుగోలు చేసి ఒక లారీ కూడా మిల్లర్ లకు పోయిన పరిస్థితి లేదు.. మండలంలోని వడ్యాల్ గ్రామ శివారులోని విస్తీర్ణం 1526 ఎకరాలు వరి ధాన్యం దొడ్డు రకం, 1276 మంది రైతులు పండించగా, ఇప్పటివరకు వరి ధాన్యం సెంటర్లలో చేరుకున్నప్పటికీ కేవలం మూడు లారీలు మాత్రమే పోయినట్లు ఐకెపి సెంటర్ వారు తెలిపారు. ఇప్పటికి మూడు లారీలు పోతే మిగతా 50 నుండి 60 లారీలు వెళ్లాల్సిన ఈ సెంటరు కేవలం ఒక ఐకెపి సెంటర్ తో మాత్రమే నడుస్తున్న పరిస్థితి నెలకొంది. ఇటు రైతులు ఏం చేయాలో తోచలేక వివిధ గ్రామాలకు తమ ధాన్యాన్ని తరలిస్తూ వేరే దగ్గర రెండు మూడు సెంటర్లు ఉన్న గ్రామానికి తీసుకెళ్లి అక్కడ విక్రయించడం జరుగుతుంది. మరికొంతమంది రైతులు ప్రైవేట్ దళారులకు తక్కువ ధరకే విక్రయించడం జరుగుతుంది. ఇకనైనా ప్రభుత్వం రాచాపూర్ లో ఇంకో సెంటర్ అయిన ప్రారంభించాలని రైతులు తెలుపుతున్నారు. మే ఒకటవ తారీఖున ప్రారంభించిన ఐకెపి కొనుగోలు కేంద్రం ఇప్పటివరకు మూడు లారీలు మాత్రమే పోతే మరి మిగతా ధాన్యాన్ని వర్షాకాలం వచ్చే సమయానికి కూడా తరలించే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఇంకో కొనుగోలు సెంటర్ ప్రారంభించాలి : శాతం నరేష్, రాచాపూర్ రైతు**



మా గ్రామంలో ఇన్ని ఎకరాలలో వరి పంట పండిస్తున్నాం. కేవలం ఒక ఐకెపి సెంటర్తో మాత్రమే కొనుగోలు చేయడం సరిపోవడం లేదు. పండించిన పంట వెంట వెంట కొనుగోలు చేస్తే బాగుంటుందని రైతుల తరఫున ప్రభుత్వానికి తెలుపుతున్నాను. లేకపోతే ఈ అకాల వర్షాలకు రైతులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది దయచేసి ప్రభుత్వం ఇంకో సెంటర్ ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలుపుతున్నాను.

### ఆర్ట్స్ కళాశాల అధ్యాపకునికి అమెరికా యూనివర్సిటీ ఆహ్వానం



**హనుమకొండ ప్రతి నిధి మే 10 (జనం సాక్షి) :** హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డికి అమెరికాలోని ఎరోడెక్స రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి అంతర్జాతీయ సదస్సులో పాల్గొనుటకు ఆహ్వానం అందినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికాలో మే 28, 29 తేదీలలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో మీడియా అధ్యయనాలు, డిజిటల్ కమ్యూనికేషన్, సమకాలీన జర్నలిజం ధోరణులపై డాక్టర్ ఆదిరెడ్డి తన పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారని ఆమె వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి విద్యా వేదికపై కళాశాల అధ్యాపకునికి ఆహ్వానం అందడం కళాశాలకు గర్వకారణమని ప్రొఫెసర్ జ్యోతి పేర్కొన్నారు. డాక్టర్ ఆదిరెడ్డి జర్నలిజం రంగంలో చేస్తున్న పరిశోధనలు, విద్యా సేవలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఆనందదాయకమని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ ఆదిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఈదురు గాలుల వర్షానికి విరిగిన విద్యుత్ స్తంభాలు

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పునరుద్ధరణ పనులు చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులు



**చెన్నారావుపేట, మే 10( జనం సాక్షి):** ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. శనివారం రాత్రి కురిసిన ఈదురుగాలుల వర్షానికి మగ్దంపురం ఫీడర్ కు సరఫరా అయ్యే లెవెన్ కెవి విద్యుత్ లైన్ లో 8 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అలాగే ఉప్పరపల్లి గ్రామ సమీపంలో వ్యవసాయ బావులకు వెళ్లే ఎల్ టి విద్యుత్ లైన్ లో మూడు స్తంభాలు విరిగిపడ్డాయి. అలాగే విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో అక్కల్ చెడ, ఈర్య తండాలకు శనివారం రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం విద్యుత్ ఏఈ సంపత్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు.



# ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- చైర్మెన్ డా.సంధ్యారాణి రాజారమేష్

**రామకృష్ణాపూర్, మే 10 (జనంసాక్షి):** ఆరోగ్యంపై ప్రజలందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్మన్ డా.గోడిసెల సంధ్యారాణి-రాజారమేష్ సూచించారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ హైదరాబాద్ సౌజన్యంతో స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చైర్మన్ సంధ్యారాణి వైద్యులతో కలిసి శిభిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవ జీవన శైలిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య వెధ్య పరీక్షలు చేయించుకోవడం క్షేమం అన్నారు. వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వైద్యాన్ని అందించడం అభినందనీయం అన్నారు. మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన పద్మశాలి సంఘం సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత-శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు వనం సత్యనారాయణ, సభ్యులు ఆడెపు తిరుపతి, వెంకటేశం, కుమార్, స్థానిక కౌన్సిలర్ కృపానందం, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాలి

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**మహబూబాబాద్ బ్యూరో, మే 10(జనం సాక్షి):** **కేంద్ర మంత్రి బండి సంజయ్‌**ను బర్తరఫ్ చేయాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న మహిళలపై అరాచకాలపై అలాగే ప్రభుత్వ నిర్లక్ష్యంపై జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజి మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గన్ కల్చర్, గంజాయి కల్చర్, డ్రాగ్ కల్చర్, మానభంగం కల్చర్ అలవాటు చేస్తున్నారన్నారు. ఇటీవల కేంద్రం వెలువరించిన క్రైమ్ రిపోర్ట్ లో రాష్ట్ర క్రైమ్ శాతం 13.44 కు పెరిగిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసారు. ముఖ్యంగా మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేదన్నారు. పోలీస్ యంత్రాంగాలు చెదలు పట్టిందన్నారు. కేసిఆర్ హయాంలో ప్రజల రక్షణ కోసం, మహిళల కోసం కేసీఆర్ తండ్రిలా ఆలోచన చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రం హోం మంత్రి లేకుండా ఉండదని, కానీ మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్వయంగా హోం శాఖను నిర్వహిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. దీనివల్ల పోలీసు వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తుందని ప్రజలు ఆశించారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు పై పోక్సో కేసు నమోదు చేయడానికి మైనర్ బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లలో దాదాపు 5 గంటలు వేచి ఉండాల్సి వచ్చింది అన్నారు. మోడీ రాక నేపథ్యంలో బాలిక తరపున ఎవరైనా అడ్డుకుంటారని కేసు నమోదు చేశారు. కానీ కొంతమంది అధికారులు ఇదే కేసును హనీ ట్రాప్ అని తప్పు దోవ పెడుతున్నారు. బండి సంజయ్ ఇంట్లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఏంటో అని అర్థం చేసుకోవాలన్నారు. మోడీ క్యాబినెట్ లో ఉన్న బండి సంజయ్ ఇలాంటి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటాడో చెప్పాలని, బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల దిల్‌సుఖ్ నగర్‌లో ఒక సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిణి పట్ల జరిగిన ఘటనను ఆమె ప్రస్తావించారు. సుమారు 40 మంది వ్యక్తులు ఆమెను మూడు గంటల పాటు చుట్టుముట్టారని, అప్పుడు కనీసం ఒక పెట్రోలింగ్ వాహనం కూడా రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఉన్నత స్థాయి పోలీస్ అధికారిణికే రక్షణ లేకపోతే, సామాన్య మహిళల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రం నడిబొడ్డులో ఉన్న హైదరాబాదులో ఒక రిటైర్డ్ సీనియర్ పోలీసు ఉన్నత అధికారి భార్యను హత్య చేసి ఇల్లు దోచుకున్న నేటికీ కేసును చేదించలేదన్నారు. కరీంనగర్ నడిబొడ్డులో ఉన్న ఒక జ్యువెలరీలో పట్టపగలు దుండగులు దోచుకున్న కేసు నేటికీ అతిగతం లేదన్నారు. ఇన్ని నేరాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి ఎందుకు సమీక్ష నిర్వహించడం లేదని, పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయడం లేదని ఆమె విమర్శించారు. రేవంత్ రెడ్డి ఈ విషయంలో సిగ్గుతో తలదించుకోవాలని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. రక్షణ, భద్రతపై ప్రభుత్వ తీరును వారు తీవ్రంగా ఖండించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెట్టే శ్రద్ధ, టిఆర్ఎస్ నాయకులు మీద ఉన్న శ్రద్ధ రాష్ట్ర శాంతి భద్రత మీద లేదన్నారు. మాజీ ఎంపీ మలోత కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని, శాంతి భద్రతలు అడుగంటిపోయాయని అన్నారు. ముఖ్యంగా మహిళల రక్షణ పట్ల ప్రభుత్వ పనితీరు అసలు బాగలేదన్నారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బానోత్ పద్మ, భుక్య బుజ్జి, ముత్యం వెంకన్న, మాజీ జిల్లా చైర్మన్ బిందు, మాజీ కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి, బారాస సీనియర్ నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎల్దీ మల్లయ్య, మార్నేని రఘు, కొరివి లింగ స్వామి, బానోత్ రాము తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీసీ కవితా భేరిలో డాక్టర్ బి.వెంకట్‌కు ఘన సన్మానం



**నిర్మల్ బ్యూరో, మే10 (జనంసాక్షి) :** నిర్మల్‌కు చెందిన ప్రముఖ సంస్కృతాంధ్ర పద్యకవి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డా. బి. వెంకట్‌కు రాష్ట్ర స్థాయి బీసీ కవితా భేరి సన్మానం లభించింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభలో తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల్లో ఆయనకు అభినందన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని, బీసీల సామాజిక సమస్యలపై తన పద్యగానంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి 150 మందికి పైగా కవులు, కవయిత్రులు పాల్గొన్నారు. పూర్వ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారి, బీసీ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు హాజరయ్యారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
11 మే 2026

## స్మార్ట్ సిటీ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాన మంత్రి



**ఝరాసంగం, మే 10 (జనం సాక్షి) :** జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాంతంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్,ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసిడిఐటి), తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (టీజీఐఐసీ) వారు సంయుక్తంగా 3245 ఎకరాలలో, 2369 కోట్ల బడ్జెట్తో నిర్మిస్తున్న జహీరాబాద్ ఇండస్ట్రీయల్ స్మార్ట్ సిటీ నిర్మాణానికి ఆదివారం భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి హైదరాబాద్ లోని హెచ్ఐసీసీ ప్రాంగాణం నుండి వర్చువల్గా ప్రారంభించారు. ఈ దృశ్యాలను ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి,బర్దిపూర్ శివారులోని నిమ్జ్ ప్రాంతంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అధికారులు,ప్రజలు లైవ్ను వీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి విశాలాక్షి,ఆర్డీఓ దేవుజా,టీజీఐఐసీ అధికారులు,కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# సమాజ సేవలో వాసవీ క్లబ్స్ ముందంజలో నిలవాలి

**భద్రాచలం, మే 10 (జనంసాక్షి) :** సమాజ సేవలో వాసవీ క్లబ్స్ ముందంజలో నిలవాలని క్యాబినెట్ సభ్యులు ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రముఖ సామాజిక సేవకుడు టి.జి. వెంకటేష్ అన్నారు. అంతర్జాతీయ వాసవీ క్లబ్స్ డిస్ట్రిక్ట్ వి106ఎ జిల్లా గవర్నర్ చారుగుళ్ళ శ్రీనివాస్, క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి అడ్మినిస్ట్రేషన్ చింతల వినోద్ కుమార్, క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి సర్వీసెస్ రేపాక ధనుంజయ రాజా మనోహర్, క్యాబినెట్ కోశాధికారి ఉడతా నగేష్ కుమార్ లు క్యాబినెట్ సభ్యులు ప్రముఖ పారిశ్రామికవేత్త, దాతృత్వ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిచ్చే ప్రముఖ సామాజిక సేవకుడు టి.జి. వెంకటేష్ ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు, విద్య, వైద్య సేవలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు యువతకు మార్గదర్శకత్వం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమాజ సేవ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చేయూత అందించడం ద్వారా నిజమైన మానవత్వం ప్రతిఫలిస్తుందని టి.జి. వెంకటేష్ పేర్కొన్నారు. వాసవీ క్లబ్స్ సభ్యులు సేవా దృక్పథంతో సమాజంలో ముందుకు సాగుతూ అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సేవా కార్యక్రమాలు



కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా గ్రామీణ, గిరిజన, వెనుకబడిన ప్రాంతాల వరకు విస్తరించాలని సూచించారు. ప్రస్తుతం సమాజంలో యువతకు సరైన మార్గదర్శకత్వం అత్యంత అవసరమని, యువతలో సేవా భావం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు, క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లా గవర్నర్ చారుగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ వాసవీ క్లబ్స్ లక్ష్యం కేవలం సేవ మాత్రమేనని, సమాజంలోని ప్రతి వర్గానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించడం తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సహాయం, ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలు మంచి స్పందన పొందుతున్నాయని వివరించారు. అనంతరం క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి, ప్రధాన కార్యదర్శి సర్వీసెస్, క్యాబినెట్ కోశాధికారి, క్యాబినెట్ సభ్యులు మాట్లాడారు. సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో సభ్యుల సమన్వయం ఎంతో కీలకమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య, విద్యా సేవలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. పారదర్శక విధానాలతో సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. తొలుత క్లబ్ ప్రతినిధులు టి.జి. వెంకటేష్ కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పరస్పర ఆత్మీయ వాతావరణంలో పలు సామాజిక అంశాలపై చర్చించుకున్నారు. సమాజంలోని ప్రతి వర్గానికీ ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వాసవీ క్లబ్స్ డిస్ట్రిక్ట్ కు చెందిన పలువురు క్యాబినెట్ సభ్యులు, జోన్ చైర్మన్లు, క్లబ్ అధ్యక్షులు, సేవా కార్యకర్తలు, ప్రముఖ వ్యాపారవేత్తలు, సామాజిక సేవకులు పాల్గొన్నారు.

## యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచుకునేందుకు జాబ్ మేళాలు తోడ్పడతాయి

- **ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి, కరస్పాండెంట్ మే 10 (జనం సాక్షి) :** యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచుకునేందుకు జాబ్ మేళాలు తోడ్పడతాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కుంభం ఫౌండేషన్ మరియు వన్ ఎం వన్ బి సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా గత రెండు రోజులుగా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు మరియు టోకెన్ల కేటాయింపు కార్యక్రమం పూర్తికాగా, ఆదివారం ఇంటర్వ్యూ కార్యక్రమం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గారు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కుంభం ఫౌండేషన్ నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా అభినందనీయమని అన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల యువతకు స్థానికంగానే



ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని, యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ఈ జాబ్ మేళా అనేక కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత ధైర్యంగా ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని, ఉద్యోగం చిన్నదైనా సరే అనుభవాన్ని సంపాదించడం ఎంతో ముఖ్యమని, ప్రతి యువతి, యువకుడు తన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని తెలిపారు. నైపుణ్యం మరియు అనుభవమే భవిష్యత్తులో మరింత ఉన్నత అవకాశాలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కుంభం ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని, జాబ్ మేళా నిర్వహణలో విశేషంగా కృషి చేసిన కుంభం ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ కుంభం కీర్తి రెడ్డిని, వాలంటీర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భువనగిరిలో యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణ అందించే విధంగా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఐబీఎం ప్రతినిధులను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరగా వారు సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐబీఎం అసోసియేట్ డైరెక్టర్ ప్రసన్న నోరి, డైరెక్టర్ అభిరామ్, దీపిక వెంకటేష్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, అధికారులు, వాలంటీర్లు, ఉద్యోగార్థులు మరియు యువత పాల్గొన్నారు.

## మాజీ ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌పై మంత్రి పొంగులేటి వద్ద ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు



**తిరుమలాయపాలెం, మే 10 (జనంసాక్షి) :** పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిధుల దుర్వినియోగం కలకలం రేపుతోంది. గతంలో ఇక్కడ ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపేందర్ అనే వ్యక్తి కళాశాల నిధులను అక్రమంగా డ్రా చేశారని ఆరోపిస్తూ శనివారం తిరుమలాయపాలెంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఫిర్యాదు అందింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వాతి ఈ మేరకు మంత్రికి ఫిర్యాదు చేస్తూ.. మాజీ ప్రిన్సిపాల్ ఉపేందర్ తాను బదిలీపై వెళ్లే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకొని, సుమారు 10 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులను డ్రా చేసి వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారని ఆమె ఆరోపించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిధుల గోల్‌మాల్‌కు పాల్పడిన ఉపేందర్‌పై కఠిన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, వెంటనే అతన్ని విధుల నుండి తొలగించాలని పిండిప్రోలు గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన మంత్రి, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఆరోగ్యకరమైన జీవితానికి యోగా తప్పనిసరి



**సూర్యాపేట, మే 10 (జనంసాక్షి) :** నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికి యోగా తప్పనిసరి అని, విద్యార్థులు చదువుతోపాటు యోగా తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలంగాణ యోగ ప్రచార సమితి అధ్యక్షులు ఎం.ప్రసాద్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో గత 15 రోజులుగా విద్యార్థులకు సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శ్రీవాసవి సేవా సమితి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రం గురూజీ చాడపాపిరెడ్డి, శ్రీవాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, బ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి కట్టెకోల పూర్ణ చందర్ రావుతో కలిసి సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు వారికి యోగా, ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.పిల్లలు యోగా నేర్చుకునే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.యోగాసనాలు, ప్రాణాయామముల ద్వారా పిల్లలకు శక్తితో పాటు మానసిక ఉత్సాహం పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యోగ ప్రచార సమితి కార్యదర్శులు ఝాన్సీలక్ష్మి, సుదర్శన్ రెడ్డి, శ్రీవాసవి సేవాసమితి గౌరవ సలహాదారులు గోపారపు రాజు,కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్,ఉపాధ్యక్షులు కుంచపర్తి రాజశేఖర్, సభ్యులు పోలా లక్ష్మీనారాయణ ,బెలిదే శ్రీనివాసు,వెంపటి శబరినాథ్ యోగసాధకులు వల్కి లింగయ్య, వేల్పుల సుధాకర్,గోరెంట్ల శ్రీనివాస్, మమత, శ్రీదేవి,జ్యోతి, జయలక్ష్మి,లింగయ్య, వెంకటరెడ్డి,వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, నాగరాజు, బాలకృష్ణ, శ్రీనాథ్, లక్ష్మి, విజయలక్ష్మి, విజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి

- **కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి, మే 10 (జనం సాక్షి) :** మే 11 నుండి 17 వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు జిల్లావ్యాప్తంగా విద్యా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు.

## బండి సంజయ్ ప్రతిష్ట దెబ్బతీయడానికే తప్పుడు ప్రచారం

**రాజేంద్రనగర్, మే 10 (జనం సాక్షి) :** కరీంనగర్ బిజెపి ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్కు మారుడిపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా బూటకమని, ప్రజలు అలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని తెలంగాణ రాష్ట్ర మునూరుకాపు సంఘం జేఏసీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు పత్రికా ప్రతినిధులతో మాట్లాడిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు, మున్నూరు కాపు సంఘం కార్యనిర్వాక అధ్యక్షులు బుక్క వేణుగోపాల్, కొందరు రాజకీయ ప్రత్యర్థులు కక్షపూరితంగా బండి సంజయ్ ప్రతిష్టను దెబ్బతీయడానికి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా బండి సంజయ్‌ను ఎదుర్కోలేక ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలోనే ఆయన కుమారుడిపై ఎలాంటి అభియోగాలు లేవని



స్పష్టమైనప్పటికీ, కావాలనే మరోసారి ఈ వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతోనే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు. బండి సంజయ్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం జేఏసీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

## ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో గ్రీవెన్స్ డే



**సూర్యాపేట ప్రతినిధి, మే 10 (జనంసాక్షి) :** ఇకపై ప్రతి సోమవారం ఆర్డిఓ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్డిఓలను ఆదేశించారు.ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక పై ప్రతి సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.

## హౌసింగ్ ఏఈని సస్పెండ్ చేయాలి



**ములకలపల్లి, మే 11 (జనంసాక్షి) :** మండలంలోని ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారులు పరిస్థితి దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారిందని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకురాలు, రాచన్నగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మడకం విజయ ఆరోపించారు. ఆదివారం రాచన్నగూడెం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకోవడం కోసం ఇందిరమ్మ లబ్దిదారులు తమ ఇండ్లను అప్పో సొప్పో చేసి కట్టుకుంటున్నారని, వాటిలో చాలా వరకు స్లాబ్ లు పడగా,మరికొన్ని స్లాబ్ దశలో ఉన్నాయన్నారు. గత నెల రోజులుగా హౌసింగ్ ఏఈ మండలానికి అందుబాటులో ఉండటం లేదని, లబ్దిదారులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఏఈ నిర్వాకం వల్ల బిల్లు ఆలస్యం జరుగుతున్నాయని లబ్ది దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏఈ ఇంటికి అయిదు నుండి పదివేల వరకు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వాళ్ళ ఫోటోలు మాత్రమే తీస్తూ లంచం ఇవ్వని లబ్దిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయం పై సోమవారం జిల్లా కలెక్టర్ ను కలిసి మండలంలో వున్నా ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు వివరిస్తామని ఆమె అన్నారు.

## మధిరలో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మధిర, మే 10 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మధిరలో ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా జిలుగుమాడు లోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నందు జరుగుతున్న వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మధిర లోని సిద్దినేనిగూడెం సొసైటీ చైర్మన్ కటికల సీతారామి రెడ్డి సతీమణి కి



కాలు విరిగగా వారిని పరామర్శించారు. అనంతరం శ్రీరస్తు ఫంక్షన్ హాల్ నందు జరుగుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధ రెడ్డి అన్నయ్య కుమారుడు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, దేవిశెట్టి రంగారావు, గూజ మెంబెర్స్ ఉమ్మినేని కృష్ణ, అమరవాది సత్యనారాయణ రెడ్డి, దేవరపల్లి అనంతరెడ్డి, శీలం వెంకట్రామిరెడ్డి, కపిలవాయి సత్యనారాయణ రాజు, గోళ్ళ ఉద్దండు, శీలం శ్రీనివాసరెడ్డి, అక్కినపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా చూడాలి

- **ఎమ్మెల్యే కుంభం**



**వలిగొండ, మే 10 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నివాసంలో రైస్ మిల్లర్లు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లింగ్ తదితర అంశాలపై రైతులు , మిల్లర్ల అభిప్రాయాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని, తూకం, చెల్లింపులు, రవాణా తదితర విషయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు.రైతులు ప్రభుత్వానికి అన్నదాతలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా ప్రతి చర్య తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా నాయక్ , సర్పంచ కుంభం వెంకట్ పాపిరెడ్డి, ఎమ్మార్వో దశరథ, ,పాశం సత్తిరెడ్డి , పట్టణ అధ్యక్షులు పోలేపాక జానకి రాములు, సీనియర్ నాయకులు బత్తిని సహదేవ్ గౌడ్, పల్సం సతీష్, మైసొల్ల ప్రవీణ్, కొండూరు సాయి, రైస్ మిల్లర్లు, రైతులు , నాయకులు పాల్గొన్నారు.

## భువనగిరిలో ఉద్యోగాల జాతర

- **యువత నైపుణ్యాల పెంపుతోనే ఉన్నత భవిష్యత్**
- **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**భువనగిరి, మే 10 (జనం సాక్షి) :** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కుంభం ఫౌండేషన్ మరియు 1 ఎం1 బి సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా విజయవంతంగా కొనసాగింది. గత రెండు రోజులుగా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు, టోకెన్ల కేటాయింపు కార్యక్రమాలు విజయవంతంగా పూర్తికాగా, ఆదివారం ప్రధాన ఇంటర్వ్యూ ప్రక్రియ ఘనంగా ప్రారంభమైంది. ఈ ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే ఒ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గత రెండు రోజులుగా అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి టోకెన్ల కేటాయింపు ప్రక్రియను క్రమబద్ధంగా పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ రోజు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, అర్హత సాధించిన వారికి నియామక పత్రాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత ధైర్యంగా ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని సూచించారు. ఉద్యోగం చిన్నదైనా అనుభవాన్ని సంపాదించడం ఎంతో ముఖ్యమని, ప్రతి యువకుడు తన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని తెలిపారు. నైపుణ్యం, అనుభవమే భవిష్యత్తులో మరింత ఉన్నత అవకాశాలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కుంభం ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. జాబ్ మేళా విజయవంతానికి విశేషంగా కృషి చేసిన కుంభం ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ కుంభం కీర్తి రెడ్డిని, వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. యువత కోసం ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే ఒ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ జాబ్




మేళా అనేక కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పిస్తోందని అభిప్రాయపడ్డారు. ఇదే సందర్భంగా భువనగిరిలో యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణ అందించే విధంగా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ×దీవీ ప్రతినిధులను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరగా, వారు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. స్థానిక యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐబీఎం అసోసియేట్ డైరెక్టర్ ప్రసన్న నోరి, డైరెక్టర్ అభిరామ్, దీపిక వెంకటేష్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, అధికారులు, వాలంటీర్లు, ఉద్యోగార్థులు, భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.




## బుల్లెట్ రాజా రాయల్ ఎన్‌ఫీల్డ్

### ప్రపంచంలోని బలమైన వాహన బ్రాండ్లలో మూడో స్థానం


**న్యూఢిల్లీ:**కుర్రకారు మనసు దోచుకున్న దేశీయ బుల్లెట్ బ్రాండు 'రాయల్ ఎన్‌ఫీల్డ్'.. ప్రపంచ విపణిలోనూ దుమ్మురేపుతోంది. ప్రపంచంలోని బలమైన వాహన బ్రాండ్లలో మూడో స్థానాన్ని పొందింది. ఈ క్రమంలో ఆడి, ఫెరారీ లాంటి అంతర్జాతీయ దిగ్గజ బ్రాండ్లనూ వెనక్కి నెట్టింది. 2026 సంవత్సరానికి బ్రాండ్ ఫైనాన్స్ రూపొందించిన బలమైన వాహన బ్రాండ్ల జాబితాలో టయోటా, బీఎండబ్ల్యూలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. బ్రాండ్ స్ట్రెంథ్ సూచీలో 100 పాయింట్లకు 88.6 పాయింట్ల స్కోర్, ఏఏఏ రేటింగ్‌ను సాధించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మూడో స్థానంలో నిలిచింది. ఆడికి నాలుగో స్థానం, ఫెరారీకి ఏడో స్థానం లభించింది. భారత్‌కు చెందిన టాటా మోటార్స్ బ్రాండు అయిదో స్థానంలో నిలవగా.. మారుతీ సుజుకీ 6వ ర్యాంకును, మహీంద్రా అండ్ మహీంద్రా 8వ ర్యాంకును, హీరో మోటోకార్ప్ 10వ ర్యాంకును పొందాయి. ప్రపంచంలోని 10 బలమైన వాహన బ్రాండ్లలో భారత్ నుంచి 5 కంపెనీలు చోటు దక్కించుకోవడం గమనార్హం. అంతర్జాతీయంగానూ రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు ఆదరణ పెరుగుతోందనడానికి తాజాగా ఆ సంస్థ సాధించిన ర్యాంకే నిదర్శనం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు కార్యకలాపాలు ఉన్నాయి. ఇక ప్రపంచంలోని అత్యంత విలువైన బ్రాండ్లలో టయోటా అగ్రస్థానంలో నిలిచింది. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ రెండు, మూడో స్థానంలో ఉన్నాయి. అత్యధిక విలువున్న 10 వాహన బ్రాండ్లలో భారత్ నుంచి ఏ సంస్థకూ చోటు దక్కలేదు.




# ఏఐ టూల్.. కాస్ట్లీ గురూ

### ఉద్యోగుల వేతనాల కంటే ఎక్కువ వ్యయాలు
### చిన్న కంపెనీలకు భారం
### సరైన ప్రణాళిక లేకుంటే కష్టమే

**ఉద్యోగుల స్థానంలో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత తీసుకువస్తే, వ్యయాలు తగ్గుతాయనే భావన సరికాదని అనుభవజ్ఞులు చెబుతున్నారు. ఉద్యోగుల విధులను ఆటోమేషన్ చేసేందుకు వ్యయాలు భారంగా మారుతున్నాయని సమాచారం.**




**న్యూఢిల్లీ:**ఏఐ ఖర్చులు ఉద్యోగుల జీతాలను మించి కనిపిస్తున్నా యని ఎన్‌విడియా, ఉబర్ వంటి దిగ్గజ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు చెబుతున్నారు. ఇందులో ఒక కంపెనీ తమ ఏఐ ప్రొవైడర్ నుంచి భారీ బిల్లు అందుకుందట. ఈ నేపథ్యంలో.. ఆటోమేషన్‌పై పెట్టుబడులు కొనసాగుతున్నా.. మనుషులను ఏఐతో భర్తీ చేస్తే, నిజంగా వ్యయాలు తగ్గుతాయా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏఐ ఆటోమేషన్ వైపు వెళుతున్న కంపెనీలకు.. ఇపుడు ఏఐ టూల్స్ వ్యయాలు, తమ ఉద్యోగుల వేతనాల కంటే మరీ అధికంగా ఉన్నాయని అర్థమయిందని ఎన్‌విడియా, ఉబర్ ఎగ్జిక్యూటివ్‌లు చెబుతున్నారు. ప్రస్తుతం కంపెనీలు కోడింగ్ అసిస్టెంట్లను, ఆటోమేషన్ ఏజెంట్లను వినియోగించడం పెరిగింది. ఆయా స్థానాల్లో పనిచేసిన ఉద్యోగుల వ్యయాలతో పోలిస్తే, కంప్యూట్ వ్యయాలు చాలా అధికంగా ఉంటున్నాయట. చాలా వరకు వినియోగదారు ఏఐ అసిస్టెంట్స్‌ను సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లపై ప్రొవైడర్లు అందిస్తున్నారు. కానీ ఎంటర్‌ప్రైజ్ ఏఐ వ్యయాలకు మాత్రం టోకెన్ వినియోగానికి లంకె ఉంటుంది. ఏఐ ఆధారిత కోడింగ్, ఆటోమేషన్, షెడ్యూల్డ్ టాస్క్‌లు కొనసాగే కొద్దీ వ్యయాలు పెరుగుతూ వెళతాయి. అయినా ఆటోమేషన్‌పై చిన్నాపెద్దా తేడా లేకుండా సంస్థలన్నీ పెట్టుబడులను కొనసాగిస్తున్నాయి. తమ కంపెనీకి చెందిన లైవ్ కోడ్ అప్‌డేట్‌లలో 11% వరకు ఏఐ ఏజెంట్లే రాస్తున్నాయని ఉబర్ సీటీఓ ప్రవీణ్ నాగ అంటున్నారు. ఒక సీటీఓగా తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ నుంచి ఏఐ ఏజెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌కు మార్పు చెందాల్సిన అవసరం కనిపిస్తోందన్నారు. ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్‌హ్యాంగ్ సైతం ఏఐ వినియోగాన్ని ఇంజినీర్లు పెంచుకోవాలని చెబుతున్నారు. ఏటా 2 లక్షల డాలర్లను సంపాదిస్తున్న ఇంజినీర్లు, ఏఐ టోకెన్లపై ఏటా లక్ష డాలర్లను ఖర్చు చేయాలని సూచిస్తున్నారు.

**సమర్థతపైనా ప్రశ్నలు**

ఇప్పటికే ఏఐ వ్యయాలపై అంచనాలు భారీగా పెరిగాయని ఉబర్ సీటీఓ ప్రవీణ్ నాగ చెబుతున్నారు. ఇది పెద్ద కంపెనీలకే పరిమితం కాలేదు. స్వాన్‌ఏఐకి చెందిన అమోస్ బార్-జోసెఫ్ మాట్లాడుతూ తమ వద్ద నలుగురు ఉద్యోగులు పనిచేసే బృందానికి బదులు, ఆంత్రోపిక్ నుంచి 1,13,000 డాలర్ల బిల్లు వచ్చిందని చెప్పారు. అంటే ఒక్కో ఉద్యోగికి నెలకు 28,000 డాలర్లన్నమాట. నిజంగా మనుషులతో పోలిస్తే ఏఐ చౌకా కాదా అన్న అంశంపై చర్చను ఈ వ్యయాలు లేవనెత్తుతున్నాయి. సమర్థత విషయానికొస్తే ఏఐతో పోలిస్తే 77% కేసుల్లో మనుషులే బాగా పని చేసినట్లు ఎమ్ఐటీ నివేదిక ఒకటి పేర్కొంది.

**కంపెనీలు ఇపుడు ఏం చేయాలి?**

కంపెనీలు ఇపుడు ఏఐ వ్యయాలను తాత్కాలిక పెట్టుబడులుగా భావించాలా లేదంటే, టోకెన్ వ్యయాలు తమ వేతన బిల్లులకు శాశ్వతంగా జత అవుతాయని అనుకోవాలా అని మదనపడుతున్నాయి. అదే సమయంలో ఏఐ వ్యూహాలు లేని కంపెనీలకు భారీ నష్టాలూ తప్పవని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. సరైన ప్రణాళిక లేకుండా ఏఐని అందిపుచ్చుకోవడం కోసం చాలా వరకు కంపెనీలు పరుగులు తీసి, ప్రతిఫలాలను పొందడంలో ఇబ్బందులూ పడుతున్నాయి. ఏఐని అందిపుచ్చుకునే క్రమంలో కంపెనీలు లేఆఫ్‌లు చేపట్టే అవకాశమూ లేకపోలేదు.

## సెమాగ్లుటైడ్ ధరలు తగ్గాయ్



హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా మధుమేహం, ఊబకాయం చికిత్సలో సంచలనం సృష్టిస్తున్న సెమాగ్లుటైడ్ మందుల మార్కెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు చుక్కలనంటిన ఈ మందు తయారీకి వాడే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్ (ఏపీఐ) ధరలు ఇప్పుడు అమాంతం నేల చూపులు చూస్తున్నాయి. గత ఏడాది కాలంలో ఈ ధరలు 80 శాతం మేర పడిపోవడం విశేషం. ముఖ్యంగా భారత మార్కెట్‌లో సెమాగ్లుటైడ్ పేటెంట్ గడువు మార్చిలో ముగియడంతో, దేశీయ ఫార్మా దిగ్గజాలు రంగంలోకి దిగడం ఈ ధరల పతనానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ పరిణామం భారతీయ జెనరిక్ కంపెనీలకు వరంగా మారింది. సామాన్య వ్యాధిగ్రస్తులకు బరువు తగ్గే మందులు అతి తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. గతంలో సెమాగ్లుటైడ్ ఏపీఐ సరఫరా డానిష్ ఫార్మా దిగ్గజం నోవో నార్డిస్క్ వంటి కొన్ని కంపెనీల చేతుల్లోనే ఉండేది. దీంతో మార్కెట్లో ఒక గ్రాము సెమాగ్లుటైడ్ ఏపీఐ ధర ఏకంగా 900 డాలర్ల (రూ.83,000) వరకూ పలికేది. కానీ, ప్రస్తుతం ఈ ధరలు అమాంతం 160 డాలర్ల (రూ.14,500)కు పడిపోయాయి.

**దేశీయ కంపెనీల కన్ను..**

భారత్‌లో సుమారు 10 కోట్లకు పైగా మధుమేహ వ్యాధిగ్రస్తులు, 13.5 కోట్లకు పైగా ప్రజలకు ముందస్తు మధుమేహం ఉన్నట్లు అంచనా. 25 కోట్ల మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. దీంతో ఈ మందులకు దేశీయంగా భారీ గిరాకీ ఉంటుందని దేశీయ కంపెనీలు భావిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి బరువు తగ్గించే మందుల మార్కెట్ రూ.94,000 కోట్లకు (100 బిలియన్ డాలర్లు) చేరుకుంటుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఇందులో భారత మార్కెట్ విలువ రూ.9,300 కోట్లుగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు భారత్‌లోని దాదాపు 50కి పైగా కంపెనీలు సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాన్ని విడుదల చేశాయి.

**తక్కువ ధరకే..**

ప్రపంచ ఫార్మా రాజధానిగా పిలిచే హైదరాబాద్ ఈ మార్కెట్‌ను శాసించే దిశగా అడుగులు వేస్తోంది. డాక్టర్ రెడ్డీస్, నాట్కో, హెటిరో, ఎంఎస్ఎన్ ఫార్మాలు సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చాయి. సన్‌ఫార్మా, జైడస్ లైఫ్ సైన్సెస్, గ్లెన్‌మార్క్, లుపిన్, ఎరిస్ లైఫ్ సైన్సెస్ వంటి సంస్థలూ పోటీపడుతున్నాయి. ఏడాది క్రితం వరకూ నోవో నార్డిస్క్ ఉత్పత్తులైన వెగోవీ ఖర్చు నెలకు రూ.16,400, ఓజెంపిక్ ఖర్చు నెలకు రూ.11,000 వరకూ ఉండేవి. పేటెంట్ ముగిసిన తర్వాత దేశీయ సంస్థలు జనరిక్ వెర్షన్ల ధర నెలకు రూ.1,290 నుంచి రూ.4,200 వరకూ అందిస్తున్నాయి. మరోవైపు ఈ విభాగంలో తన గుత్తాధిపత్యం కాపాడుకునేందుకు నోవో నార్డిస్క్ సైతం తన మందుల ధరలను దాదాపు 48 శాతం మేర తగ్గించింది.

**నోటి మాత్రల రూపంలోనూ..**

ప్రస్తుతం ప్రీ-ఫిల్డ్ డిస్పోజబుల్ పెన్ రూపంలో వస్తున్న ఈ ఔషధాలు.. రానున్న కొన్ని రోజుల్లో మాత్రల రూపంలోనూ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విషయంలో డాక్టర్ రెడ్డీస్‌కు గత నెలలోనే సీడీఎస్‌సీఈ అనుమతినిచ్చింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,39,950 (22 క్యారెట్లు) | ₹ 1,52,680 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,74,900

# త్వరలో పెట్రో షాక్ తప్పదా?

## 10 వారాల్లో రూ.లక్ష కోట్ల నష్టం..



**ఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన ఇంధన ధరలతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలు భారీ నష్టాలు చవిచూస్తున్నాయి. మూడు సంస్థలూ కలిపి రోజుకు రూ.1600-1700 కోట్ల మేర నష్టపోతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. గడిచిన 10 వారాల్లో రూ.1 లక్ష కోట్ల మేర నష్టాలు చవిచూసినట్లు తెలిపాయి. భారీ నష్టాల నేపథ్యంలో త్వరలోనే పెట్రో షాక్ తప్పదని తెలుస్తోంది. ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు మొదలై, అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పూ చేయలేదు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ పాత ధరకే విక్రయిస్తున్నాయి. దీంతో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ విక్రయాలపై మూడు సంస్థలూ కలిపి రోజుకు రూ.1600-1700 కోట్లు చొప్పున గడిచిన పది వారాల్లో రూ.1 లక్ష కోట్లు నష్టపోయినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో క్రూడాయిల్ కొనుగోలుకు మూలధనం సమకూర్చుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని, మూలధన వ్యయాలకు సంబంధించిన కాలవ్యవధులను సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందని చమురు రంగ నిపుణులు విశ్లేషించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనేది రాజకీయ అంశమని, దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని మరో వ్యక్తి తెలిపారు. చమురు ధరల పెంపు అనివార్యమని, అయితే ఎంత మొత్తం? ఎప్పుడు చేపడతారనేది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. జపాన్, యూకే వంటి దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను 30 శాతం పెంచాయని గుర్తుచేశారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకం ప్రభుత్వం తగ్గించదన్నారు. దీనివల్ల ప్రభుత్వం కూడా రూ.14వేల కోట్ల ఆదాయం కోల్పోతోందన్నారు.

## ఎయిరిండియా ఉద్యోగుల చేతివాటం..

### 3 ఏళ్లలో వెయ్యి మందికి ఉద్వాసన




ముంబయి: నైతిక విలువలు పాటించనందుకు టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా విమానయాన సంస్థ గడిచిన మూడేళ్లలో వెయ్యి మంది ఉద్యోగులను తొలగించింది. ట్రావెల్ పాలసీని దుర్వినియోగం, సంస్థ వస్తువుల విషయంలో చేతివాటం ప్రదర్శించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించింది. శుక్రవారం జరిగిన టౌన్‌హాల్ మీటింగ్‌లో ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ ఉద్యోగుల తొలగింపు విషయాన్ని వెల్లడించారు. విమానంలోని వస్తువులను తస్కరించడం, ఛార్జీ వసూలు చేయకుండా అదనపు బ్యాగేజీని విమానంలోకి అనుమతించడం వంటి చర్యలకు కొందరు ఉద్యోగులు పాల్పడ్డారని ఈ సందర్భంగా విల్సన్ తెలిపారు. ఎంప్లాయీ లీజర్ ట్రావెల్ పాలసీని సైతం వందలాది మంది సిబ్బంది దుర్వినియోగం చేశారని గుర్తుచేశారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని చెప్పారు. ఎవరూ మనల్ని గమనించనప్పుడు కూడా నైతికంగా నడుచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడకపోతే ఈ ఏడాది కఠిన పరిస్థితులు చవిచూస్తామని పేర్కొన్నారు. కొందరు ఎయిరిండియా ఉద్యోగులు ఫ్రీ టికెట్లను అమ్ముకున్నట్లు ఈ ఏడాది మార్చిలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తమ కుటుంబ సభ్యులుగా చూపించి ట్రావెల్ పాలసీ ప్రయోజనాలను పొందడం, ఉచిత టికెట్లను వేరే వ్యక్తులకు విక్రయించడం వంటివి ఎయిరిండియా అంతర్గత దర్యాప్తులో తేలింది. దీంతో ఎయిరిండియా చర్యలు చేపట్టింది. ఉద్యోగులకు పెనాల్టీ విధించింది. ఈ వ్యవహారం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఎయిరిండియాలో సుమారు 24 వేల మందిది ఉద్యగులు పనిచేస్తున్నారు.

## ఇరాక్ భూభాగంలో ఇజ్రాయెల్ రహస్య స్థావరం!

న్యూఢిల్లీ:ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ అనేక వ్యూ హాలు, ముందస్తు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇరాక్ ఎడారిలో రహస్యంగా ఓ తాత్కాలిక సైనిక స్థావరాన్నే నిర్మించిందట. అంతేకాదు.. ఈ ప్రాంతాన్ని గుర్తించిన ఇరాకీ దళాలపైనా ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఓ అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్‌పై ఫిబ్రవరి 28న అమెరికాతో కలిసి దాడులు మొదలు పెట్టడానికి కొన్ని రోజుల ముందే ఇజ్రాయెల్ దీనిని నిర్మించింది. తమ వాయుసేనకు లాజిస్టిక్ కేంద్రంగా పనిచేయడానికి దాన్ని ఏర్పాటు చేసిందని, ఈ విషయం అమెరికాకు తెలుసునని సమాచారం. యుద్ధ భూమిలో ఇజ్రాయెల్ పైలట్లు ప్రమాదానికి గురైతే.. వేగంగా రెస్క్యూ చేసేందుకు ప్రత్యేక దళాల బృందాన్ని అక్కడ మోహరించినట్లు తెలిసింది. అయితే, ఈ స్థావరాన్ని మార్చి తొలి వారంలోనే ఇరాక్ సేనలు దాదాపుగా గుర్తించాయి. ఈ క్రమంలో చెక్‌పోస్టును రక్షించేందుకు ఇరాక్ సేనలపై ఇజ్రాయెల్ దాడులు చేయగా, ఇందులో ఓ సైనికుడు ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై ఇరాకీ దళాలు దర్యాప్తు చేయకుండా నిరోధించడంలో నెతన్యాహు సైన్యం సఫలమైందని సమాచారం. అయితే, ఇరాక్‌పై దాడిలో అమెరికా ప్రమేయం లేదని సంబంధిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి.





## వీళ్లూ ఓ తల్లి కన్నబిడ్డలే

### శ్వేతసౌధం మహిళా ప్రతినిధికి ఇరాన్ మెసేజ్

**వాషింగ్టన్:**వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఇటీవల ఓ పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారికి వివియానా అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. లీవిట్ పోస్ట్‌పై అమెరికాలోని ఇరాన్ ఎంబసీ స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. అదే సమయంలో ఫిబ్రవరి 28న మినాబ్‌లోని ఒక పాఠశాలపై అమెరికా చేసిన దాడిలో 160 మందికి పైగా విద్యార్థులు మరణించిన విషయాన్ని గుర్తు చేసింది. 'పిల్లలు అమాయకులు. వారికి ప్రేమించడం తప్ప ఇంకేమీ తెలియదు. మినాబ్‌లోని పాఠశాలలో మీ బాస్ హత్య చేసిన పిల్లలు కూడా.. మీలాంటి తల్లులు నవ మాసాలు మోసి కన్నవారే కదా.. మీరు మీ బిడ్డను ముద్దు పెట్టుకునే ముందు ఆ తల్లుల గురించి ఒకసారి ఆలోచించండి' అని ఇరాన్ ఎంబసీ రాసుకొచ్చింది. ఇరాన్‌పై.. ఇజ్రాయెల్- అమెరికా తొలి రోజు చేసిన దాడుల్లో.. మినాబ్ నగరంలోని ఓ ప్రాథమిక పాఠశాలను తోమహాక్ క్షిపణి తాకింది. ఈ ఘటనలో 160 మందికి పైగా చిన్నారులు, 14 మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం సామూహిక సమాధులు తవ్వి వారందరినీ ఒకే దగ్గర పూడ్చిపెట్టిన దృశ్యాలను ఇరాన్ అధికారులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీనిపై అప్పట్లో కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ..అమెరికా ఎప్పుడూ పౌరులను లక్ష్యంగా చేసుకోదని అన్నారు. ఈ విషయంపై తమ యుద్ధ విభాగం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జన్ సురక్ష పథకాల్లో రూ.25,160 కోట్ల క్లెయిమ్‌ల పరిష్కారం

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



దిల్లీ: ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వంటి జన్ సురక్ష పథకాలు 2015 మే 9న ప్రారంభించినప్పటి నుంచి సుమారు రూ.25,160 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తెలిపారు. 11 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ ప్రధాన పథకాలు.. దేశ పౌరుల జీవితంలోని అనిశ్చితుల నుంచి కాపాడటం, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం ద్వారా బీమా, పింఛను రంగాన్ని విస్తృతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. జన్ సురక్ష పథకాల 11వ వార్షికోత్సవం సందర్భంగా విడుదల చేసిన గణాంకాలను ఉటంకిస్తూ, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై పథకాల కింద వరుసగా 27 కోట్లు, 58 కోట్లు, 9 కోట్లకు పైగా నమోదులు (ఎన్‌రోల్‌మెంట్స్) జరిగాయని సీతారామన్ తెలిపారు.

## బాలికపై లైంగిక వేధింపులు..

### శ్రీలంక బౌద్ధ సన్యాసి అరెస్టు

కొలంబో: పదిహేనేళ్ల బాలికను లైంగికంగా వేధించారన్న ఆరోపణలతో శ్రీలంకకు చెందిన 71ఏళ్ల బౌద్ధ సన్యాసి పల్లెగామ హేమరథనను అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. ఆయన దేశంలోని ప్రసిద్ధ ఆలయానికి ప్రధాన భిక్షువుగా ఉన్నారు. హేమరథనతోపాటు ఈ అకృత్యానికి సహకరించిన బాలిక తల్లిపైనా అనురాధపురలోని మేజిస్ట్రేట్ కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసింది. ఆలయ ఆవరణలో జరిగిన ఈ ఘటనపై ఒక బాలికను అపహరించి నిర్బంధించినట్లు గత మార్చి నెలలోనే ఫిర్యాదు నమోదైంది. విచారణలో మరిన్ని వివరాలు బయటకు వచ్చాయి. కొలంబోలోని ప్రైవేటు ఆసుపత్రి ఎమర్జెన్సీ యూనిట్‌లో చికిత్స పొందుతుండగా హేమరథనను.. బాలిక తల్లిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పార్లమెంట్ ముందు హంగరీ నాయకుడి స్టెప్పులు



జనంసాక్షి:హంగరీ పార్లమెంట్ ముందు ఓ ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. శనివారం ఆ దేశ నూతన ప్రధాని పీటర్ మగ్యార్ ప్రమాణస్వీకారం సమయంలో ఆ పార్టీ నేత జోల్ట్ హెగెడస్ అందరీ దృష్టినీ ఆకర్షించారు. పార్లమెంట్ మెట్లపై ఆయన వేసిన స్టెప్పులకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. హంగరీలో పీటర్ మగ్యార్ నేతృత్వంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడింది. పార్లమెంట్ వెలుపల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది మద్దతు దారులు తరలివచ్చారు. ఆ సమయంలో తమ పార్టీ విజయోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన మ్యూజిక్‌కు హెగెడస్ తన స్టెప్పులను అందించారు. ఎంతో హుషారుగా డ్యాన్స్ చేశారు. గిటార్ స్టెప్పులతో అలరించారు. దీంతో అక్కడ ఉన్న మద్దతుదారుల దృష్టిని ఆకర్షించారు. ఆయన స్టెప్పులకు మగ్యార్ కూడా నవ్వుతూ చప్పట్లతో ప్రోత్సహించారు. ఎన్నికల ఫలితాల సమయంలోనూ హెగెడస్ డ్యాన్స్ చేశారు. ఇప్పుడు మరోసారి తన నృత్యంతో అలరించి 'డ్యాన్సింగ్ పొలిటీషియన్'గా ఫేమస్ అయ్యారు. కొత్త ప్రభుత్వంలో ఆరోగ్య శాఖ మంత్రిగా హెగెడస్ బాధ్యతలు చేపట్టనున్నారు.




# కాప్రా సర్కిల్‌లో జోరుగా అక్రమ నిర్మాణాలు

## అక్రమ నిర్మాణదారులకు అధికారులు అండ.. ప్రభుత్వ ఆదాయానికి గండి

**కాప్రా మే (జనం సాక్షి) :** కాప్రా సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. సర్కిల్ పరిధిలోని కాప్రా,ఏఎస్ రావు నగర్ చర్లపల్లి డివిజన్లో విచ్చలవిడిగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వివరిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలో ఒక పర్మిషన్తో రెండిల్లు అక్రమంగా అదన్నపు ఫ్లోర్ తో యదేచ్ఛగానిర్మాణం కొనసాగిస్తున్నారు. కుషాయిగూడ డీమార్ట్ వెనకాల అక్రమంగా భారీ షెడ్ నిర్మాణం, పద్మశాలి టౌన్షిప్ లో పాత ఇంటి రెండు ఫ్లోర్లతోపాటు పదుల సంఖ్యలో పెంట్ హౌస్, అక్రమ షెటర్స్ నిర్మాణం కొనసాగుతున్న కాప్రా టౌన్ పని అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సామాన్యుడు చిన్నపాటి నిర్మాణం కొనసాగితే వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి నిర్మాణాన్ని కూల్చివేస్తారు. కానీ సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా నిర్మాణాలు కొనసాగుతున్న అధికారుల కళ్ళకు కనిపించడం లేదా అని స్థానిక ప్రజలు అంటున్నారు. అక్రమ నిర్మాణదారులతో అధికారులు కుమ్మక్కైన నిర్మాణదారుల నుంచి లక్షల రూపాయలు దండుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నంత అధికారుల స్పందించి కాప్రా సర్కిల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రైతుల సమస్యలు గాలికి వదిలి... మంత్రి పదవి కోసం ఢిల్లీ చక్కర్లు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల దుస్థితి
- కాంగ్రెస్ పాలనలో రైతన్న కన్నీళ్లు.. కేసీఆర్ హయాంలో రైతు రాజు
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు

**మర్రిగూడ, మే 9 (జనంసాక్షి):** మర్రిగూడ మండలం కుదబాక్షపల్లి, శివన్నగూడ గ్రామాల్లో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. భానుడి తీవ్రత మధ్య కల్లాల్లో ధాన్యం కుప్పల మీద పడిగాపులు కాస్తున్న రైతుల దుస్థితిని స్వయంగా పరిశీలించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.
కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, "కేసీఆర్ హయాంలో రైతును రాజును చేశాం. గ్రామ గ్రామాన ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేశాం. రైతు కల్లంలోకి హమాలీలను పంపి, ధాన్యం తూకం వేయించి 48 గంటల్లో డబ్బులు ఖాతాలో వేశాం" అని గుర్తు చేశారు.



"కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే పరిస్థితి తలకిందులైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనే నాథుడు లేడు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నెలల తరబడి నిల్వ ఉండిపోతోంది. అకాల వర్షాలకు తడిసి, రంగు మారి, మొలకెత్తి రైతులు గుండెలు మండిపోతున్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం" అని నిప్పులు చెరిగారు.

### ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై ఘాటు విమర్శలు

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని తీవ్రంగా విమర్శించారు. "అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి కూడా రైతుల సమస్యలను పూర్తిగా గాలికి వదిలేశారు. మంత్రి పదవి కోసం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారు తప్ప, రైతులు రోడ్డున పడుతుంటే క్షేత్రస్థాయిలో పర్యటించిన పాపాన పోలేదు. రైతుల ఉసురు పోసుకుంటే మంత్రి పదవి రాదు... రైతుల దీవెన ఉంటేనే మంత్రి పదవి సాధ్యం" అని హెచ్చరించారు.
ఇకనైనా ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, రైతుకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు అండగా ఉంటామని భరోసా కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, జిల్లా నాయకులు బచ్చు రామకృష్ణ, యరగండ్లపల్లి సర్పంచ్ సంతోష్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను బూత్ స్థాయి నుంచే బలోపేతం చేయాలి



**అల్వాల్ ,మే 10(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్త లు సమిష్టిగా పనిచేయాలని మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు. మాజీ శాసనసభ్యులు మైనం పల్లి ఆదేశాల మేరకు ఆదివారం 194వ డివిజన్ పరిధిలో అన్ని కమిటీల ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మల్లెల శివ నివాసంలో జరిగిన ఈ భేటీకి లక్ష్మీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు తీసుకోవాలన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలకు తావు లేకుండా, అందరూ ఐక్యంగా ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. మైనంపల్లి హనుమంతరావు సారథ్యంలో నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ప్రెసిడెంట్ కేబుల్ శేఖర్, నిమ్మ అశోక రెడ్డి, బాలకృష్ణారెడ్డి, టీవీ భాస్కర్, జనార్ధన్, కె. వెంకట్రావు, ఈ. జనార్ధన్, రేవంత్ కుమార్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మహిళా విభాగం నుంచి ఎంబీ లక్ష్మి, జ్యోతి, బి. దేవిక, ప్రభావతి రెడ్డి, ఏ. దీపిక, సి. రుక్మిణి హాజరయ్యారు. ఇతర ముఖ్య నాయకులు సి. అనిల్ కుమార్, జి. మోహన్ రావు, సయ్యద్ ఇబ్రహీం, ఆర్. కిరణ్ కుమార్, ఏ. సాయికుమార్, ఎం. శ్రీనివాస్, బి. సునీల్ కుమార్, డి. రాజేంద్ర కుమార్, కె.వి. సాయికుమార్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 137 మందిపై కేసు నమోదు

**శేరిలింగంపల్లి, మే 10 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ను సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం ఏడిసిపి జి. హనుమంతరావు పర్యవేక్షణలో సంబంధిత పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొత్తం 137 మందిపై కేసు నమోదు కావడం జరిగింది. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం ఏడిసిపి హనుమంతరావు ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తూ శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం పోలీసుల వీకెండ్ స్పెషల్ డ్రైవ్ ను విస్తృతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వ్యక్తులు మొత్తం 137 మంది వాహనదారులు, వ్యక్తులు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 113 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 05 మంది ఆటో రిక్షా డ్రైవర్లు, త్రీ వీలర్ వాహనదారులు కాగా 18 మంది కార్లను, ఇతర ఫోర్ వీలర్ లను నడుపుతున్న డ్రైవర్లు ఉండగా ఒకరు హెవీ వెహికల్ నడుపుతున్న డ్రైవర్ కూడా పట్టుబడినట్లు ఏడిసిపి తెలిపారు. ఇందులో 105 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్టంగా 356ఎంజి/100 ఎంఎల్ నుండి 200 ఎంజి/100 ఎమ్మెల్ వరకు, 18 మంది 201 ఎంజి/100 ఎమ్ఎల్ నుండి 300 ఎంజి/100 ఎం ఎల్ మద్యం సేవించడం జరిగిందని, అలాగే 14 మంది 301 ఎంజి/100 ఎమ్మెల్ నుండి 500 ఎంజి/100 ఎమ్మెల్ వరకు మద్యాన్ని సేవించి పట్టు బడడం జరిగిందని ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు వివరించారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పరచనున్నట్లు అధికారులు తెలుపగా, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఈ నేరానికి గరిష్ట శిక్ష పది సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. గత వారం(మే 4- 9 వరకు)మొత్తం 198 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టు పరిష్కరించడం జరిగిందని వీరిలో 04 గురికి జరిమానా, మరో 04 గురికి జైలు శిక్ష,190 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.



# ఖిల్లా లో విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

**ఖిల్లా ఘనపురం,10, మే, జనం సాక్షి :** ఖిల్లా ఘనపురం కేతావత్ బాబ్యా నాయక్ విద్యుత్ షాక్ తో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆముదం బండ తండాలో చోటుచేసుకుంది అని మండల ఎస్సై వెంకటేష్ ఆదివారం మీడియాకు తెలిపారు, అనంతరం ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ ఆముదంబండ తండాకు చెందిన కేతావత్ బాబ్యా వృతిరీత్యా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు అతనికి భార్య జ్యోతి ఇద్దరు పిల్లలు ఉన్నారు ఆదివారం తన ఇంటి దగ్గర ఉన్న నీటి సంపుకు విద్యుత్ మోటార్ ఆన్ చేసి తన ఆటోను నీళ్ల తో శుభ్రం చేసుకుని మోటార్ వైర్ చుడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడే కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు గమనించిన అతని భార్య జ్యోతి స్థానికులు సహాయం తో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చింది అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు బాబ్య నాయక్ ను పరిశీలించి వైద్యులు చనిపోయాడని నిర్ధారించరాని తెలిపారు, కేతావత్ జ్యోతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


# చిరుత సంచారం

**ధరూరు మే 10 (జనం సాక్షి) :** వాములపల్లి గ్రామానికి చెందిన ఊరబాయి అనిల్ తండ్రి ఊర బాయి కృష్ణయ్య రోజు లాగానే శనివారం రోజు09-5-2026 తేదీన రాత్రి ఆవును దూడను కట్టేసి జాలిలో కట్టేసి రాగా దూడ పై దాడి చేసి చంపి తిన్నది .గతంలో కూడా ఫిబ్రవరి నెలలో మేకల ప్రభాకర్ ఆవు దూడను తిన్నది వానపల్లి గ్రామ మరియు చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు రాత్రివేళ చిరుత జంతువులపై దాడి చేస్తున్నది ప్రజలు భయాందోళన చెందుతున్నారు అటవీ శాఖ అధికారులు చిరుతను గుర్తించి తగు చర్యలు తీసుకోగలరు అని వానపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు

## కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్‌షిప్‌లో
# పారమిత విద్యార్థికి లక్ష నగదు బహుమతి

### పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద రావు

**కరీంనగర్ బ్యూరో, మే 10 (జనంసాక్షి) :** కాగ్నిటివ్ స్కోర్ ఎఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్‌షిప్ తెలంగాణ 2026'లో కరీంనగర్‌కు చెందిన పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థిని ఎం. యువన అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిందని పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద రావు తెలిపారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల నుండి 1,12,733 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. రెండు దశల్లో నిర్వహించిన ఈ పరీక్షల్లో, మొదటి దశ నుండి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 100 మందిని తుది దశకు ఎంపిక చేశారని, అందులో మిడిల్ స్టేజ్ విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న "ఎం. యువన" ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపారు. హైదరాబాద్‌లోని టి-హబ్ వేదికగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథి జయప్రకాష్ నారాయణ్ చేతుల మీదుగా యువన రూ. 1,00,000 ( లక్ష రూపాయలు) నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకుందని, ఈ విజయం పట్ల పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు హర్షం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించేలా తాము అందిస్తున్న శిక్షణకు ఈ అవార్డు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, రాకేష్, అనుకర్ రావు, వినోద్ రావు, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రిన్సిపల్ గోపి కృష్ణ పరాంకుశం, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, ఉపాధ్యాయ బృందం పాల్గొని యువనను ప్రత్యేకంగా అభినందించారు.



# తడిసిన ధాన్యంతో ధర్నా నిర్వహించిన బిఆరెస్ నాయకులు

**రుద్రంగి మే 10 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో రైతులతో కిలిసి ధర్నా నిర్వహించిన బిఆరెస్ పార్టీ నాయకులు., తడిసిన ధాన్యం బస్తాలను రోడ్డుపై పడేసి ధర్నా నిర్వహిం చారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని డిమాండ్ చేశారు.కలెక్టర్ రావాలంటూ నినదించారు. కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయని అన్నారు. ధాన్యం ఎప్పుడు కొంటారో హామీ ఇవ్వాలని ఏమ్మార్వోను ఏస్ఐని డిఎస్ఓ, డిఎంను కోరారు.రోజు రుద్రంగికి వస్తున్న ఎమ్మెల్యేకు రైతుల ధాన్యం కొనాలని ఎందుకు అనిపించడం లేదో వారికె తెలియాలని అన్నారు. మ్యాచర్ వచ్చిన వడ్లను తూకం వేయడంలో కూడా జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. రేవంత్ రెడ్డి పోవాలి కేసీఆర్ రావాలి అంటూ ధర్నా నిర్వహించారు.బిఆరెస్ ప్రభుత్వం లో రైతుల ధాన్యం త్వరిగతిన కొనుగోలు చేశామని అన్నారు. వ్యవసాయానికి అండగా కేసీఆర్ ప్రభుత్వం గతంలో పని చేసిందని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగా చేసిందని ఎద్దేవా చేశారు. తతమ్మ గుడి దగ్గర ఉన్న కొనుగోలు కేంద్రంలోకి లారీలు రావడం లేదని ఇప్పటివరకు కేవలం 4వేల క్వింటళ్ల ధాన్యం మాత్రమే కొన్నారని ఇంకా 30 వేల క్వింటాళ్ల ధాన్యం అలాగే ఉందని మళ్ళీ పంటలు వేసే సమయం వచ్చిన ధాన్యం కొనడం లేదని రైతులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, నాయకులు గంగం మహేష్,దేగవత్ తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, మంచే రాజేశం, చెప్పాలా గణేష్, ఉప్పులూటి గణేష్, గంగారెడ్డి, ప్రశాంత్, చంద్రయ్య, గంగాధర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.స్థానిక తాసిల్దార్ పుష్పలత, ఎస్సై మోతీరామ్ సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని తెలపడంతో ధర్నా విరమించారు.



# సెంట్రింగ్ పని బంద్‌కు మద్దతు

- నిరవధిక ధర్నా పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం
- మే 16 నుంచి ఉద్యమం



**నిజాంపేట్, మే 10 (జనంసాక్షి):** పేట్ బషీరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఎల్‌పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్న 'సెంట్రింగ్ పని బంద్' మరియు నిరవధిక ధర్నా కార్యక్రమానికి మద్దతు కోరారు.
ఈ సందర్భంగా జై దుర్గా భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (చింతల్-కుత్బుల్లాపూర్ జోన్), జై దుర్గా సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (దుండిగల్ జోన్), షాపూర్ నగర్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (షాపూర్ నగర్ జోన్) ఆధ్వర్యంలో సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, సెంట్రింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి కృషి చేస్తామని, మే 16 నుంచి తలపెట్టిన సెంట్రింగ్ బంద్ మరియు నిరవధిక ధర్నాకు తన మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.
కార్మిక నాయకులు మాట్లాడుతూ నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే వెంటనే సెంట్రింగ్ కాంట్రాక్టర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా పూర్తి దర్యాప్తు అనంతరమే చర్యలు తీసుకోవాలని, సెంట్రింగ్ కార్మికులకు ప్రతి అమావాస్యను చట్టబద్ధ సెలవు దినంగా ప్రకటించి కార్మిక, పోలీసు శాఖల సహకారం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.డి. చాంద్ పాషా, జై దుర్గా భవాని అసోసియేషన్ అధ్యక్షులు కుంట వేణుగోపాల్, షాపూర్ నగర్ జోన్ అధ్యక్షులు మక్బుల్, దుండిగల్ జోన్ అధ్యక్షులు సదానందం, ఉపాధ్యక్షులు సి. హెచ్. సత్తిబాబు, కుంటి వీరేష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, కోశాధికారి ఎం. వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు

- భద్రాచలం నుండి పట్టు వస్త్రాలు
- ఉత్సవమూర్తుల యాగశాల ప్రవేశం



**మల్యాల మే 10 (జనం సాక్షి) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం మొదటిరోజు పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆలయ ఆచార సంప్రదాయాల ప్రకారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం లాగే పెద్ద హనుమాన్ జయంతికి మొదటి రోజు భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం నుండి దేవస్థాన ఈవో దామోదర్ తీసుకువచ్చిన పవిత్ర శేష పట్టు వస్త్రాలను స్థానిక ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం శేష వస్త్రాలను స్వీకరించి వై జంక్షన్ నుండి ఒగ్గుడోలు డప్పు చప్పులతో మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో వేద మంత్రోచ్చారణల మధ్య శోభాయాత్ర నిర్వహించి ఆలయానికి తీసుకువచ్చి ఆలయ ఈవో ఎస్.అంజన రెడ్డి,స్థానాచార్యులు కపిందర్ స్వామి మరియు ఆలయ అర్చకులకు అధికారికంగా అందజేశారు.
పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో స్వస్తి వాచనము,రక్షాబంధనము, ఋత్విక్ వరణము, అ రుణి మథనము, దేవతా హ్వానము, యాగశాల ప్రవేశము,స్థాపిత దేవతారాధన,అగ్ని ప్రతిష్ఠ,హవనము తదితర వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకములు, సహస్రనామార్చన,పారాయణములు,నైవేద్యములు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు.
పట్టు వస్త్రాలకు ఇచ్చిన భద్రాచల దేవస్థానం ఈవో దామోదర్,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనాలు అందించి శేషవస్త్రంతో సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా రానున్న మూడు రోజుల పాటు యాగశాలలో లోక కళ్యాణం కోసం త్రైయాహ్నిక హోమాలు,ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### దేవాలయ ఆలయ ముస్తాబు

దేవాలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాల తో అలంకరణ చేశారు భక్తులకు ఇబ్బంది కలగకుండా చల్వ పందిళ్లు ఆలయ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ గుండి హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్,సునీల్,టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్,ఆలయ అర్చకులు, అధికారులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యువత మత్తు వదిలి మైదానానికి రావాలి

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు అభినందనీయం
- గెలుపు-ఓటములు సహజం.. క్రీడలు ప్రోత్సహించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో 500ం మార్కులు సాధించిన 98 విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే




**పెద్దపల్లి, మే 10 (జనంసాక్షి):** పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గత 25 రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, విజేతలైన సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామ జట్టుకు మొదటి బహుమతిగా రూ.50 వేల నగదు మరియు ట్రోఫీ, రన్నర్‌అప్‌గా నిలిచిన పెద్దపల్లి పట్టణం 9వ వార్డు జట్టుకు రూ.25 వేల నగదు మరియు ట్రోఫీలను అందజేశారు. ఉత్తమ క్రీడాకారులను వివిధ ట్రోఫీలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత మత్తు వదిలి మైదానానికి రావాలనే ఉద్దేశ్యంతో యువజన కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన క్రికెట్ పోటీలు అభినందనీయమని అన్నారు. క్రీడల్లో గెలుపు-ఓటములు సహజమని, గెలిచినవారు పొంగిపోకుండా, ఓడినవారు కుంగిపోకుండా ఉండాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా క్రీడాభిమాని కావడం వల్ల రాబోయే రోజుల్లో క్రీడలను మరింత ప్రోత్సహిస్తామని విజయరమణ రావు తెలిపారు.

### విద్యార్థుల సన్మానం

అదే రోజు పెద్దపల్లి పట్టణంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో పట్టణం మరియు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివి పదవ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థులను యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎమ్మెల్యే విజయరమణ రావు వారిని శాలువాలు, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొంకూరి అవినాష్, అసెంబ్లీ అధ్యక్షులు ముత్యాల నరేష్, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తిగా నిలిచిన దాసరి ఉష కృషి

## ఎస్ఎస్‌బి కమాండర్ ఆశీష్ పటేల్

**పెద్దపల్లి,మే 10(జనంసాక్షి) :** యువతలో క్రీడా స్ఫూర్తిని రగిలిస్తూ,గత 25 రోజులుగా పెద్దపల్లి నియోజకవర్గవ్యాప్తంగా సాగుతున్న జ్యోతిబా పూలే-అంబేద్కర్ జై యుగం కప్' క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో విజయవంతంగా ముగిసింది.బీసీ జేఏసీ చైర్‌పర్సన్ దాసరి ఉష ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్,పెద్దపల్లి మండలం లోని మదర్ థెరిస్సా కాలేజ్ గ్రౌండ్‌లో అత్యంత ఉత్సాహంగా జరిగింది.మండల స్థాయి ఫైనల్ మ్యాచ్‌లో పెద్దకాల్వల మరియు కొత్తపల్లి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మైదానమంతా క్రీడాకారుల కేరింతలు, అభిమానుల కోలాహలంతో సందడిగా మారింది.ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో పెద్దకాల్వల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి, విన్నర్స్ షీల్డ్‌తో పాటు రూ.10వేల నగదు బహుమతిని సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన కొత్తపల్లి జట్టు షీల్డ్ మరియు రూ.5వేల నగదును గెలుచుకుంది.ఈ ముగింపు వేడుకకు దాసరి ఉష భర్త ఎస్.ఎస్.బి కమాండర్ జుట్టు ఆశీష్ కుమార్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని,అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని కలుపుతూ గత 25 రోజులుగా ఇంతటి భారీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన దాసరి ఉష కృషిని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మహిళా కన్వీనర్ సిరవేణ స్వప్న,నర్ల సాయి,సంతోష్,20వ వార్డు కౌన్సిలర్ రాజేష్,ఎస్.సి.సి.ఎల్ కాంట్రాక్టర్ శ్రీనివాస్,అసెంబ్లీ కోఆర్డినేటర్లు భూమేష్,అబ్దుల్ మాలిక్,ఆర్గనైజర్ శ్రావణ్,రాజేందర్,సాగర్,క్రీడా కారులు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని ఆరేపల్లి సమీపంలో వెళుతున్న లారీ, కారు ఢీ కొట్టుకోవడంతో కారులోని ఒక యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. ప్రమాద ధాటికి కారు ముందు భాగం పూర్తిగా తెబ్బతింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తంగళ్ళపల్లి మండలంలోని మండపల్లి గ్రామానికి చెందిన వంశీ అక్కడికక్కడే మృతి చెందాడని మరొకరు నవీన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
11 మే 2026

# మార్కెట్ యార్డ్ స్థలంపై అక్రమ కబ్జాలు






***3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేస్తున్న వ్యాపార సముదాయాలు***

- రేకులు తొలగించి అక్రమ నిర్మాణాలు
- అధికారుల అలసత్వంపై స్థానికుల ఆగ్రహం
- బెల్ట్ షాపుతో పాటు ఇబ్బడి ముబ్బడి రూములు

**నిజాంపేట్, మే 10 (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నంబర్లు 87, 88లో మార్కెట్ యార్డ్ కోసం 2021లో 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు లేఅవుట్ చేసి ఫెన్సింగ్ చేశారు. కానీ గత రెండు సంవత్సరాలుగా ఈ స్థలంపై కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపట్టి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాజేస్తున్నారు.
మున్సిపల్ అధికారులు బ్లూ రేకులతో ప్రహరీ నిర్మించిన ఈ స్థలంలో మొదట కొన్ని రేకులు తొలగించి కంటైనర్, మెకానిక్ షెడ్‌లు వేసి కబ్జా చేశారు. తర్వాత టిఫిన్ సెంటర్, మరిన్ని అక్రమ రూములు నిర్మించారు. ఇటీవల మరో అక్రమ రూము నిర్మించి, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సర్వే నంబర్ 191గా చూపించి బెల్ట్ షాపు నడుపుతున్నారు. ఈ అక్రమ కబ్జాలపై గతం నుంచి పలు పత్రికల్లో వార్తలు వెలువడినా, స్థానికులు ఏసీసీ ఎన్.ప్రసీదాకు, డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీకు ఫిర్యాదులు చేసినా అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉపకమీషనర్ ఏసీపీని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించినా, కేవలం ఒక్క రూము మాత్రమే తొలగించి మిగిలినవి అలాగే ఉండటంపై స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.
ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఈ స్థలంలో అక్రమంగా వ్యాపార సముదాయాలు, బెల్ట్ షాపులు నడుపుతున్న వైనం స్థానికులను మరింత ఆగ్రహానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని అక్రమ నిర్మాణాలను తొలగించి, మార్కెట్ యార్డ్‌ను ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.








## బీసీలకు ఉద్యోగం మాత్రమే కాదు..
# అధికార భాగస్వామ్యం కావాలి

- ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి
- జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ సవరణ అవసరం
- ప్రమోషన్లు లేకుండా రిజర్వేషన్లకు అర్థం లేదు: పోలస నరేందర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 10 (జనంసాక్షి) :** బీసీలకు ఉద్యోగాలు మాత్రమే కాకుండా అధికారంలో భాగస్వామ్యం కావాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సాధికారిక సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పోలస నరేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రమోషన్లు లేకుండా రిజర్వేషన్లకు అర్థం లేదని, బీసీలకు ఉద్యోగాల్లో జనాభా దామాషా ప్రకారం ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. రాజ్యాంగం ప్రవచించిన సమానత్వం సాధించాలంటే ఇది తప్పనిసరని స్పష్టం చేశారు. ప్రస్తుతం బీసీలు ఉద్యోగం పొందడానికి మాత్రమే రిజర్వేషన్లు పరిమితం చేయడం, ప్రమోషన్లలో పూర్తి నిర్లక్ష్యం చేయడం సామాజిక అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడం వల్ల లక్షలాది మంది బీసీ ఉద్యోగులు ప్రమోషన్లు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### రాజ్యాంగ సవరణ అవసరం

ఆర్టికల్ 16(4ఎ) ప్రకారం బీసీలకు ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు వర్తించేలా పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టి, ప్రత్యేక మెజారిటీతో ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. 1993లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 27 శాతం రిజర్వేషన్లు ప్రమోషన్లలో కూడా అమలు చేయాలని పునరుద్ఘాటించారు. ప్రమోషన్ల ద్వారానే బీసీలు నిర్ణయాధికార స్థాయికి చేరుకోగలరని, జీతాలు పెరిగి, విధానాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదగగలరని నరేందర్ తెలిపారు. బీసీ ఉద్యోగ సంఘాలు ఒత్తిడి పెంచి, కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తేనే ప్రభుత్వాలు రాజ్యాంగ సవరణకు పూనుకుంటాయని అన్నారు.

# ధాన్యం కుప్పల మీదనే రైతులు ప్రాణాలు

- కొనుగోలు కేంద్రాల్లో జాప్యం, లారీలు రాక, తరుగు
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోంది: రసమయి
- కేసీఆర్ పాలన మళ్లీ రావాలని డిమాండ్



**ఇల్లంతకుంట, మే 10 (జనంసాక్షి):** ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట, గాలిపల్లి గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ధాన్యం తూకం వేయకపోవడం, లారీలు సకాలంలో రాకపోవడం వల్ల రైతులు తమ పంటను ప్రైవేట్ వ్యక్తులకు నష్టాలకు అమ్ముకోవాల్సి వస్తోందని విమర్శించారు. మార్చి చివరి వారంలోనే వరి కోతలు ప్రారంభమవుతాయని తెలిసినా, అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.
పండించిన పంటకు కొనుగోలుదారు లేక ధాన్యం కుప్పల మీదనే రైతులు ప్రాణాలు విడుస్తున్న దుర్భర పరిస్థితి నెలకొన్నదని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో, మార్కెట్ యార్డుల్లో నానా కష్టాలు పడుతున్నారని రసమయి బాలకిషన్ అన్నారు. కేసీఆర్ హయాంలో కరోనా మహమ్మారి సమయంలో కూడా ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం దళారుల చేతికి పడాలని చూస్తోందని, వడ్లను రైస్ మిల్లులు తీసుకోకపోవడం, కొనుగోలు కేంద్రాల్లో తరుగు, బీ-గ్రేడ్ పేరుతో ఎకరాకు రూ.700 నష్టం వస్తోందని ఆయన వివరించారు. బస్తాకు కిలో తరుగు, మిల్లుల్లో కటింగ్స్ వసూలు చేస్తున్నారని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని నమ్మించి యాసంగి పంటకు బోనస్ ఇవ్వకపోవడం రైతులను దగా చేస్తోందని ఆరోపించారు. ఒక రైతు పంట అమ్మాలంటే తేమ తనిఖీ, సంచులు, కాంటా, లారీ, మిల్లు అన్‌లోడింగ్‌ల కోసం వారం వారం ఎదురు చూడాల్సి వస్తోందని అన్నారు. యూరియా నిషేధం ఎత్తివేయాలి. వడ్లతో పాటు సన్‌ఫ్లవర్, జొన్న, మక్క, శనగలు యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలి. ప్రతి గింజను ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలి లేకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున గ్రామ గ్రామాన ధర్నాలు చేపడతామని రసమయి బాలకిషన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, ఇల్లంతకుంట మండల బీఆర్ఎస్ అధ్యక్షులు పల్లె నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ బి.ఎస్ లత



**మల్యాల మే 10 (జనం సాక్షి) :**
మల్యాల మండల కేంద్రం,ముత్యంపేట గ్రామాలలో ఐకెపి పిఎసిఎస్ ఏఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధ్యాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత ఆకస్మికంగా పరిశీలించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం,నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు.అలాగే ట్రక్ షీట్ నమోదు,ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని,ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్,సివిల్ సప్లై అధికారులు, సంబంధిత శాఖల అధికారులు,కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# యువకుని దారుణ హత్య



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జూల వంశీ అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆదివారం ఉదయం మంథని మండలం గాడిదల గండి సమీపంలో కుళ్లిన స్థితిలో ఆయన మృతదేహం లభ్యమైంది. ఏప్రిల్ 30వ తేదీ నుండి వంశీ కనబడకుండా పోవడంతో మూడు, నాలుగు రోజుల తర్వాత అతని కుటుంబ సభ్యులు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మృతుని కాల్ డేటా ఆధారం గా.. హైదరాబాద్కు సంబంధించిన ఒక యువతిని కలవడానికి వెళ్ళినట్లు గుర్తించిన పోలీసులు ఆ యువతిని అతని భర్తను తీసుకొచ్చి విచారణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

### లవ్ ఎఫైరే హత్యకు కారణమా..?

సింగిరెడ్డిపల్లికి చెందిన వంశీ అదే గ్రామానికి చెందిన ఒక యువతితో ప్రేమ వ్యవహారం నడిపాడు. తర్వాత క్రమంలో ఆమె వేరొకరిని ప్రేమ వివాహం చేసుకోవడంతో ఇద్దరి మధ్య బ్రేకప్ అయినట్లు తెలిసింది. కాగా, ఇటీవల గేట్ టూ గెదర్ సందర్భంగా కలువడం, యువతితో మళ్లీ అతను చనువుగా వ్యవహరించడంతో ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణలు మొదలయ్యాయి. ఇది తెలిసిన ఆ యువతి భర్త చాకచక్యంగా ఆ యువతి తోటే అతన్ని ఏప్రిల్ 30న హైదరాబాద్‌కు పిలిపించి హత్య చేసి అతని శవాన్ని మంథని సమీపంలోని గాడిదల గండిలో వేసినట్లు పోలీసుల ముందు ఒప్పుకోవడంతో వంశీ మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైనట్లు సమాచారం. హత్య జరిగి సుమారు పది రోజులు కావడంతో అతని మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో లభ్యమయింది.



# నీటి సంపులో పడి మూడేళ్ల చిన్నారి మృతి

**శంకర్ పల్లి, మే 10(జనం సాక్షి) :**
జన్వాడ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాట్నే శేఖర్ కుమార్తె ప్రియాన్ష (3) ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లింది.ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ సంపులో పడిపోవడంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు చిన్నారి కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. అనంతరం నీటి సంపులో చిన్నారి మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబాన్ని ఓదార్చారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నపిల్లలు ఆడుకునే ప్రాంతాల వద్ద తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. అలాగే నీటి సంపులు, బావులు, ట్యాంకులకు భద్రతా కవర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# రైస్ మిల్లుల్లో లోడింగ్-అన్‌లోడింగ్‌పై కఠిన నిఘా

- ప్రతి మిల్లుకు ఒక్క జీపీఓ నియమించినట్లు అదనపు కలెక్టర్
- వాహనాలు ఆలస్యం చేయకుండా వెంటనే అన్‌లోడింగ్ చేయాలి
- తరుగు పేరిట మోసం చేస్తే కఠిన చర్యలు



**శ్రీరంగాపూర్, మే 10 (జనంసాక్షి):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరుకున్న వాహనాలను ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే అన్‌లోడింగ్ చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం శ్రీరంగాపూర్ మండలం శేరిపల్లి గ్రామంలోని సప్తగిరి రైస్ మిల్లును అకస్మాత్తుగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని మిల్లు యాజమాన్యం మరియు అధికారులకు స్పష్టం చేశారు. ధాన్యం అన్‌లోడింగ్ సమయంలో కిలోల రూపంలో ఎలాంటి తరుగు తీయకూడదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి బరువుతోనే ధాన్యం సేకరించాలని ఆదేశించారు. రైతులు మిల్లు వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా తరుగు పేరిట మోసం జరిగితే లేదా వాహనాలను నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రైస్ మిల్లుకు లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడానికి గ్రామ పంచాయతీ అధికారులను (జీపీఓలు) నియమించినట్లు అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ అధికారులు మిల్లు వద్దనే ఉండి ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడనున్నారు.
అంతేకాకుండా ప్రతి మిల్లుకు నియమించిన స్పెషల్ ఆఫీసర్ లారీల రాకపోకలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, ఏ లారీ ఎప్పుడు వచ్చింది, ఎప్పుడు అన్‌లోడ్ అయిందనే వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు అశ్రమకష్టాలు పడి పండించిన ధాన్యానికి ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

## డివిజన్ స్థాయిలో ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 10 (జనం సాక్షి);** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో సోమవారం నిర్వహించే ప్రజావాణి తోపాటు డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాల యాల్లో ప్రతీ సోమవారం ఆర్డీఓలు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయా న్ని గమనించి ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలి


- బండి సంజయ్ కుమారుడిని కఠినంగా శిక్షించాలి
- పేట్ బషీరాబాద్ పీఎస్ ఎదుట బిఆర్ఎస్ మహిళా నాయకురాల్ల ధర్నా



**నిజాంపేట్ మే 10 (జనం సాక్షి) :**
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు మాట్లాడుతూ. బేటీ బచావోలి అంటూ మహిళల భద్రతపై పెద్ద ఎత్తున మాటలు చెప్పే బీజేపీ నాయకత్వం, ఇప్పుడు ఈ ఘటనపై స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. పోక్సో వంటి అత్యంత తీవ్రమైన కేసులో ఆరోపణలు ఎదుర్కొం టున్న వ్యక్తిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర సహాయ మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి, దర్యాప్తుకు సహకరించాలని మహిళా నాయకురాల్లు కోరారు. అధికార హోదాను ఉపయోగించి కేసును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరగకూడదని హెచ్చరించారు.
కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాధితురాలికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని, కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని విధాలుగా అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత, చిన్నారుల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాల్లు పావని, స్రవంతి, సునీత, శైలజ, మంజుల, అరుణారెడ్డి, ఇంద్రారెడ్డి, పద్మ, ఫర్జానా, హేమలత, లావణ్య, పార్వతి, కరీమా, కవిత, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగ సాధనలో నిరుద్యోగ యువతకు అండగా సుంకిరెడ్డి


- ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రంలో - ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ
- టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి రూరల్, మే 10, జనంసాక్షి:** గ్రామీణ నిరుద్యోగ యువత పోలీస్ ఉద్యోగాల సాధనలో ముందుకు సాగేందుకు అవసరమైన సహకారం అందిస్తనఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్-సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. ఆదివారం రోజు కల్వకుర్తి ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణా కేంద్రంలోఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన సందర్భంగావిద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామాలలో ఉన్న యువతలో ప్రతిభ,పట్టుదల ఉన్నప్పటికీ,సరైన మార్గదర్శకత్వం,నాణ్యమైన శిక్షణ, అధ్యయన వనరులు అందుబాటులో లేక చాలామంది ఉద్యోగ సాధనలో వెనకబడుతున్నారు,అలాంటి యువతకు తోడ్పాటును అందిస్తూ ఉద్యోగ సాధన దిశగా వారికి ధైర్యం కల్పించాలనే లక్ష్యంతోనే ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలుపుతూ,పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు కేవలం కోచింగ్ మాత్రమే సరిపోదని,పరీక్షల విధానం,పోటీ స్థాయిని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన స్టడీ మెటీరియల్ కూడా అత్యంత అవసరమని,యువతను ఉద్యోగ అవకాశాలకు చేరువ చేసేందుకు అవసరమైన ప్రతి సహకారాన్ని మా నుండి అందిస్తూ మా పోలీసు శిక్షణ శిబిరాలకు శిక్షణ కోసం వస్తున్న ప్రతి విద్యార్థికి తమ వంతు తోడ్పాటును అందిస్తున్నామని,చాలా మంది విద్యార్థులుఆర్థిక ఇబ్బందుల కారణంగా పుస్తకాలు,మెటీరియల్ కొనలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి పరిస్థితులు ఎవరి లక్ష్యాలకు అడ్డంకి కాకూడదనే భావనతోనే ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తున్నామని తెలిపారు,అభ్యర్థులు ప్రతిరోజూ క్రమశిక్షణతో చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు.అభ్యర్థులు మాట్లాడుతూ.. ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించడం తమలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించేందుకు మరింత కష్టపడతామని తెలుపుతూ, మాకు శిక్షణకు సంబంధించిన ప్రతి వనరును సమకూరుస్తూ తోడ్పాటును అందిస్తున్న సుంకిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ బృందంతో, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# దళితుని భూమిపై కన్నేసి అక్రమ రిజిస్ట్రేషన్

- 30 ఏళ్ల సాగు భూమి కోల్పోతున్న ఆవేదన
- ఘనపూర్‌లో దళిత కుటుంబం నిరాహార దీక్ష
- పంచాయితీ ముందు టెంట్ వేసి పోరాటం
- రెవెన్యూ, పోలీసులు స్పందించాలని డిమాండ్




**ఘనపూర్, తూప్రాన్, మే 10 (జనంసాక్షి):** పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చి, గత 30 ఏళ్లుగా సాగు చేస్తున్న తమ భూమిని ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఘనపూర్‌లో ఒక దళిత కుటుంబం నిరాహార దీక్షకు దిగింది. గ్రామపంచాయితీ కార్యాలయం ముందు టెంట్ వేసుకొని కుటుంబం మొత్తం ఒక్కటై పోరాటం చేస్తోంది. బాధితుడు ఏడేల్లి నర్సింలు తన భార్య లక్ష్మీ, సుశీల, లలిత, భాగ్య, కుమారులు సుధాకర్, వినయ్, ఎల్లం, భాస్కర్, విజయ్‌తో కలిసి దీక్ష చేపట్టారు. ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేసి "మాకు న్యాయం చేయాలి" అంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.
సర్వే నంబర్ 157లో 2.13 ఎకరాల ఈ వ్యవసాయ భూమి 1954-55 నుంచి అనువంశికంగా ఏడేల్లి హరిజన చిన్నబాలయ్య పేరిట ఉంది. తర్వాత పంచోటి ద్వారా పెద్ద కుమారుడు ఏడేల్లి హరిజన మైసయ్యకు 1 ఎకరా 07 గుంటలు, చిన్న కుమారుడు ఏడేల్లి హరిజన దుర్గయ్యకు 1 ఎకరా 06 గుంటలు వచ్చాయి. 1995లో మైసయ్య వద్ద నుంచి సర్వే నంబర్ 157/ఆ లోని 1 ఎకరా 07 గుంటల భూమిని సాదా బైనామా ద్వారా ఏడేల్లి నర్సయ్య (నర్సింలు) కొనుగోలు చేశారు. అప్పటి నుంచి గత 30 ఏళ్లుగా ఈ భూమిలో పంటలు పండిస్తూ కబ్జాలో ఉన్నారు.
ఇటీవల మైసయ్య మరణించిన తర్వాత అతని భార్య సువర్ణ పేరిట పౌతీ చేయించి, గ్రామస్తుడు ఆకుల మహేష్ పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన సర్వే వచ్చినప్పుడు విషయం తెలిసి, రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేశారు. స్పందన రాకపోవడంతో గ్రామపంచాయితీ ముందు దీక్షకు దిగాల్సి వచ్చింది. ఏడేల్లి నర్సింలు కుటుంబం తమ సాధారణ సాగు భూమిని కాపాడాలని, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్తులు మద్దతు తెలుపుతున్నా, రెవెన్యూ మరియు పోలీసు అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

## చిన్నారుల కంటి క్యాన్సర్ అవగాహనకు 'వైటాథాన్' రన్




హైదరాబాద్, మే 10 (జనంసాక్షి) : చిన్నారులలో వచ్చే అరుదైన కంటి క్యాన్సర్ 'రెటినోబ్లాస్టోమా'పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, పేద చిన్నారుల చికిత్సకు నిధులు సేకరించేందుకు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో గచ్చిబౌలి దగ్గర ఉన్న యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ వద్ద ఈ 'వైటాథాన్' రన్ ప్రారంభమైంది. హాఫ్ మారథాన్ 21.1 కిలోమీటర్ల పరుగును ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, అపోలో క్యాన్సర్ సెంటర్స్ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ అధ్యక్షులు అరుణ్ కుమార్ కల్లియప్పన్ ప్రారంభించారు. 10కే పరుగును ఆల్కాన్ ల్యాబొరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రీజినల్ సేల్స్ మేనేజర్ వెంకటేశ్ రెడ్డి ప్రారంభించారు. 5కే పరుగును ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కళ్లం అంజి రెడ్డి క్యాంపస్ హెడ్ డాక్టర్ మెర్లే ఫెర్నాండెజ్, డీజీఎమ్ - కార్పొరేట్ కమ్యూనికేషన్స్, ఎన్ఎండీసీ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇది ఎనిమిదో ఎడిషన్. ప్రపంచ రెటినోబ్లాస్టోమా అవగాహన వారం (మే 10 నుంచి 16వ తేదీ వరకు) సందర్భంగా నిర్వహించిన రన్ లో రెండు వేల మంది రన్నర్లు పాల్గొన్నారు. ఉదయం ఐదు గంటలకు 21కే, ఐదున్నరకు 10కే, ఐదు నలబై ఐదుకు 5కే, ఆరు గంటలకు 3కే రన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందాలంటే, ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమన్నారు. పిల్లల్లో వచ్చే అరుదైన, తీవ్రమైన కంటి క్యాన్సర్ రెటినోబ్లాస్టోమాపై అవగాహన కల్పించడమే ఈ రన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఏ బిడ్డ అయినా అనారోగ్యంతో బాధపడితే, అది ఆరోగ్యంపైనే కాకుండా ఎదుగుదల, అభివృద్ధిపై కూడా ప్రభావం చూపుతుందన్నారు.

ఈ సందర్భంగా అపోలో క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ రెటినోబ్లాస్టోమా లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వైటాథాన్ ద్వారా మనం తెలుసుకున్న విషయాలను మన మిత్రులు, బంధువులకు వివరిస్తే ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడానికి వీలవుతుందన్నారు. తద్వారా చిన్నారుల చూపును, ప్రాణాలను కాపాడడంలో మనం గొప్ప మార్పును తీసుకురాగలమన్నారు. వైటాథాన్ ద్వారా సేకరించిన నిధులను పేద చిన్నారులకు ఉచితంగా రెటినోబ్లాస్టోమా చికిత్స అందించడానికి, భవిష్యత్తు పరిశోధనల కోసం వినియోగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ జీఎన్ రావు, హైదరాబాద్ రన్నర్స్ అధ్యక్షులు అరుణ్ కలియప్పన్ పాల్గొన్నారు.

# దివ్యాంగ బాలునికి 'నిమ్స్' పునర్జన్మ

### విజయవంతంగా ఆహార నాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్స






హైదరాబాద్ (జనంసాక్షి) : క్లీనింగ్ పౌడర్ తాగి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న దివ్యాంగ బాలుడికి నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. అత్యంత క్లిష్టమైన ఈసోఫాగస్ (ఆహార నాళం) పునర్నిర్మాణ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. సొల్లు సాయి ప్రణీత్ 2024, డిసెంబర్ 5న ఇంట్లో ఉన్న డోమెక్స్ క్లీనింగ్ పౌడర్‌ను పొరపాటున తాగాడు. దీంతో బాలుడి ఆహార నాళం తీవ్రంగా దెబ్బతిని, ఆహారం మింగలేని పరిస్థితి ఏర్పడింది. పోషకాహారం అందించడం కోసం మొదట పొట్టలోకి ఫీడింగ్ ట్యూబ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం 2025, జూలై 31న మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌లోని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి తరలించారు.


సాధారణంగా ఇలాంటి గాయాలైనప్పుడు ఏడాది కాలం వేచి చూసిన తర్వాతే పునర్నిర్మాణ శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. వైద్యుల పర్యవేక్షణలో ఏడాది గడిచిన తర్వాత, ఈ ఏడాది ఏప్రిల్ 17న సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. బీరప్ప నేతృత్వంలోని బృందం భారీ శస్త్రచికిత్సను నిర్వహించింది. దాదాపు రూ. 5 లక్షల ఖర్చయ్యే ఈ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఉచితంగా అందించారు. బాలుడి ఆహార నాళం పూర్తిగా మూసుకుపోవడమే కాకుండా, అతను మానసిక దివ్యాంగుడు కావడంతో శస్త్రచికిత్స అనంతరం అతడిని పర్యవేక్షించడం వైద్యులకు సవాలుగా మారింది. అయినప్పటికీ, నిమ్స్ వైద్య బృందం సమిష్టి కృషితో సర్జరీని విజయవంతం చేసింది. ప్రస్తుతం బాలుడు సాధారణంగా ఆహారం తీసుకుంటున్నట్లు వైద్యులు వెల్లడించారు.

గడిచిన 34 ఏళ్లలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఇలాంటి 600 పైగా కేసులను డీల్ చేసిందని, అందులో 300కు పైగా పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. చికిత్స పొందిన వారిలో 99.4 శాతం మంది సాధారణ స్థితికి చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కేసు కాంప్లికేటెడ్ అని... అయినప్పటికీ తమ వైద్య బృందం శస్త్రచికిత్సను విజయవంతం చేసి బాలునికి పునర్జన్మను ఇచ్చిందని తెలిపారు. చికిత్స కోసం ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్లలో వాడే క్లీనింగ్ పౌడర్లు, యాసిడ్ల విషయంలో అజాగ్రత్తగా ఉండొద్దని వైద్యులు హెచ్చరించారు. రసాయనాలను పాత వాటర్ బాటిళ్లలో లేదా లేబుల్ లేని డబ్బాల్లో ఉంచవద్దని సూచించారు. విషపూరిత పదార్థాలను పిల్లలకు అందనంత ఎత్తులో లేదా తాళం వేసిన క్యాబినెట్లలో ఉంచాలని తెలిపారు. వాటిని వాడే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం జీవితకాలం ఇబ్బంది పెడుతుందని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఎందుకు బర్తరఫ్ చేయలేదు?

- చర్యలు తీసుకోకుండా పక్కన కూర్చుండబెట్టుకుంటారా?
- రేవంత్ ఫెయిల్యూర్ హోంమంత్రి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై ఫోక్సో కేసు నమోదైతే బండి సంజయ్‌ను ఎందుకు బర్తరఫ్ చేయలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసుకు సంబంధించి బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక విషయాలు వెల్లడించారు. తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని స్వయంగా మైనర్ బాలిక వచ్చి పోలీసుల ముందు చెప్పిందని తెలిపారు. బాధితురాలు న్యాయం కోసం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఇంతకీ ఆమె ఏం పాపం చేసింది, ఆమె కుటుంబం చేసిన పాపమేంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. బాధితురాలి తల్లితో ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు మాట్లాడానని తెలిపారు. బిడ్డకు న్యాయం జరగాలని ఆ తల్లి పడ్డ వేదన బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో న్యాయం ఇంత ఘోరంగా ఉంటుందా అని వ్యాఖ్యానించారు. చట్టం ఉన్నవాళ్లకు చుట్టంలా ఉంటదా అని అనిపిస్తోందని మండిపడ్డారు. ఆ తల్లితో మాట్లాడుతుంటే.. ఆమె చెప్పిన విషయాలు బాధ కలిగించాయని వివరించారు. 'మే 8వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో ఆమె పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ కంప్లయింట్ అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వడానికి ఐదు గంటల సమయం పట్టింది. కంప్లయింట్‌లో ఉన్న కంటెంట్ మార్చాలని పోలీసులు ఒత్తిడి పెట్టారు. ఇందులో పెద్దపెద్ద వాళ్లు ఉన్నారని బెదిరించారు. పెద్దపెద్ద వాళ్ల పేర్లు రాయొద్దని సూచించారు. చివరకు ఆ తల్లి నా బిడ్డ, నేను మోదీ సభలో ఆత్మహత్య చేసుకుంటామని భయపెడితే తప్ప కంప్లయింట్‌కు అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వలేదు. అప్పటికి కూడా ఎఫ్ఐఆర్ డీటెయిల్స్ వారికి ఇవ్వలేదు. ఎఫ్ఐఆర్ కాపీ వచ్చిందో రాలేదో బాధితులకు తెలియదు. నేను ఆ తల్లితో మాట్లాడిన తర్వాతే ఎఫ్ఐఆర్ డీటెయిల్స్ తెలిశాయి.' అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇది హోంమంత్రిగా ఉన్న రేవంత్ పాలనలో నాలుగు పాదాలపై నడుస్తున్న ధర్మమని మండిపడ్డారు. 'మోదీ గారూ.. మీరు ఈ దేశానికి ప్రధానమంత్రి.. బేటీ బచావో అనే నినాదం మీ నోటి నుంచే వచ్చింది. కానీ ఈ దేశంలో మహిళలపై అడుగడుగునా అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఆడబిడ్డ పుట్టకముందే చంపేస్తున్నారు. మీ కేబినెట్ మంత్రి బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు నమోదైంది. బండి సంజయ్ కొడుకు మైనర్ బాలికను బలత్కారం చేశాడు. ఆ కేంద్రమంత్రి ఇప్పుడు మీ పక్కనే కూర్చున్నాడు. మీ వేదిక ముందు వేలాది మంది తెలంగాణ మహిళలు కూర్చున్నారు. ఇప్పటివరకు మీరు బండి సంజయ్‌ను ఎందుకు బర్తరఫ్ చేయలేదు.' అని ప్రశ్నించారు.



## బండి భగీరథపై చర్యలు తీసుకోండి

- బీఆర్ఎస్వీ డిమాండ్
- డీజీపీ ఆఫీస్ ముట్టడి

హైదరాబాద్ (జనంసాక్షి) : బాలికపై అత్యాచారం చేసి పోక్సో కేసులో నిందితుడైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై చర్యలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ బీఆర్ఎస్వీ నాయకులు ఆదివారం డీజీపీ ఆఫీస్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బండి భగీరథపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఉల్టా మైనర్ బాలిక కుటుంబ సభ్యులను వేధించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని, బాధితురాలికి సరైన న్యాయం చేసి రక్షణ కల్పించాలని కోరారు. బండి సంజయ్ కొడుకును కాపాడే ప్రయత్నం చేస్తున్న రేవంత్ రెడ్డికి కొంచెమైనా సిగ్గుండాలని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకుకు ఒక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయమా? అంటూ ప్రశ్నించారు.

# విభజన చట్టంలోని సమస్యలను పరిష్కరించాలి

### భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్



హైదరాబాద్ (జనంసాక్షి): విభజన చట్టంలోని సమస్యలను పరిష్కరించాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్ డిమాండ్ చేవారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేసి కాంగ్రెస్ చేతిలో పెట్టిందని తెలిపారు. వికసిత్ భారత్ తెలంగాణ రైజింగ్‌ను అనుసంధానం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారని తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే అనేక సార్లు రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి ప్రధాన మంత్రి మోడీని, కేంద్ర మంత్రులను కలిసి ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీ, మెట్రో ఫేజ్ 2, మూసీ పునరుజ్జీవంపై మాట్లాడారని, విభజన చట్టంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రధాని మోడీని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపైన అసెంబ్లీలో తీర్మానం చేశారని, క్యాబినెట్ లో ఆమోదించి ఆర్డినెన్స్ ఇచ్చారని చెప్పారు. కేంద్రం వద్ద బీసీ బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. మోడీ పెద్ద బీసీ నాయకుడని బీజేపీ ప్రచారం చేస్తోందని.. పెండింగ్‌లో ఉన్న బీసీ రిజర్వేషన్లపై ఏం చేస్తారో తెలంగాణ బీసీ బిడ్డలకు మోడీ సమాధానం చెప్పాలని సూటి ప్రశ్న వేశారు. కేంద్రం జనగణనలో కులగణన ఎందుకు పెట్టలేదని, జనగణనలో ఓబీసీ కాలమ్ పెట్టలేదని, దీనిపై మోడీ సమాధానం చెప్పలేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.



## పవన్ కల్యాణ్.. ఆరోగ్యం ఎలా ఉంది!

- జనసేనానికి ప్రధాని మోడీ పరామర్శ

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రధాని నరేంద్ర మోడీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేస్తుండటంతో అటు రాజకీయ వర్గాల్లో, ఇటు సోషల్ మీడియాలో భారీ ఎత్తున చర్చ కొనసాగుతోంది. ఈ ఇద్దరు అగ్రనేతల భేటీ ప్రాధాన్యత సంతరించుకోవడంతో పవన్ నివాసం వద్ద సందడి నెలకొంది. ఈ క్రమంలోనే పోలీసులు ముందస్తు జాగ్రత్తగా పవన్ ఇంటికి వెళ్లే రహదారులన్నింటినీ తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసి భారీ భద్రతా వలయాన్ని నిర్మించారు. భద్రతా కారణాల దృష్ట్యా పవన్ కళ్యాణ్ ఇంటి వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడమే కాకుండా, ఎవరినీ అటువైపు అనుమతించడం లేదు. కేవలం అనుమతి ఉన్న వాహనాలను మాత్రమే క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపిస్తున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆ ప్రాంతమంతా పోలీస్ పహారాలో ఉండటంతో స్థానికంగా హై అలర్ట్ ప్రకటించారు. ఈ చారిత్రాత్మక భేటీలో ఏయే అంశాలు చర్చకు వస్తాయనే దానిపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# పన్నెండేండ్లలో వచ్చిన నిధులెన్ని?

- తెలంగాణపై బీజేపీది ఎప్పటికీ సవతి తల్లిప్రేమే!
- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




హైదరాబాద్ (జనంసాక్షి) : ఈ 12 యేళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు తీసుకువచ్చిన నిధులు ఎంతో బీజేపీ మంత్రులు, ఎంపీలు చెప్పాలని, తెలంగాణ పై మొదటి నుంచి సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సీఎల్పీ మీడియా సెంటర్ లో మీడియాతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కాగానే ఏడు మండలాలను ఆంధ్రాకు ఇచ్చారని, పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు..కానీ, ఆ తర్వాత ఆ ఊసే లేదని ఆయన మండిపడ్డారు. పోలవరానికి జాతీయ హోదా ఇచ్చారు..శరవేగంగా అక్కడ పనులు జరుగుతున్నాయి..తమ పాలమూరు బిడ్డలు భారతదేశంలో లేరా? ఎందుకింత నిర్లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి నిలదీశారు. అమరావతి నిర్మాణం కోసం వేల కోట్లు ఇస్తున్న కేంద్రం భారత్ ఫ్యూచర్ సిటీ కి రూపాయి ఇవ్వడం లేదని, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి బీజేపీ నాయకులు అడ్డు పడుతున్నారని ఆయన ఆరోపించారు. గుజరాత్‌లో గిఫ్ట్ సిటీ పెట్టి పారిశ్రామిక రాయితీలు ఇస్తున్నారని, హైదరాబాద్ లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కు కూడా రాయితీలు ఇస్తే బాగుండేది.. కానీ, తీరని అన్యాయం చేశారని విమర్శించారు. మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం లేకపోవడంతో సొంత నిధులతో చేపట్టాల్సి వస్తోందని, మోదీ చూడగానే తెలంగాణ బీజేపీ నాయకులు నోరుమెదపడం లేదని ఆయన మండిపడ్డారు.

కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, నిధులు అన్నింట్లో ఆంధ్రప్రదేశ్ తో పోల్చినప్పుడు తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, ఏపీకి నిధుల వరద పారుతోందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దేశంలోనే అత్యధిక అవినీతి రాష్ట్రం తెలంగాణ అని మోదీ విమర్శించారని, కేసీఆర్ కుటుంబంపైన ఈగ కూడా వాలనివలేదు..ఒక్క కేసు పైన కూడా విచారణ జరపలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణ కోరితే డెస్క్‌లో పెట్టి కేంద్రం తాళం వేసిందని, వంద రోజుల్లో కేసీఆర్ ను జైలులో వేస్తామన్న బీజేపీ, బీఆర్ఎస్ బలం ఫెవికాల్ కంటే ధృడమైనదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శలు గుప్పించారు. విద్యలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్న రాష్ట్రానికి కేంద్రం ఎందుకు సహకరించడం లేదు? ఎఫ్ఆర్బీఎం పరిధి నుంచి ఎడ్యుకేషన్లకు సంబంధించిన రుణాలను మినహాయించాలని కోరితే కేంద్రం పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ తోకపట్టుకుని కుర్చీలో కూర్చోవాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని, అవినీతి బీఆర్ఎస్ నాయకులను జైలులో పెట్టాలన్న ఆలోచన బీజేపీకి లేదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

#### అన్నింటికి అనుమతులు, నిధులు ఇవ్వాలి : ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

మోదీ పర్యటనతో తెలంగాణకు న్యాయం జరుగుతుందన్న భావన ఉందని, తెలంగాణ పైన శీతకన్ను చూపించకూడదని శాసన మండలిలో ప్రభుత్వ విప్, అద్దంకి దయాకర్ విజ్ఞప్తి చేశారు. డబల్ ఇంజన్ సర్కార్ అయితేనే సహకరిస్తామన్న భావన వద్దని, మోదీ, బీజేపీ నాయకులు తెలంగాణపైన ప్రేమ పెంచుకోవాలని ఆయన కోరారు. ఆదివారం సీఎల్పీలోని మీడియా సెంటర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ కూడా గతంలో తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా మాట్లాడారని, ఇటీవల బీజేపీ ఎంపీ తేజశ్వీ సూర్య తెలంగాణను పాకిస్తాన్ తో పోల్చారు.. ఎందరో అమరవీరుల త్యాగఫలం తెలంగాణ.. ఆంధ్రా, తెలంగాణ ప్రధాని మోదీ రెండు కళ్లలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ఆకులో ఆకునై.. కొమ్మలో కొమ్మనై..

ఆకులో ఆకునై కొమ్మలో కొమ్మనై రెమ్మలో రెమ్మనై నును లేత కొమ్మనై ఈ అడవి దాగిపోనా ఎటులైన ఇచటనే ఉండిపోనా!! ఈ పాటలో అర్థం ఉన్నట్టుగానే ఓ అందమైన రామచిలుక మామిడి చెట్టుపై వాలింది. ఎటూ చూసిన ఆకుపచ్చ ఆకులతో చెట్టు కనువిందు చేస్తుంటే ఆ ఆకుల మధ్య కూర్చున్న చిలుక తనువంతా కూడా లేత ఆకుపచ్చగా ఉండడంతో చెట్టు ఆకుల రంగు చిలుక రంగు ఒక్కటిగా మారడంతో ఆకులో ఆకునై కొమ్మలో కొమ్మనై ఈ చెట్టు ఆకుల మధ్యే ఉండి పోతే ఎంత బాగుండు అంటూ చిలుక సంబరపడిపోతున్న ఈ అందమైన దృశ్యాన్ని జిల్లాకు చెందిన వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆదివారం ఆదిలాబాద్ జిల్లా లోని ఇంద్రవెల్లి అడవుల్లో తన కెమెరాలో బంధించాడు.

– ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370